www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 217 | శనివారం | 27 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం


Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

ఆదిలాబాద్‌లో చలితీవ్రత 2

- 5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- రామగుండంలోనూ డిటో

బల సంపన్న భారతం



గణతంత్ర దినోత్సవం సందర్భంగా రైసినా హిల్స్ రాజ్‌పథ్‌లో జరిగిన భారత సైనిక పాటవ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నది. మహిళా బైకర్ల బృందం 'సీమా భవానీ' తొలి అద్భుత ప్రదర్శన, వాయుసేన విమాన విన్యాసం, రుద్ర హెలికాప్టర్ల ఉత్కంఠభరిత ప్రదర్శన, నేత్ర ఎయిర్‌క్రాఫ్ట్, సుఖోయ్ యుద్ధ విమానాలు, బ్రహ్మోస్ క్షిపణి, ఆకాశ్ ఆయుధ వ్యవస్థలు మొదలైన బలాలు, బలగాలతో మన దుర్భేద్య రక్షణ కవచం కన్నులపండువ చేసింది.

లోపలి పేజీల్లో

ఘనంగా గణతంత్ర పండుగ

అమరసైనికుడి త్యాగానికి రాష్ట్రపతి కంటతడి





అమర సైనికుడు జ్యోతిప్రకాష్ నీరాలా భార్య, తల్లికి అశోక చక్రను అందజేస్తున్న రాష్ట్రపతి



రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రధాని మోడీ



రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది 3

- గవర్నర్ నరసింహన్ ప్రశంస

ఎన్నికల పంచాయతీ

ముందస్తు సరే, సకాలంలోనైనా జరుగుతాయా?

- అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో గూడుకట్టుకున్న అనుమానాలు
- ఇప్పటికీ కొలిక్కిరాని మొత్తం పంచాయతీల జాబితా, వార్డుల పునర్విభజన, చట్టసవరణ
- వీటన్నింటికీ మరింత సమయం పట్టే సూచన
- మే చివరి కల్లా అయినా ఎన్నికల నిర్వహణ సాధ్యమేనా అనేది అసలైన ప్రశ్న



మన తెలంగాణ / హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికలు ముందస్తుగా జరుగుతాయని గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. ముందస్తు మాటేమో కానీ నిర్ణీత సమయంలోనైనా జరుగుతాయా అనే అనుమానాలు అటు అధికారుల్లో, ఇటు ప్రజా ప్రతినిధుల్లో వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలోని పరిస్థితులే ఇందుకు కారణం. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు సూచించినట్లుగా ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు కనిపిస్తున్నా అనుమానాలు మాత్రం బలంగానే ఉన్నాయి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అన్ని రాష్ట్రాల్లో గడువులోగా పంచాయతీ ఎన్నికలు పూర్తి కావాలి. ఈ ఏడాది ఆగస్టు ఒకటిన పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాలి. ప్రస్తుత పంచాయతీరాజ్ చట్టం ప్రకారం మూడు నెలల్లోపు ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించవచ్చని ఒక తరువాయి 6లో

7 బొడ్డుపల్లి శ్రీనివాస్‌ది ప్రభుత్వ హత్యే

- ఉత్తమ్‌కుమార్ రెడ్డి



6 సంతలో కాల్పుల కలకలం

- పోలీసులతో పెనుగులాటలో చర్లపల్లిలో పేలిన ఉల్లి వ్యాపారి నాటు తుపాకీ
- వ్యాపారుల మధ్య తోపులాటలో ఇద్దరికి గాయాలు

3 గవర్నర్ తేనీటి విందును బహిష్కరించిన వామపక్షాలు, కాంగ్రెస్ ముఖ్య నేతలు

9 దావోస్‌లో మంత్రి కెటిఆర్‌కు అరుదైన గౌరవం

- రాష్ట్ర మంత్రిగా ప్రాతినిధ్యం, ప్రసంగం



రెవెన్యూ లోటు

- మూడు త్రైమాసికాల అనంతరం నమోదైన రాబడి 52 శాతం
- రూ.1.13 లక్షల కోట్ల లక్ష్యానికి డిసెంబర్ నాటికి వచ్చింది రూ.59,214 కోట్లు మాత్రమే

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో 1.13 లక్షల కోట్ల మేరకు రెవెన్యూ ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, మూడు త్రైమాసికాల అనంతరం 52 శాతం మాత్రమే సాధ్యమైంది. ఏప్రిల్ మొదలు డిసెంబరు వరకు రూ. 59,214 కోట్ల మేరకు మాత్రమే రెవెన్యూ ఆర్జించగలిగింది. అయితే రెవెన్యూ ఖర్చు మాత్రం 58 శాతం మేర (రూ. 63,213 కోట్లు) చోటు తరువాయి 6లో

రాజ్యాంగానికి గడ్డుకాలం

- అసాధారణ పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రజాస్వామ్యం

- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి 3



కుంచెపోటు



మనం పదేళ్ల వెనకబడి ఉన్నామని సింబాలిక్‌గా అట్లా చెప్పారా సార్..!

డివైడర్‌కు ఢీకొన్న సినీనటుడు నాని కారు

తప్పిన ప్రాణాపాయం

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో : సినీనటుడు నాని ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. శుక్రవారం ఉదయం జరిగిన ఘటనలో నానికి స్వల్ప గాయాలయ్యాయి. సకాలంలో కారు బెలూన్‌లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పిందని బంజారా హిల్స్ ఎసిపి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఓ సినిమా షూటింగ్‌ను ముగించుకుని తన ఇన్నోవా కారు (టిఎస్ 07 ఎఫ్‌సి 0024)లో తిరుగు తరువాయి 6లో





'పద్మా'ల్లో తెలంగాణను పట్టించుకోలేదు : ప్రధానికి వినోద్ లేఖ



మన తెలంగాణ/హైదరాబాద్: ప్రతిష్టాత్మకమైన పద్మఅవార్డుల ఎంపికలో కొన్ని రాష్ట్రాలకే పెద్దపీట వేస్తూ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలను పట్టించుకోకపోవడం పట్ల టిఆర్ఎస్ ఎంపి బి.వినోద్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోడికి లేఖ రాశారు. పద్మ అవార్డులకు నిర్దేశించిన మార్గదర్శకాలకు తగిన ప్రతిభ తెలంగాణ రాష్ట్రంలో చాలా మంది కవులు, కళాకారులకు ఉన్నప్పటికీ వీరిలో ఒక్కరు కూడా అవార్డులకు ఎంపిక కాకపోవడం నిరాశకలిగించిందని అన్నారు. కొన్ని రాష్ట్రాలకు పెద్ద సంఖ్యలో అవార్డులను ఎంపిక చేసి, ఇంకొన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కూడా ఇవ్వకపోవడం మంచి సంప్రదాయం కాదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పద్మఅవార్డులకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను అందజేసినా వాటిని ఎంపిక కమిటీ పరిగణలోకి తీసుకోకపోవడం తమను ఆశ్చర్యానికి గురిచేసిందని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. నియోజవర్గాల పునర్విభజన అంశం బిజెపి అధ్యక్షులు అమిత్ షా, టిడిపి అధ్యక్షులు ఎన్.చంద్రబాబునాయుడుల మధ్య దోస్తీ, ఒప్పందం మీదనే ఆధారపడి ఉంటుందని వినోద్ కుమార్ అన్నారు. రాజ్‌భవన్ 'ఎట్ హోమ్'లో పాల్గొన్న ఆయనను పునర్విభజనపై జర్నలిస్టులు ప్రశ్నించగా, సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు ఈ నెల 29న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు పెడతారన్న వార్తలు సరైనవి కావన్నారు.



వికలాంగ న్యాయవాదులకు ప్రోత్సాహం : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- **తెలంగాణ వికలాంగుల న్యాయవాదుల సంఘం ఆవిర్భావం**

మనతెలంగాణ/హైదరాబాద్ : న్యాయవ్యాదుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర న్యాయ, గృహ, దేవాదాయశాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాంపల్లిలోని ఐసిఎడిఆర్‌లో జరిగిన తెలంగాణ వికలాంగుల న్యాయవాదుల సంఘం ఆవిర్భావ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వికలాంగుల న్యాయవాదుల సంఘం ఏర్పాటు అభినందనీయమన్నారు. వీరికి ప్రభుత్వం తరపున తగిన ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. న్యాయవాదుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించిందన్నారు. ఎలాంటి సహకారం అందించాలో అన్ని బార్ అసోసియేషన్లతో సిఎం కెసిఆర్‌తో చర్చించిన తర్వాత నిర్ణయం వస్తుందని తెలిపారు. ఎంఎల్‌సి ఎన్.రామచందర్‌రావు మాట్లాడుతూ, వికలాంగులైన న్యాయవాదుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీనియర్ న్యాయవాది, వికలాంగుల న్యాయవాదుల సంఘం సలహాదారులు జెఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వికలాంగుల హక్కుల చట్టం – 2016ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ చట్టం ద్వారా వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలలో 5 శాతం రిజర్వేషన్ లభించడంతో పాటు గృహ నిర్మాణ రుణ సదుపాయాలలో ప్రయోజనం, ఉపకార వేతనాలు పొందుగలుగుతారన్నారు. సంక్షేమ పథకాలలో రిజర్వేషన్లు లేని కారణంగా చాలామంది వికలాంగులు ప్రయోజనం పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలలో 80 శాతం కంటే ఎక్కువ లోపం ఉన్న వికలాంగులకే పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఆ పరిమితులతో సంబంధం లేకుండా పెన్షన్ సదుపాయాన్ని కలిస్తున్నారని తెలిపారు. వికలాంగుల హక్కుల చట్టం–2016 అమలుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ వికలాంగుల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మహ్మద్ ఫరీదుద్దీన్, ప్రధాన కార్యదర్శి రాంచందర్ సంజయ్ పాల్గొన్నారు.

నీరుగారుతున్న భూపంపిణీ

- **దళితుల కోసం ముందుకు సాగని భూ సేకరణ**
- **పెరిగిన భూముల విలువలు**
- **లక్ష్యం పదివేల ఎకరాలు, పంపిణీ చేసింది 2,468 ఎకరాలు**



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మాకంగా చేపట్టిన దళితుల భూ పంపిణీ పథకం నీరుగారిపోతోంది. లక్ష్యాన్ని భారీగా నిర్ణయించినా అమలులో ప్రగతి అంతంతమాత్రంగానే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 4,665 మంది లబ్ధిదారులకు 12,021 ఎకరాలను మాత్రమే పంపిణీ చేయగలిగింది. భూమి లేని నిరుపేద దళితులకు 2017–18 సంవత్సరంలో 10,250 ఎకరాల సాగుభూమిని పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకున్నా ఇప్పటివరకు కేవలం 2,468.36 ఎకరాలను మాత్రమే పంపిణీ చేయగలిగింది. 1009 దళిత కుటుంబాలకు మాత్రమే లబ్ది చేకూరింది. దళితుల భూ పంపిణీకి ప్రభుత్వం ఈ ఏడాది రూ. 113. 77 కోట్లు మం జూరు చేయగా ఇప్పటివరకు ఇందుకు రూ. 73.43 కోట్లు మాత్రమే ఖర్చుచేసింది. 696 మంది లబ్ధిదారులకు మాత్రమే భూములు రిజిస్ట్రేషన్ జరిగింది. ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్నా ఈ సంవత్సరం లక్ష్యంలో నాల్గో వంతు భూ పంపిణీ కూడా పూర్తి కాలేదు

ప్రభుత్వానికి తలనొప్పిగా భూ సేకరణ : సాగుకు యోగ్యమైన భూమిని సేకరించడం అధికారులకు ప్రధాన సమస్యగా మారింది. పలు జిల్లాల్లో దళారులు రైతుల నుండి తక్కువ ధరలకు భూములను కొనుగోలు చేసి ధరలను విపరీతంగా పెంచేయడంతో అధికారులు తల పట్టుకుంటున్నారు. రాష్ట్ర రాజధాని శివారు జిల్లాల్లో భూముల ధరలు ఎకరాకు కోట్లలో ధర పలుకుతోందని, ఇంత ఎక్కువ మొత్తానికి ప్రభుత్వం కొనుగోలు చేయడం ఇబ్బందేనని అధికారులు వాపోతున్నారు. ప్రభుత్వం భూములను సేకరిస్తుందని తెలిసిన వెంటనే మధ్య దళారులు వాలిపోయి అధికారుతో కుమ్మక్కై రైతుల నుండి తక్కువ ధరకు భూములను కొనుగోలు చేస్తున్న సంగతి ప్రభుత్వానికి తెలియందేమీ కాదు. భూముల కొనుగోలు, రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం ఎకరాకు రూ.4.14 లక్షలు ఖర్చు చేసింది. ఒక్క అదిలాబాద్ జిల్లాలోనే 228 మంది ఎస్‌సి కుటుంబాలను ఈ పథకం కింద ఎంపిక చేసింది. మిగిలిన జిల్లాల్లో లబ్ధిదారుల సంఖ్య వందలోపే ఉంది. జిల్లాల్లో భూముల విలువలు అమాంతంగా పెంచేయడంతో ప్రభుత్వం తరపున భూ సేకరణ నిలిచిపోయింది. అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రం లోని 31 జిల్లాల్లో ఏకంగా భద్రాద్రి, జగిత్యాల, జనగాం, మహబూబ్‌నగర్, మేడ్చల్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, వరంగల్ అర్బన్, యాదాద్రి జిల్లాల్లో ఏ ఒక్క దళిత కుటుంబానికి కూడా ఈ ఏడాది భూ పంపిణీ జరుగలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాలుగేళ్ళలో 4,665 మంది ఎస్‌సి లబ్దిదారులకు సుమారు 12 వేల ఎకరాల మేర పంపిణీ అయింది. 2014–15లో 774 కుటుంబాలకు దాదాపు రెండు వేల ఎకరాలు మంజూరు కాగా ఇందుకు ప్రభుత్వం రూ.75.11 కోట్లు వెచ్చించింది. 2015–16లో 1933 కుటుంబాలకు ఐదు వేల ఎకరాలు పంపిణీ అయింది. ఇందుకు ప్రభుత్వం రూ. 215.24 కోట్లు మంజూరు చేయగా రూ.202.93 కోట్లు ఖర్చయింది. 2016–17లో 949 లబ్దిదారులకు 2,547 ఎకరాలు పంపిణీ అయింది. ఈ ఏడాది రూ. 115.27 కోట్లు మంజూరు చేయగా రూ.94.11 కోట్లు మాత్రమే ఖర్చయింది. దళితుల భూ పంపిణీ పథకానికి మంజూరు చేసిన నిధులను కూడా గత నాలుగేళ్ళలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఖర్చుచేయలేక పోయింది.

4 లక్షల ఎకరాలకు సాగునీరు

- **ప్రారంభమైన కల్వకుర్తి అదనపు ఆయకట్టు పనులు**
- **20 టిఎంసిల నుంచి 40 టిఎంసిల నీరు కేటాయింపు**



మన తెలంగాణ/హైదరాబాద్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పొడిగింపు పనులు మొదలయ్యాయి. చివరి ఆయకట్టుపై గందరగోళం నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల మెయిన్ కెనాల్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 4 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంటుంది. తొలుత ప్రణాళికలో కల్వకుర్తి ఎత్తిపోతల మూడో దశ మెయిన్ కెనాల్ 165 కిలోమీటర్లుగా పేర్కొన్నా స్థానిక నేతలు, రైతుల డిమాండ్ మేరకు మరో 59 కిలోమీటర్ల మేర పొడిగించింది. దీంతో అదనంగా 37,742 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.178 కోట్లతో పరిపాలనా అనుమతులు ఇచ్చింది.శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి 25 టిఎంసిల మిగులు జలాలు తీసుకుంటూ 3.4 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని తొలుత 2005లో చేపట్టింది. తొలి దశలో కొల్లాపూర్‌లో 13,000 ఎకరాల ఆయకట్టు, స్టేజ్ 2 కింద జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి 47 వేల ఎకరాలు, స్టేజ్ 3లో గుడిపల్లిగట్టు నుంచి 2.8 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలన్నది తొలుత రూపొందించిన ప్రతిపాదన. అయితే అదనపు ఆయకట్టును చేరుస్తూ మొత్తం 4 లక్షల ఎకరాలు సాగుచేసేలా 25 టిఎంసిల నుంచి 40 టిఎంసిలకు నీటి కేటాయింపులు పెంచారు. నీటి ఎత్తిపోతల కోసం ఐదు పంపులు, 4,800 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో ప్రధాన కాలువ నిర్మాణం అవసరమని అధికారులు అంచనాకు వచ్చారు. ప్రస్తుతం 3,200 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం మాత్రమే ఉంది. మెయిన్ కెనాల్ ఎత్తును 2 మీటర్ల మేర పెంచి లైనింగ్ చేసి పూడికను తీయడం ద్వారా సామర్థ్యాన్ని పెంచవచ్చని అధికారులు ప్రణాళిక రూపొందించారు. పెరిగిన ఆయకట్టుకు సరిపడా నీరివ్వాలంటే 20 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్లు అవసరం. దీనికి సంబంధించిన సర్వే తుది దశకు చేరుకుంది. ఐదు పంపుల ద్వారా 4800 క్యూసెక్కుల నీరు వస్తుంది.

చివరి ఆయకట్టు వరకు నీరు : యాసంగిలో శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, నిజాంసాగర్‌ల లో చివరి ఆయకట్టు రైతులకు కూడా నీరందేలా చూడాలని ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులకు సూచించారు. ఆయకట్టుకు నీరు చేరేలా, సరఫరాను క్రమబద్ధం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం జలసౌధలో ఈ మూడు ప్రాజెక్టుల ఆయకట్టుకు జరుగుతున్న సాగునీటి సరఫరాపై సమీక్ష జరిపారు. కాలువల వెంట సిఇ, ఎస్ఇ, ఈఈలు నిరంతరం తిరగాలని, నీటి సరఫరా తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి, పర్య వేక్షించాలని కోరారు. నీరు అత్యంత విలువైన దని, చుక్క నీరు కూడా వృథా పోకుండా, అత్యంత పొదుపుగా వాడాలని ఆయన కోరారు. సాగునీటి క్రమబద్ధీకరణ వ్యవహారంలో లోటుపాట్లకు స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లే బాధ్యత వహించాలని, మూడు ప్రాజెక్టుల పరిధిలో రబీ ఆయకట్టును కాపాడాల్సిఉందన్నారు. లోయర్ మానేరు డ్యాం ఎగువన, డ్యాం దిగువ ఉన్న ప్రాంతాల్లో నీటి సరఫరాపై మంత్రి సమీక్షించారు. ఎస్ఆర్ఎస్‌పి, ఎల్ఎండి ఎగువన 4,07,417 ఎకరాలు, ఎల్ఎండి దిగువన 1,52,588 ఎకరాలు, నాగార్జునసాగర్ కింద 5,25,629 ఎకరాల, నిజాంసాగర్ కింద 1,51,666 ఎకరాలకు ఈ యాసంగిలో తప్పనిసరిగా నీరు అందించాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధరరావు, చీఫ్ ఇంజనీర్లు శంకర్, సునీల్, మధుసూధన్‌రావు, ఎస్ఇ, ఇఇలు పాల్గొన్నారు.

సగం మంది నేరస్థుల జాడే లేదు

- **వారం రోజులుగా వెతికినా లభించని ఆచూకీ**
- **సర్వేలో తలలు పట్టుకుంటున్న పోలీసులు**

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణను నేరరహిత రాష్ట్రంగా మార్చేందుకు పోలీసు శాఖ ఇటీవల నిర్వహించిన 'సకల నేరస్థుల సమగ్ర సర్వే' ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. రాష్ట్రంలోని 31 జిల్లాలో 2.18 లక్షల మంది నేరస్థులు ఉన్నారని గుర్తించిన పోలీసులు వారి జాడ కోసం వారం రోజులుగా వెతుకుతూనే ఉన్నారు. ఈ నెల 18న ప్రారంభించిన ఈ సర్వే లో హోంగార్డు స్థాయి అధికారి నుంచి డిజిపి స్థాయి అధికారి వరకు పాల్గొన్నారు. ఆయా కమిషనరేట్లు, జిల్లా స్థాయిలో కమిషనర్‌తో పాటు ఎస్‌పిలు సైతం నేరస్థుల ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సర్వే అమలు పోలీసులకు తలనొప్పిగా మారింది.రికార్డుల్లో ఉన్న వివరాల ప్రకారం నేరస్థుల ఇండ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు. వారం రోజుల సర్వేలో సగం మంది నేరస్థుల చిరునామాలు మాత్రమే లభ్యమయ్యాయి. నేరం చేసి పట్టుబడిన సమయంలో తప్పుడు చిరునామాలు రాయించడంతో ఈ చిక్కు వచ్చిపడింది. అద్దె ఇళ్లలో ఉన్న నేరస్థులు జైలు నుంచి బైటకొచ్చాక పోలీసుల కంట పడకుండా ఇతర ప్రాంతాలకు మకాం మార్చారు. ఇలాంటి నేరస్థుల వివరాల సేకరణ సవాలుగా మారింది. సుమారు లక్షకుపైగా చిరునామాలు బోగసవేనని తేలింది. రాష్ట్రంలోని 2.18 లక్షల మంది నేరస్థుల సర్వే పూర్తి కావాలంటే మరో నెలరోజుల పాటు పట్టే అవకాశాలు ఉన్నాయి. సర్వే పూర్తి కావాల్సిందేనని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో వివరాలను రాబట్టడం స్థానిక పోలీసులకు కత్తిమీద సాములా తయారైంది.

ఆదిలాబాద్‌లో 5డిగ్రీల ఉష్ణోగ్రత



మన తెలంగాణ/హైదరాబాద్: ఆదిలాబాద్‌లో చలి విజృంభించింది. రికార్డు స్థాయిలో 5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని తొమ్మిది పూర్వ జిల్లాల్లోనూ ఉష్ణోగ్రతలు తగ్గాయి. మరో రెండు రోజుల పాటు ఆదిలాబాద్‌తో పాటు పలు జిల్లాలో కూడా చలిగాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాష్ట్రమంతటా గడచిన 24 గంటల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యాయని, రానున్న రెండురోజుల్లోనూ ఇదే తీరులో తగ్గుతాయని వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. గత 24 గంటల్లో ఆదిలాబాద్‌లో 5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, మెదక్‌లో 10 డిగ్రీలు, రామ గుం డంలో 11, ఖమ్మం, భద్రా చలంలో 12 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాధారణం కంటే కనిష్ట ఉష్ణోగ్రతల్లో భారీగా తగ్గుదల కనిపిస్తోంది. ఖమ్మంలో ఏకంగా 7 డిగ్రీల మేర ఉష్ణోగ్రత తగ్గి 12 డిగ్రీలుగా నమోదైంది. భద్రాచలంలో 6, హన్మకొండ, మెదక్, రామగుండంలలో 5 డిగ్రీలు, హకీంపేట, హైదరాబాద్, నిజామాబాద్‌లో గడచిన 24 గంటల్లో సాధారణ ఉష్ణోగ్రతలకంటే 3 డిగ్రీలచొప్పున ఉష్ణోగ్రత తగ్గింది. చలి ప్రభావం పెరిగింది.

ఎగిరిన మువ్వన్నెల పతాకం







మన తెలంగాణ / హైదరాబాద్ : భారత 69వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాజకీయ పార్టీల నాయకులు జాతీయ పతకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు.

గాంధీ భవన్‌లో : గాంధీ భవన్‌లో నిర్వహించిన గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో టి పిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ సీనియర్ నేతలు భట్టి విక్రమార్క, మండలి ఫ్లోర్ లీడర్ మహ్మద్ షబ్బీర్ అలీతో పాటు పొన్నాల లక్ష్మయ్య, అంజన్ కుమార్ యాదవ్, ఇతర నాయకులు హాజరయ్యారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అరాచక పాలన సాగుతోందన్నారు.

తెలంగాణ భవన్‌లో :తెలంగాణ భవన్‌లో 69వ గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీతో పాటు పార్టీ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, పార్టీ నేతలు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ భవన్‌లో :తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎల్. రమణ ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్. రమణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతుంటే ఈ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైలులో పెడుతోందన్నారు. పోలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇ. పెద్ది రెడ్డి, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి అరవింద్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమావత్ లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఆఫీసులో : రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును టిఆర్ఎస్ ప్రభుత్వం కాలరాస్తోందని బిజెఎల్‌పి నేత జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. 69వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జాతీయ జెండాను ఎంపి బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు, ఎంఎల్‌సి ఎన్.రాంచంద్రరావు, ఇంద్రసేనారెడ్డి, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

జెఎసి ఆధ్వర్యంలో : రాజ్యాంగ విలువలను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే తూట్లు పొడుస్తోందని తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ విమర్శించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్క రించుకుని హైదరాబాద్‌లోని జెఎసి కార్యాలయంలో శుక్రవారం జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన వారిపై రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగంగానే ప్రభుత్వం సవరణ చేసిందన్నారు. దీనిని ఉపసంహరించుకునేలా గవర్నర్ జోక్యం చేసుకోవాలని సూచించారు. దీక్షకు పూనుకున్న మందకృష్ణమాదిగ, ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు ఒంటేరు ప్రతాప్‌రెడ్డిని, అద్దంకి దయాకర్‌ను అన్యాయంగా అరెస్టు చేసిందన్నారు. జెఎసి ప్రతినిధులు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, జి.వెంకట్‌రెడ్డి, బి.ఎన్.రెడ్డి, ఒ.శంకర్, మాదుసత్యంగౌడ్, నిజ్జన రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యంలో : కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ, దానిని రిమోట్ కంట్రోల్ ద్వారా నడిపిస్తున్న సంఘ్ పరివార్ శక్తులు మత పరమైన విభేధాలు, చిచ్చును రగిల్చి దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు, రాజ్యాంగ విలువలను సంపూర్ణంగా విధ్వంసం చేసే దిశగా ప్రయత్నిస్తున్నాయని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువల పరిరక్షణకు పోరాటాలను మరింత ఉధృతం చేయాలని, జాతీయ పతాకాన్ని గౌరవించడంతో పాటు పతాకం కల్పించిన విలువలను శాశ్వతంగా నిలబెట్టాలన్నారు.భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, పలువురు పార్టీ, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రమాణాలు చేసిన వారే రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారన్నారు. బిజెపి మతోన్మాద చర్యలు ఎండగట్టి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరముందన్నారు.





గణతంత్ర వేడుకల్లో ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్



హైదరాబాద్ హజ్ భవన్‌లో...



మధ్యప్రదేశ్‌లో విద్యార్థులకు మార్కులకు బదులుగా స్మైలీలు

భోపాల్: చిన్నారుల్లో చదువు భారాన్ని తగ్గించేందుకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్త మార్పులతో ముందుకు రాబోతుంది. ప్రభుత్వ స్కూళ్లలో చదివే ఒకటి, రెండో తరగతి విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు ప్రొగ్రెస్ కార్డులో మార్కుల స్థానంలో స్మైలీలు(చిరునవ్వులు) ఇవ్వనున్నారు. నేర్చుకోవడం ఆసక్తికరంగా, తక్కువ ఒత్తిడి ఉండేలా నిర్ణయం తీసుకున్నామని ప్రాథమిక పాఠశాలలకు పాఠ్యాంశాలను రూపొందించే రాజ్యశిక్ష కేంద్ర డైరెక్టర్ లోకేశ్ జాతవ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు, జిల్లా కోఆర్డినేటర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఒకటో తరగతి నుంచే ఎక్కువ మార్కుల కోసం తల్లిదండ్రులు వారి పిల్లలను ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఒకటి, రెండో తరగతి విద్యార్థులకు మార్కులు ఇవ్వబోమని, పుస్తకాల్లోని ఎక్సర్‌సైజ్‌లు చేయడం, మౌఖిక పరీక్ష ఆధారంగా మూల్యాంకనం చేస్తామని జాతవ్ తెలిపారు. విద్యార్థి మౌఖిక పరీక్ష, విషయాన్ని బాగా అర్థం చేసుకోగలిగితే ప్రొగ్రెస్ కార్డులో మూడు స్మైలీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థి ఇంకా నేర్చుకునే దశలో ఉన్నట్లైతే రెండు స్మైలీలు, ఇంకా ఎక్కువ ప్రయత్నం చేయాల్సి ఉంటే ఒక స్మైలీ మాత్రమే ఇస్తామన్నారు. ప్రొగ్రెస్ కార్డులో స్మైలీలతోపాటు విద్యార్థి సాధించిన సాంఘిక, వ్యకిగత విశేషాలను నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు



ప్రగతి భవన్‌లో : సిఎం క్యాంపు కార్యాలయం ప్రగతి భవన్‌లో జరిగిన 69వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, సిబ్బంది ఈ పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అసెంబ్లీ.. మండలిలో పతాకావిష్కరణ



శాసన మండలిలో జరిగిన పతాకావిష్కరణకార్యక్రమంలో మండలి ఛైర్మన్ కె. స్వామిగౌడ్ జాతీయ పతాకాన్ని ఎగురు వేశారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మహ్మద్ మహమూద్ అలీ, మండలి ప్రతిపక్షనేత షబ్బీర్ అలీతో పాటు సభ్యులు మండలి డిప్యూటి ఛైర్మన్ నేతి విద్యాసాగర్‌తో పాటు పాతూరి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అసెంబ్లీలో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ మధుసూదనాచారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డిప్యూటి స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, అసెంబ్లీ సెక్రటరీ నరసింహాచార్యులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రాష్ట్రం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది

- దేశంలోని అనేక రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం
- సమీప భవిష్యత్‌లోనే బంగారు తెలంగాణ సాకారం
- జాతీయ సగటు కంటే ఎక్కువ వృద్ధిరేటు
- టిఎస్‌ఐపాస్‌తో రూ.1.18లక్షల కోట్ల పెట్టుబడులు రాక
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్





మన తెలంగాణ/హైదరాబాద్: అన్ని వర్గాల ప్రజల ఆశలను, ఆకాంక్షలను అక్షరాలా నెరవేరుస్తూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని గవర్నర్ ఇఎస్ఎల్. నరసింహన్ వ్యాఖ్యానించారు. మూడేళ్ళ క్రితం గణతంత్ర దినోత్సవంనాడు తాను చేసిన ప్రసంగంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్యానించానని, ఇప్పుడు దాన్ని రుజువుచేసే తీరులో ప్రగతి చోటుచేసుకుంటోందని, దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని, సమీప భవిష్యత్తులో బంగారు తెలంగాణ సాకారమవుతుందని అన్నారు. జాతీయ సగటు కంటే ఎక్కువ వృద్ధి రేటును సాధించి దేశ,లోనే ఆదర్శంగా ఉందన్నారు. టిఎస్ఐపాస్ ద్వారా రాష్ట్రంలో రూ. 1.18 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, సుమారు రెండు లక్షల ఉపాధి అవకాశాలు లభించాయని అన్నారు.69వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పరేడ్‌గ్రౌండ్స్‌లో శుక్రవారం గవర్నర్ జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 6,574 మెగవాట్ల విద్యుత్ ఉత్పత్తి అయితే ప్రస్తుతం 14,845 మెగావాట్ల ఉత్పత్తి అవుతోందని, భవిష్యత్తులో 28 వేల మెగావాట్లకు చేరుకుని మిగులు విద్యుత్ రాష్ట్రంగా అవతరిస్తుందని అన్నారు. ఈనెల 1 నుంచి వ్యవసాయ రంగానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడం గర్వకారణమన్నారు. రైతులకుఇన్‌పుట్ సబ్సిడీలను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం చర్యలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతోందన్నారు.

సంక్షేమానికి రూ.40వేల కోట్లు : సంక్షేమ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 40వేల కోట్లును ఖర్చుపెడుతోందని అన్నారు. వృద్ధులు, బీడి కార్మికులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు... ఇలా 38.87 లక్షల మందికి పెన్షన్లను అందిస్తున్నా మన్నారు. కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాల ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. ఆర్థికంగా వెనకబడిన అగ్రకులాల వారికి కూడా వర్తింపజేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. వచ్చే ఏడాది నాటికి మొదటి దశలో 2.65లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. రూ.42వేల కోట్ల అంచనాతో మిషన్‌భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ తాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ : వచ్చే (2018–19) ఆర్థిక సంవత్సరానికి గాను వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్టు గవర్నర్ వెల్లడించారు. 35 లక్షల మంది రైతులకు రూ.17వేల కోట్ల రుణాన్ని మాఫీ చేశామన్నారు. కల్తీ విత్తనాల తయారీ, విక్రయంపై కఠినంగా వ్యవహరిస్తూ నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి బడ్జెట్‌లో ప్రతి ఏటా రూ.25వేల కోట్ల నిధులను కేటాయిస్తున్నామన్నారు. దేవాదుల, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కొయిల్‌సాగర్ ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తున్నామని, రూ. 1.5 లక్షల కోట్లతో గోదావరి నదిపై కాళేశ్వరం, శ్రీసీతారామ , కృష్ణానది పై పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనులు చేపడుతున్నామన్నారు. ఈ ప్రాజెక్టులతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు ప్రయోజనం పొందుతాయన్నారు. మిషన్ కాకతీయ ద్వారా 46 వేల చెరువులను పునరుద్ధరించామని, తద్వారా సాగు, తాగునీటి అవసరాలు తీరడంతో పాటు సుమారు మూడు మీటర్ల వరకు భూగర్భ జల సంపద కూడా పెరిగిందని పేర్కొన్నారు. రైతులకు రెండు పంటలకు రూ. 8వేల పెట్టుబడి స్కీమును అమలు చేయనుందన్నారు. అవినీతి రహితంగా భూ రికార్డుల ప్రక్షాళన, రైతు సమితుల ఏర్పాటు , వ్యవసాయ అధికారి ఉద్యోగాలను భర్తీ చేసి 'అగ్రోనామిస్టులు'గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ చర్యలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి గోడౌన్ల సామర్థ్యం కేవలం నాలుగు లక్షల టన్నులు మాత్రమేనని, ఇప్పుడు అది 22.5 లక్షల టన్నులకు చేరుకుందన్నారు. రాష్ట్రంలోని సుమారు 7.61 లక్షల మంది యాదవ, కురుమలకు ఐదు వేల కోట్ల రూపాయల నిధులతో ఒకటిన్నర గొర్రెలను పంపిణీ చేయాలనే కార్యాచరణలో భాగంగా ఇప్పటి వరకు 40లక్షల గొర్రెలను పంపిణి చేసినట్టు వివరించారు. చేపల పెంపకం ద్వారా బెస్త, ముదిరాజ్‌లను, టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుతో చేనేత కార్మికులను, మోడ్రన్ సెలూన్ల ద్వారా నాయి బ్రహ్మణులకు, వాషింగ్ మిషన్ల పంపిణీ ద్వారా రజకులకు ప్రభుత్వం చేయూత నందిస్తోందని పేర్కొన్నారు. కెజి టు పిజి ఉచిత విద్యలో భాగంగా కొత్తగా 542 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయగా, ఎస్‌సిలకు 30, ఎస్‌టిలకు 22 డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను జాతీయ స్థాయి ప్రమా ణాలతో ఆధునీకరిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తుందన్నారు. 102, 104, 108, సర్వీసుల ద్వారా వేగంగా వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. గర్భిణీల కోసం ప్రత్యేకంగా కెసిఆర్ కిట్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 3174 కిలోమీటర్ల మేర ఉన్న జాతీయ రహదారులను 5,701 కిలోమీటర్లకు పెంచిన ప్రభుత్వం హరితహారం ద్వారా 230 కోట్ల మొక్కలు నాటే లక్ష్యంలో రెండు దశల్లో ఇప్పటివరకు 80 కోట్ల మొక్కలను నాటినట్లు వివరించారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు పరిపాలనలో సంస్కరణలను ప్రవేశపెట్టామని, ఇందులో భాగంగానే కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, పోలీస్ స్టేషన్లు, ఏర్పాటు అని అన్నారు.

ఐటి ఎగుమతుల్లో 12 శాతం వృద్ధి : ఐటి ఎగుమతుల్లో రాష్ట్రం 12 శాతం వృద్ధిని సాధించిందని, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్ లాంటి ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా ఈ రంగాన్ని విస్తరింపజేసినట్లు చెప్పారు. కొత్త పారిశ్రామిక విధానం ద్వారా 6,070 పరిశ్రమలకు అనుమతినివ్వగా, ఇది వరకే రెండు వేల పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించాయని, ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. రాష్ట్ర జిడిపి 13.9% మేర వృద్ధి సాధించగా, దేశ తలసరి ఆదాయం రూ. 1.03 లక్షలు మాత్రమే ఉంటే రాష్ట్రంలో మాత్రం అది రూ. 1.55గా ఉందని, ఈ ఏడాది డిసెంబరు నాటికి వృద్ధి రేటు 18%కు పెరుగుతుందని అన్నారు.

రాజ్యాంగానికి గడ్డుకాలం

- అసాధారణ పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రజాస్వామ్యం : జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ : దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగ కట్టుబాట్లు అసాధారణ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, ప్రసార సాధనాలు రాజ్‌దర్బారీలుగా మారాయని, అత్యున్నత న్యాయస్థానంలోని ప్రధాన న్యాయమూర్తి చర్యలు ప్రశ్నార్థకమవుతున్నాయని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మన రాజ్యాంగం (కానిస్టిట్యూషన్) ప్రమాదంలో పడలేదని, అది అందరి దగ్గర భద్రంగా ఉందని, అయితే రాజ్యాంగ కట్టుబాట్లు (కానిస్టిట్యూష్నలిజం) అసాధారణ స్థితిని ఎదుర్కొంటున్నాయని ఆయన అన్నారు. "రాజ్యాంగ పరిరక్షణ" అంశంపై ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్), ప్రొగ్రెసివ్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఒక సదస్సు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగింది. సదస్సులో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, 'వీక్షణం' సంపాదకులు ఎన్.వేణుగోపాల్, ప్రముఖ సంపాదకులు సి.రాఘవాచారి ప్రసంగించారు. సభకు ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించగా 'మన తెలంగాణ' సంపాదకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఐఎఎల్ ఎపి శాఖ ప్రీసిడియం సభ్యులు జి.జగదీశ్వర్, ప్రొగ్రెసివ్ ఫోరం ప్రతినిధులు బి.ఎస్ఆర్.మోహన్‌రెడ్డి, ఎన్.చక్రవర్తి వేదికపై ఆశీనులయ్యారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రసంగిస్తూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం గందరగోళంలో పడ్డాయని, సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయనందున వీధుల్లో కర్రలు, బరిసెలు, రాళ్లు పట్టుకుని ఒక సినిమాను చూడకూడదని కొందరు హెచ్చరిస్తున్నారని 'పద్మావత్'ను ఉద్దేశించి చెప్పారు. అతిత్వరలోనే తాము చూపిందే చూస్తావా, చస్తావా అనే పరిస్థితి కూడా ముందున్నదని, ఆ దిశగా దేశం ముందుకు పోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. త్రేతాయుగంలో ముక్కు కోసిన ఘటనను గుర్తు చేస్తూ తమకు వ్యతిరేకంగా మాట్లాడిన వారి ముక్కు కోసి తెచ్చిన వారికి కోట్ల రూపాయల నజరానాను నేడు బాహాటంగానే వివిధ సంఘాల నాయకులు ప్రకటిస్తున్నారని, పిల్లలను కూడా వదలని అరాచకం కొనసాగుతున్నదన్నారు. రాజ్యాంగం పదిలంగానే ఉన్నప్పటికీ రాజ్యాంగం నిర్దేశించిన వ్యవస్థలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. రాజ్యాంగానికి ప్రాణ వాయువు అయిన ఆదేశిక సూత్రాలని, రాజ్యాంగంలో పొందుపర్చిన భావ ప్రకటన సక్రమంగా అమలు జరగాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రపతి, గవర్నర్ వ్యవస్థలు పక్షపాత వ్యవస్థలుగా ఉండరాదని, రాజకీయాల్లో వాటికి తావు లేదని, పౌరులందరి తరపున వారు ప్రతినిధులని ఆయన స్పష్టం చేశారు. సమస్యలపై నిరాయుధులుగా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం పౌరుల ప్రాథమిక హక్కు అని, అది అడిగితే దక్కడం లేదు కానీ నేడు రకరకాల మారణ ఆయుధాలతో జాతీయ రహదారులపై స్వైర విహారం చేస్తున్న పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. దళ్, సేనలు, పరిషత్‌ల పేరుతో ఉన్న ఏ సంస్థలను అనుమతించవద్దని, వాటిని ప్రతిఘటించాలని, ప్రతి వ్యవస్థను, వ్యవస్థకు బాధ్యులైన ప్రతి వ్యక్తిని ప్రశ్నించాలని ఆయన సూచించారు. ప్రతివ్యవస్థలో పనిచేస్తున్న వారు చేసిన ప్రమాణాలకు కంకణబద్దులు కావాలని, రాజ్యాంగ విలువలను కాపాడాలన్నారు. ఆలోచనాపరులను, మాట్లాడడం ద్వారా వారి అభిప్రాయాలను నలుగురికీ నచ్చే విధంగా చెప్పగలిగే వారు, ప్రతిపక్షంలో ఉండి ప్రభుత్వాలను నిలదీసే వారిని పనిగట్టుకుని హింసించడం మానుకోవాలని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రసార మాధ్యమాలను కోరారు. ఎన్.వేణు మాట్లాడుతూ రాజ్యాంగం నిర్ధేశించిన ప్రకారం ఏ ఒక్క వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం వల్లనే రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. గత కొన్నేళ్లుగా పాలకులు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న దాని కంటే ఎక్కువగా గత రెండు మూడేళ్లుగా సంఘ్ పరివార్ శక్తులు విధ్వంసం చేస్తున్నాయని అన్నారు. కేవలం రాజకీయ సమానత్వం కాకుండా ఆర్థిక, సామాజిక సమానత్వం వస్తే తప్ప రాజ్యాంగం మనుగడ సాధ్యం కాదన్నారు. సి.రాఘవాచారి మాట్లాడుతూ ప్రశ్నించకుండా ఆమోదించకండి అని రాజ్యాంగం స్పష్టం చేస్తుంటే ప్రస్తుతం ప్రశ్నించే వారిని జైలుకు పంపుతున్నారన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తున్నామంటున్న వారే దానికి అంతర్గతంగా నష్టం చేస్తున్నారని, పరిక్షించాలని కోరుతున్న వారిపైనే రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నారని ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విషాధ ప్రహసనంగా మారిందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రజలు మరింత చురుకుగా ఉండాలన్నారు.

గవర్నర్ తేనీటి విందు

- హాజరైన సిఎం సహా ఇతర ప్రముఖులు



మన తెలంగాణ/ హైదరాబాద్ : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ దంపతులు శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన 'ఎట్ హోం' తేనేటి విందుకు ఇరు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులు నాదెండ్ల భాస్కర్ రావు, కె.రోశయ్య, శాసనమండలి ఛైర్మన్ కె.స్వామిగౌడ్, స్పీకర్ ఎస్.మధుసూదనాచారి, ఎపి స్పీకర్ కోడెల శివప్రసాద్, ఉభయ రాష్ట్రాల ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, కె.ఇ.కృష్ణమూర్తి హాజరయ్యారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థికవేత్తల సదస్సుకు హాజరై ఏపికి తిరిగిరావడానికి ఆలస్యమైనందున ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'ఎట్ హోమ్'కు హాజరుకాలేకపోయారు. ఇంకా తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, నాయిని నర్సింహారెడ్డి, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, జోగు రామన్న, ఎపి మంత్రులు ప్రతిపాటి పుల్లారావు, కామినేని శ్రీనివాస్, పితాని సత్యనారాయణలు పాల్గొన్నారు. ఇంకా ఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ, ఎంఎల్‌సి అమీనుల్ జాఫ్రీ, బిజెపిఎల్‌పి నేత జి.కిషన్‌రెడ్డి, ఎంఎల్‌ఏలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయలు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ, టిఆర్ఎస్ ఎంపిలు బి.వినోద్‌కుమార్, బాల్క సుమన్, ఎంఎల్‌సి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్వాతంత్ర్య సమరయోధులు, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, మాజీ అధికారులు ఉన్నారు. గవర్నర్ దంపతులు ప్రతి ఒక్కరి వద్దకు వెళ్ళి పలకరిస్తూ ముందుకు సాగారు.

కాంగ్రెస్, వామపక్షాలు గైర్హాజర్ : గవర్నర్ ఎట్ హోమ్ కార్యక్రమానికి కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులు హాజరుకాలేదు.. అయితే కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి దానం నాగేందర్, రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద్ భాస్కర్, టి.సుబ్బరామిరెడ్డిలు మాత్రం హాజరయ్యారు. ఎట్ హోమ్‌కు హాజరుకావొద్దని తమకు పార్టీ నుండి ఎలాంటి సమాచారం లేదని దానం, రాపోలు మీడియా ప్రతినిధులతో అన్నారు. ఇదిలా ఉండగా ఈ కార్యక్రమంలో పాల్గొనడంపై శుక్రవారం ఉదయం గాంధీభవన్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో చర్చ జరిగింది. పిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాయకులు కె.జానారెడ్డి, షబ్బీర్ అలీ, వి.హనుమంతరావు, తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఇటీవల గవర్నర్ ప్రభుత్వాన్ని పొగడడం, విపక్షాలు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోకపోగా, తమతోనూ ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడిన నేపథ్యంలో రాజ్‌భవన్ కార్యక్రమానికి వెళ్ళ కూడదని అభిప్రాయానికి వచ్చారు. గతంలో గవర్నర్ వద్దకు వెళ్ళొద్దని సూత్రపాయంగా నిర్ణయానికి వచ్చినా కూడా గురువారం నాడు మండలి ప్రతిపక్ష నాయకులు షబ్బీర్ అలీ, రేవంత్‌రెడ్డి వెళ్ళడంపై సమావేశంలో అభ్యంతరం వ్యక్తమైనట్లు తెలిసింది. అయితే, తాము టిఆర్ఎస్ ఎంఎల్‌ఏల అనర్హతకు సంబంధించి రాజ్యాంగ బాధ్యుడైనందునే గవర్నర్‌కు పిటిషన్ ఇవ్వాల్సి వచ్చిందని షబ్బీర్ అలీ చెప్పినట్లు సమాచారం.

గవర్నర్‌తో సిఎం భేటీ : 'ఎట్ హోం' కార్యక్రమం ముగిసిన అనంతరం గవర్నర్ నరసింహన్‌తో సిఎం కెసిఆర్ భేటీ అయ్యారు. ఈ భేటీ సుమారు 20 నిమిషాలు సాగింది.





పలువురికి అవార్డుల ప్రదానం



మన తెలంగాణ/హైదరాబాద్: సికింద్రాబాద్ పెరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర వేడుకలలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అవార్డులను ప్రదానం చేశారు. ఐఏఎస్ అధికారులు భువనగిరి–యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితా రాంచంద్రన్, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శశాంక్, ఐపిఎస్ అధికారులు రాజేష్‌కుమార్, స్వాత్రి లక్రా, ఐఎఫ్ఎస్ అధికారులు శోభ, స్వర్గం శ్రీనివాస్‌తో పాటు టిఎస్ఎన్‌పిడిసిఎల్ సిఎండి ఎ.గోపాల్‌రావు, సిఐజి ఎ.జి రమణ ప్రసాద్, టిఎస్ఎస్‌పిడిసిఎల్ సిఎండి సి.రఘుమారెడ్డి, పరిశ్రమల డైరక్టర్ పి.ఎం.చంద్రమోహన్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి పి.సత్యనారాయణరెడ్డి తదితరులకు గవర్నర్ అవార్డులను ప్రదానం చేశారు. కాగా హైదరాబాద్ పోలీసుల చరిత్రకు సంబంధించిన పుస్తకంలో ఉత్తమ ఛాయచిత్రాలను అందించినందుకు గాను నూపుర్ కుమార్, డి.రవీందర్ రెడ్డి (ఫోటోగ్రఫీ)లకు కూడా గవర్నర్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు.

మీడియ జాలిని తొలగించిన జితేందర్‌రెడ్డి: పరేడ్‌గ్రౌండ్స్‌లో మీడియా గ్యాలరీకి ఎప్పుడు లేని విధంగా ఈసారి జాలిని ఏర్పాటు చేశారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన టిఆర్ఎస్ పార్లమెంటరీ పక్షనేత జితేందర్ రెడ్డి మీడియా గ్యాలరీ వద్దకు రాగా జాలీని ఏర్పాటు చేసిన విషయాన్ని జర్నలిస్టులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే ఆయన స్పందిస్తూ ఎప్పుడూ లేనిది ఇలా జాలీ ఏర్పాటు చేయడం ఏమిటని అక్కడున్న భద్రతా సిబ్బందిని ప్రశ్నించారు. ఆ వెంటనే గ్యాలరీకి ఏర్పాటు చేసిన జాలీని ఆయనే స్వయంగా తొలగించారు. ఇదిలా ఉండగా ఎంఎల్ఏ కొండా సురేఖ తన వెంట తీసుకొచ్చిన ఒక బాలికను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు పరిచయం చేశారు. ఆ బాలికలను సిఎం వద్ద కూర్చొబెట్టి తన సెల్‌ఫోన్‌లో ఫోటో తీయడాన్ని అందరూ ఆసక్తిగా గమనించారు.



"ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉంటేనే యదార్థంగా చదువు చెప్పగలడు.
– రవీంద్రనాథ్ ఠాగూర్"

అట్టహాసం – ఆత్మక్షోభ

సంపాదకీయం

69వ గణతంత్ర దినోత్సవ పెరేడ్ ఎప్పటివలె ఢిల్లీలో శోభాయమానంగా జరిగింది. ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవ ప్రదర్శన ఒక విలక్షణం. పెరేడ్‌కు ఏదో ఒక రాజ్య ప్రభుత్వాధినేతను ముఖ్య అతిథిగా ఆహ్వానించే సాంప్రదాయానికి బదులు శుక్రవారం నాటి పెరేడ్‌కు ప్రధాని మోడీ ఏకంగా 10 ఆసియన్ దేశాల అధినేతలను ఆహ్వానించి తూర్పుదిక్కుదేశాలతో భారత్ బంధం బలపడినట్లు చాటిచెప్పారు. కాని వాణిజ్యంలో చైనా కన్నా వెనుకబడి ఉన్నాం. దాన్ని అధిగమించటం ఒక పరీక్ష. మరో విశేషం – 23 అలంకృత శకటాల్లో 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల శకటాలు (ఇవి కేంద్రం ఎంపిక చేసినవే) గతానికి రంగులద్దాయి తప్ప వర్తమాన భారత వైవిధ్యాన్ని, అభివృద్ధిని ప్రదర్శించలేదు. మన తెలంగాణ రాష్ట్ర శకటం థీమ్ ఈ సంవత్సరం కూడా నిరాకరించబడటం శోచనీయం.

1949 నవంబర్ 25న తొలి రాజ్యాంగ ప్రతిని దాని రూపశిల్పి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చేతులనుంచి తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ అందుకోగా, 1950 జనవరి 26న పార్లమెంటు ఆమోదించింది. మనది అతి పెద్ద లిఖిత రాజ్యాంగం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికత మూల సూత్రాలుగా రూపుదిద్దుకున్న మన రాజ్యాంగం మతాతీత రాజ్యాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రబోధించింది. ప్రజాస్వామ్యాన్ని పాలనారీతిగా నిర్దేశించింది. వయోజను లందరికీ –స్త్రీ,పురుష వివక్ష లేకుండా ఓటు హక్కు కల్పించిన తొలి రాజ్యాంగం మనదని గర్వంగా చెప్పుకోవచ్చు. అటువంటి ఉత్తమమైన, ఉన్నతమైన రాజ్యాంగ వ్యవస్థాపనను ప్రభుత్వంతో పాటు దేశప్రజలు ఒక లాంఛన ప్రాయమైన వేడుకగా జరుపుకుంటున్నారు. ఇది రాజ్యాంగ విలువలకు, స్ఫూర్తికి పునరంకితం కావాలసిన దినం. అయితే దేశ పరిస్థితులను విమర్శనాత్మకంగా విశ్లేషించుకుంటే రాజ్యాంగం ఆత్మ క్షోభిస్తున్నదని నిర్ధారణకు రావటం కష్టం కాదు. పౌరస్వేచ్ఛలు కొందరికే అన్నట్లుగా దళితులు, గిరిజను లు, బలహీనవర్గాలు, మహిళలు అణచివేతకు, అకృత్యాలకు గురికావటం పెచ్చుపెరుగుతున్నది. సమానత్వ ఆదేశానికి విరుద్ధంగా ఆర్థిక అంతరాల అగాధం రోజురోజుకూ విస్తృతమవుతున్నది. కులం, మతం ప్రజలను విభజిస్తున్నది. సౌభ్రాతృత్వం వెల్లివిరియక పోగా అసహనం పెంచిపోషించబడుతున్నది, ప్రజలు ఏమి తినాలో, ఎటువంటి బట్టలు ధరించాలో, ఎవరిని వివాహమాడాలో, ఏమి చదవాలో, ఎటువంటి సినిమాలు చూడాలో నిర్దేశించే చాందస శక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. రాజ్యాంగం ప్రసాదించిన వ్యక్తి స్వేచ్ఛలు, భావ ప్రకటనా స్వేచ్ఛ నిత్యం దాడికి గురవుతున్నాయి. అయితే మేడిపండు లాగా అంతా సవ్యంగా ఉన్నట్లు, అభివృద్ధి ఉరకలు వేస్తున్నట్లు ప్రజలను భ్రమల్లో ఉంచే ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. మరో ఐదేళ్లు అవకాశమివ్వండి – నూతన భారతాన్ని ఆవిష్కరిస్తామంటున్నారు. ఎవరినైనా ఎంచుకోవటం, తిరస్కరించటం ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. అదే సమయంలో రాజ్యాంగాన్ని రక్షించుకోవటం కీలకమైన బాధ్యత. అందువల్ల పాలకవర్గాలు రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై చేస్తున్న దాడిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, తిప్పికొట్టాలి. అంబేద్కర్ శిలాక్షరం లాంటి పలుకులు ఎప్పుడూ విస్మరించరాదు. 1949 నవంబర్ 25న రాజ్యాంగ నిర్ణాయక సభలో ఆయన ఇలా అన్నారు :''రాజ్యాంగం ఎంత మంచిదైనా కావచ్చు, దానితో పనిచేసే బాధ్యతలోకి వచ్చిన వారు చెడ్డవారైతే అది చెడుగా మారుతుంది. రాజ్యాంగం ఎంత చెడుగా ఉన్నా, దానితో పనిచేసే బాధ్యత స్వీకరించిన వారు మంచివారైతే అది మంచిగా మారుతుంది.''

ప్రస్తుతం నరేంద్రమోడీ నాయకత్వంలో అధికారంలో ఉన్న బిజెపి(ఎన్‌డిఎ) ప్రభుత్వానికి తిరోగమన, చాందసవాద, మతోన్మాద సిద్ధాంతం మార్గదర్శకమనేది సర్వవిదితం. మెజారిటీవాద వ్యవస్థను, అగ్రవర్ణ ఆధిపత్యాన్ని నెలకొల్పటం హిందూత్వ మూలం. అందుకు రాజ్యాంగం అడ్డువచ్చిన మేరకు దాన్ని మార్చాలన్నది తలంపు. బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులనుంచి రాజ్యాంగంపై జరిగే దాడుల వెనుక ఉద్దేశంఅదే. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానే అధ్యక్ష తరహా పాలన వారి గమ్యం. అందుకనుగుణంగానే నాయకారాధన రాజకీయం నడిపిస్తున్నారు.

రాజ్యాంగ దినాన్ని వేడుకలకే పరిమితం చేయకుండా దాని స్ఫూర్తిని అమలు జరిపినపుడే ప్రజలకు మేలు జరుగుతుంది.

ఓఎన్‌జిసి బంగారు బాతు కోత!


చూపు

ఇటీవలి దాకా పెద్దగా రుణ భారం లేకుండా మనుగడ సాగిస్తున్న భారత చమురు సహజ వాయువుల కార్పొరేషన్ (ఓఎన్‌జిసి) 'మోడీనామిక్స్'లో భాగంగా అప్పుల బాట పట్టింది. 2017 –18లో వ్యయానికి, రాబడికి మధ్య పెరుగుతున్న అంతరాన్ని పూడ్చడానికి లాభాలు గడిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ (పిఎస్‌యు)లను వాడుకోవాలని ఇటీవల కేంద్రం నిర్ణయించింది. జిఎస్‌టి (సరుకులు, సేవల పన్ను) వసూళ్లు క్షీణించడంతో ఈ అంతరం పెరుగుతోంది. అందుచేత ప్రభుత్వ యాజమాన్యంలోని రెండు అతిపెద్ద పిఎస్‌యులలో పరిష్కారాన్ని కేంద్రం వెతుక్కొంది. ఓఎన్‌జిసి, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పిసిఎల్) సంస్థలు రెంటికీ ప్రభుత్వం సొంతదారు కాబట్టి హెచ్‌పిసిఎల్‌లోని 51శాతం ప్రభుత్వ వాటాను ఓఎన్‌జిసికి అమ్మి, అలా వచ్చే రూ.37,000 కోట్లను కేంద్రం ఖాతాకి బదిలీ చేయాలి అని పథకం వేసింది.

దీనితో ఈ ఏడాది పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం కంటే అధికంగా కేంద్రానికి డబ్బు సమకూరుతుంది. అయితే ఇంతటి భారీ లావాదేవీ సులభంగా అవుతుందా అన్న ప్రశ్న ఇక్కడ కేంద్రానికి అప్రస్తుతం. అనేక పిఎస్‌యులనుంచి చిన్నచిన్న వాటాలను అమ్మడం ఏం లాభం? ఈ ఆర్థిక పిల్లిమొగ్గల వల్ల ఇంతవరకూ పెద్దగా అప్పుల భారం మోయని ఓఎన్‌జిసి తప్పనిసరిగా మార్కెట్ నుంచి రుణ సేకరణకు దిగవలసి వస్తుంది. హెచ్‌పిసిఎల్ స్వాధీనం ప్రతిపాదన నిజం చేయడానికి అది రుణాలబాట పడుతుంది. ఒక అపసవ్య లావాదేవీవల్ల ఈ ఆర్థిక సంవత్సరం మొదట్లో ఓఎన్‌జిసికి కలిగిన తీవ్ర నష్టానికి ఇది అదనం కానుంది. అధికారికంగా గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ (జిఎస్‌పిసి)లో 80 శాతం వాటాను ప్రభుత్వ పోరువల్ల 2017ఆగస్టులో ఓఎన్‌జిసి కొన్నది.

ఇది ఆ సంస్థకు చెందిన రూ.7,738కోట్ల రూపాయల విలువైన కెజి బేసిన్ బ్లాకు. ఆ బ్లాకు నుంచి ఉత్పత్తి ప్రారంభించలేని పరిస్థితిలో ఉన్న జిఎస్‌పిసిని బయటపడేయడానికి ఓఎన్‌జిసి చేత జిఎస్‌పిసిలో వాటాను కొనిపించారు. ఆ బేసిన్‌లో ఆ సంస్థ ఆసరికే రూ. 20,000కోట్లు ఖర్చు పెట్టి ఉంది. ఈ స్థితిలో జిఎస్‌పిసి సంక్లిష్టమైన ఆర్థిక సమస్యల్లో కూరుకుంది. పిఎస్‌యు బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులను కూడా బకాయి పడింది. అప్పుడు కూడా మోడీ బుర్రలో ఓఎన్‌జిసి అనే 'పాడి ఆవు' మెదిలింది. జిఎస్‌పిసిని గట్టెక్కించడానికిగాని, కేంద్రాన్ని ద్రవ్య లోటు నుంచి బయటపడేయడానికి గాని మోడీ చెయ్యి ఓఎన్‌జిసి పై పడుతోంది. ఆయన ప్రభుత్వం పాలిట ఓఎన్‌జిసి 'కామధేనువు' అయ్యింది. పైన పేర్కొన్న రెండు సందర్భాల్లోనూ కేంద్రంగాని, గుజరాత్ ప్రభుత్వంగాని నేరుగా మార్కెట్ నుంచి రుణాలు తీసుకుని ఉండవచ్చు.

ఆ డబ్బుతో కేంద్రప్రభుత్వం, జిఎస్‌పిసి ద్రవ్యలోటు పూడ్చవచ్చు. అయితే ఆ ఆర్థిక అంతరాలను పూడ్చడానికి ఓఎన్‌జిసిని బలిపెట్టారు. జిఎస్‌పిసి తన పెట్టుబడి ధనాన్ని చమురు బ్లాకులో దుర్వినియోగపర్చినందుకు నేషనల్ ఆడిటర్ (కాగ్) ఆ సంస్థను 2005లో తీవ్రంగా విమర్శించింది. అప్పుడు మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. జిఎస్‌పిసికి చెందిన కెజి బేసిన్‌లో 20 ట్రిలియన్ ఘనపుటడుగుల (టిసిఎఫ్) సహజ వాయువు ఉన్నట్లు అప్పట్లో మోడీ ప్రకటించారు. అయితే ఆయన చెప్పిన మోతాదు కంటే చాలా తక్కువ స్థాయిలో అక్కడ వాయు నిక్షేపం ఉన్నట్లు ఇప్పుడు బయటపడింది. అందుచేత జిఎస్‌పిసిని డబ్బున్న ఓఎన్‌జిసిలో కలిపేశారు. సంస్థ నిధులు, రుణంగా సేకరించిన మొత్తంతో హెచ్‌పిసిఎల్ వాటా కొనుగోలు పూర్తి చేస్తామని ఓఎన్‌జిసి చైర్మన్ శశి



శంకర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు భర్తీ చేయడానికి ఓఎన్‌జిసి ఎందుకు రుణాలు తీసుకోవాలి? గత వారం ఓఎన్‌జిసి –హెచ్‌పిసిఎల్ విలీనానికి ప్రభుత్వామోదం లభించిన తర్వాత ఆ సంస్థల రుణ పరిమితిని రూ.25,000కోట్ల నుంచి రూ.35,000 కోట్లకు (40శాతం) పెంచడానికి ఓఎన్‌జిసి బోర్డు అంగీకరించినట్లు యాజమాన్యం తెలిపింది. తమ వద్ద ఉన్న రూ. 12,000 కోట్లు – 13,000 కోట్ల నగదును ముందుగా వాడుతామని తర్వాత ఓఎన్‌జిసికి ఐఒసి (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్), గెయిల్ ఇండియాలోగల వాటాల జోలికి పెడతామని, రుణం తీసుకోవడం ఆఖరున చేస్తామని సంస్థ తెలిపింది.

అయితే ఈ వరుస మారే అవకాశం కూడా ఉందని శంకర్ తెలిపారు. తాము కంపెనీలలోని వాటాలను నిరాశతో అమ్ముకోవడం లేదు కనుక వరుస క్రమం మారవచ్చని చెప్పారు. తక్కువ వడ్డీ రేట్లకు రూ.50,000కోట్ల రుణానికి అవకాశాలు వస్తున్నాయని కూడా చెప్పారు. ఇలా వచ్చే రుణాలు విదేశీ కరెన్సీ లేదా స్థానిక కరెన్సీలో ఉండవచ్చని తెలిపారు. ఓఎన్‌జిసి చేత ఏమి చేయిస్తారో మార్కెట్‌కే తెలుసు. గత 6 నెలలలో ముడి చమురు ధరలు 40శాతం పెరిగాయి. అందుచేత ఓఎన్‌జిసి ఖజానాలో చాలా నగదు ఉంది. హెచ్‌పిసిఎల్ 51 శాతం వాటాల కొనుగోలు వల్ల ఈ డబ్బంతా ఇప్పుడు కేంద్రానికి బదిలీ కావడం తథ్యం.

స్టాక్ మార్కెట్ ఈ పరిణామంతో ఉత్సాహపడడం లేదు. ఎందుకంటే ఓఎన్‌జిసి తన పరపతిని చాలా వరకు కోల్పోయిందని దానికి తెలుసు. ఓఎన్‌జిసియే కాకుండా ఏడాదిగా పలు ప్రభుత్వ రంగ సంస్థల విలీనం ప్రతిపాదనలు వినిపిస్తున్నాయి. ఐఒసి, ఆయిల్ ఇండియా, గెయిల్ ఇండియాలలో వాటాల బదిలీ, విలీనం ప్రతిపాదనలు చర్చలో ఉన్నాయి. ఆ పరిణామంతో సులభంగా డబ్బు వచ్చిపడుతుందన్న ఆశలు కేంద్రానికి ఉన్నాయి. ఒక కంపెనీ వాటాను మరొక కంపెనీకి అమ్మడం అనే పద్ధతిలో ఈ లావాదేవీలు ఉంటాయి. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి డోలాయమానంలో కొనసాగుతుండడంతో ఆ చమురు పిఎస్‌యుల బ్యాలెన్స్ షీట్‌లో ఉన్నదాని కంటే ఎక్కువ మొత్తాలు రాబట్టాలని కేంద్రం ప్రయత్నిస్తుందన్న భయాలు వ్యాపిస్తున్నాయి.

మంగళవారం నాడు స్టాక్ మార్కెట్ నిఘా సంస్థ సెబీకి ఓఎన్‌జిసి చెప్పిన దాని ప్రకారం ఆ సంస్థ రూ.10,000కోట్ల మేరకు పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి, రూ. 4,460 కోట్ల మేరకు బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి, రూ.3000 కోట్ల మేరకు యాక్సిస్ బ్యాంకు నుంచి రుణాలు తీసుకోనుంది. ఈ మేరకు సెబీ నుంచి ఓఎన్‌జిసి కావలసిన అనుమతులను పొందింది. ఈ రుణాలవల్ల ఆయా పిఎస్‌యుల విదేశీ కార్యకలాపాలు కూడా చెడు ప్రభావానికి లోనవుతాయి. ఓఎన్‌జిసి విదేశ్ (ఒవిఎల్) అన్నది ఓఎన్‌జిసికి చెందిన నూరు శాతం అనుబంధ సంస్థ. తన మాతృసంస్థ రుణ రహిత బ్యాలెన్స్ షీట్‌ను ఒవిఎల్ వాడుకొని అంతర్జాతీయ మార్కెట్‌లో చౌకగా నిధులను తెచ్చుకుంటోంది. ఆ నిధులతో విదేశాల్లో చమురు, గ్యాస్ సంస్థల వాటాలను కొంటోంది. ఓఎన్‌జిసి రుణ భారంలో ఇరుక్కొన్న క్షణంలో ఒవిఎల్‌కు నిధులు మరింత ఖరీదు అవుతాయి. అందువల్ల ఆ సంస్థ విదేశాలలో హైడ్రోకార్బన్ సంస్థల వాటాలను సేకరించలేకపోతోంది. ఫలితంగా దేశ ఇంధన భద్రత దెబ్బతింటుంది.ఇలా విలీనాలవల్ల భవిష్యత్తులో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ ఏర్పడి అంతర్జాతీయ పోటీకి తగిన విధంగా కార్యకలాపాలు సాగిస్తుందని ప్రభుత్వం చెబుతోంది. ప్రభుత్వ విధానాలన్నీ బీమా పాలసీల మాదిరిగా భవిష్యత్తు కోసమే అని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదం.

✻ ఎస్.ఎస్.

ఎవరూ అనని ఒక మాట

టంకశాల అశోక్
9848191767

ప్రతిపక్షాలకు సంబంధించి ఎవరూ అనని మాట ఒకటున్నది. అదేమిటి? ప్రతి పార్టీ కూడా అధికార పక్షంపై అవినీతి ఆరోపణలు చేస్తుంటుంది. కాని తాము అధికారానికి వచ్చినపుడు నీతిగా ఉంటామని, అవినీతికి పాల్పడబోమని ఎవరూ ప్రకటించరు. మనం ఇన్ని ఎన్నికలను చూసాము. కాని ఎప్పుడైనా ఈ మాట ఎవరి మేనిఫెస్టోలో నైనా, ఎన్నికల ప్రచారంలోనైనా కన్పించిందా? ఎన్నికలతో నిమిత్తం లేని మామూలు రోజుల్లో తాము ప్రభుత్వంపై ఆరోపణలు చేసే సమయంలో, అటువంటి అవినీతికి తాము అధికారానికి వచ్చినట్లయితే పాల్పడబోమంటూ ఎపుడైనా, ఎవరైనా హామీ ఇచ్చారా? అట్లా ఇచ్చినంత మాత్రాన అందుకు హామీ ఉంటుందని కాదు. మన పార్టీల హామీలకు గల విలువ ఏమిటో తెలిసిందే. అయినప్పటికీ, కనీసం మొక్కుబడి కోసమైనా అనేక హామీలు ఇచ్చే పార్టీలు ఈ మాట మాత్రం ఎందుకనవు?

ప్రతిపక్షాలు ప్రభుత్వాలపై చేసే అవినీతి ఆరోపణలు నిజం కావచ్చు, కాకపోవచ్చు. నిజం అయి, అందుకు తమ వద్ద పూర్తిగానో, పాక్షికంగానో ఆధారాలు ఉండే ఎట్లానూ వెల్లడిస్తారు. ఒకోసారి అది కేవలం అనుమానమే కావచ్చు. అయినప్పటికీ, వట్టి గాలిమాటలుగా ఆరోపిస్తే అదిఅర్థం లేనిదవుతుంది గాని, ఒకోసారి సహేతుకమైన అనుమానాలు ఉండవచ్చు. అపుడు తమ వద్ద ఆధారాలు అనదగ్గవి లేకపోయినా ఆరోపణలు చేయటాన్ని తప్పుపట్టలేము. ఆ పనివల్ల ప్రభుత్వంపై వత్తిడి ఏర్పడుతుంది. ప్రజలు వాటిని గమనించి ఆలోచిస్తారు. అది మంచికి దారితీయవచ్చు కూడా.

కాని మన ప్రతిపక్షాల ఆరోపణలు ఇదే విధంగా ఉంటున్నాయా? పైన చెప్పిన తరహాలో బాధ్యతాయుతంగా అవినీతి ఆరోపణలు చేయటం లోగడ ఉండేది. మనకు స్వాతంత్ర్యం లభించిన తర్వాత తొలితరం ప్రతిపక్షనాయకులు ఉండినపుడు నెహ్రూ ప్రభుత్వం పై సైతం ఆరోపణలు చేసారు. అంతే కాదు. తగు ఆధారాలు ఉన్నప్పుడు ఆ పని చేసేవారు. ఏదైనా అనుమానం కలిగినపుడు తగినంత పరిశోధన తమ స్థాయిలో ఉండేది. దాని ఆధారంగా ఆరోపణలను బహిరంగంగా చేసిన తర్వాత కూడా అంతటితో వదలివేయకుండా తమ పరిశోధనలను కొనసాగించేవారు. అందువల్లనే అపుడు వచ్చిన ఆరోపణలకు, వాటిని చేసిన వారికి ప్రభుత్వాలు భయపడేవి. ప్రజలు ఇదంతా గమనించటంవల్ల సదరు ఆరోపణలకు విలువ నిచ్చేవారు. వాటిపై ప్రభుత్వ స్పందనలు ఏ విధంగా ఉండగలవని గమనించేవారు.

కాని అప్పటి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో ఆరోపణలకు ఎటువంటి విలువా లేకుండా పోయింది.

అవినీతి ఆరోపణలు చేయటం ఒక రోజువారీ ఉబుసుపోకగా మారింది. దాని అర్థం అవినీతి ఉండటం లేదని కాదు. ఒకసారి దేశాన్నంతా గమనిస్తే, వివిధ పార్టీల ప్రభుత్వాలను చూస్తే, అవినీతి జరుగుతూనే ఉంది. కనుకనే తరచు ఎక్కడనో, ఏ విధంగానో ఎవరో ఆధారాలను వెలికితీయటం వల్ల అవి కుంభకోణాలుగా మారుతున్నాయి. కాని ప్రతిపక్షాల పాత్ర ఇందులో అతి స్వల్పం. అంతకన్న ముఖ్యంగా, ఆరోపణల విషయమై వారి మాటకు విలువ లేకుండా పోతున్నది. అధికార పక్షాలు ఆ మాటలను అలవోకగా కొట్టివేస్తా యి. ప్రభుత్వం తన స్థాయిలో అసలు స్పందించదు. ప్రజలు అంతకన్న పట్టించుకోకుండా వీరిట్లా గాలిమాటలు మాట్లాడుతూనే ఉంటారు లెమ్మంటారు.

ఇటువంటి పరిస్థితి ఏర్పడటానికి మరొక కారణం ఉంది. వివిధ ప్రతిపక్షాలు తాము అధికారంలో ఉన్నప్పుడు చేసే అవినీతి తక్కువకాదు. అపుడు తాము సైతం ఈ తరహాలో ఆరోపణలు ఎదుర్కొన్న వారే. తమ అవినీతి, రాజకీయ అవినీతి, ప్రభుత్వ అవినీతి, అధికార యంత్రాంగపు అవినీతి గురించి ప్రజలకు తెలియనిది కాదు. అవినీతి ఆరోపణలను అపుడు తాము కూడా కొట్టివేసిన వారే. ఆ విధంగా రెండువైపులా జరుగుతున్నదేమిటో గమనిస్తున్న ప్రజలు ఎవరి ఆరోపణలకు మాత్రం విలువ ఇవ్వగలరు? అందరూ దొంగలే, దొందూ దొందే తరహా మాటలు వాడకంలోకి రావటం అందువల్లనే. ఇటువంటి వాతావరణం, లేదా సంప్రదాయంగా మారిన పరిస్థితి చివరకు ఎక్కడకు దారితీసిందంటే, అవినీతి విషయమై ప్రజల ఆలోచనలు మొద్దుబారి పోయాయి. స్పందనలంటూ ఉన్నా అది స్వల్ప కాలికమే. అంతే కాదు, కేవలం ఆరోపణలు గాక వాస్తవంగా అవినీతి బయటపడిన సందర్భాలలోనూ ప్రజలు కొద్దిరోజులు మాట్లాడుకోవటానికి మించి లోతుగా కదలటం లేదు. ఇంతకన్న పతనస్థితి, విచారించదగ్గ స్థితి ఒక వ్యవస్థకు ఉండబోదు. అసలు ఈ వ్యవస్థలను నిర్మించి నిర్వహించి వాటిని ఉపయోగించుకునేవారికి కావలసింది కూడా ఇటువంటి మొద్దుబారిన తనం, పతన స్థితే కావచ్చు.

ఇపుడు మొదట అనుకున్న మాటకు వెళదాము. ఎపుడు ఎవరు ప్రతిపక్షంలో ఉన్నా తోచిన ఆరోపణలన్నీ నిర్విచక్షణా, నిరాధారంగా చేయడంసరే. కాని, ఒకవేళ తాము అధికారానికి వచ్చినట్లయితే అవినీతికి పాల్పడ బోమని ప్రజలకు మాట ఇవ్వకపోవటం ఎందువల్ల? అవినీతిలేని పాలనను అందిస్తామంటారు కాని అందులో వారు ఉద్దేశించేది అధికార యంత్రాంగం గురించి తప్ప స్వయంగా అధికారపక్షపు రాజకీయ అవినీతిగురించి, ప్రభుత్వంలోని మంత్రుల అవినీతి గురించి కాదు. అధికార యంత్రాంగపు అవినీతికి, ఈ రెండు విధాలైన అవినీతికి అనేక విధాలుగా పరస్పర సంబంధం ఉండేమాట నిజమే. కాని సాధారణ ప్రజలకు ఎక్కువగా దృష్టిలో ఉండేది రాజకీయ అవినీతి, మంత్రుల అవినీతి. ఎందుకంటే, అధికార యంత్రాంగపు అవినీతిని అరికట్టవలసిన బాధ్యత రాజకీయ యంత్రాంగంపై ఉంటుంది. దానిని ఎన్నుకునేది, బాధ్యతలు అప్పగించేది ప్రజలు. కాని రాజకీయ యంత్రాంగమన్నది అధికార యంత్రాంగపు అవినీతిని అరికట్టకపోగా తాను స్వయంగా అదే పని చేస్తున్నది. తన అవినీతి కోసం అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటూ ఉండటం మరొకటి.

ఇటువంటి స్థితి వల్లనే ప్రతిపక్షాలు అధికార యంత్రాంగపు అవినీతిని అదుపు చేసే హామీలు ఇస్తాయి గాని ఆ పని కూడా చేయవు. ఇక స్వయంగా తమ రాజకీయ అవినీతి గురించి సూటిగా ప్రస్తావించటం గాని, ఆ పని చేయబోమంటూ ప్రకటించటం గాని చేయవు. కనుకనే ఏమి జరుగుతున్నది? ప్రతిపక్షాల అవినీతి వ్యతిరేక ఆరోపణలకు ఎటువంటి విలువ లేక అవి కేవలం అపహాస్యంగా మిగులుతున్నాయి. అటువంటి పరిస్థితుల మధ్య ప్రజలు అసలు అవినీతిని పట్టించుకోవటం తగ్గుతున్నది. వారికి అందరూ దొంగలే అనే అభిప్రాయం ఏర్పడినపుడు అట్లా పట్టించుకోకపోవటమన్న స్థితి కూడా సహజమైన రీతిలో ఏర్పడుతుంది. దాని అర్థం వారు అవినీతికి అనుకూలమని, దానిని సమర్థిస్తారని కాదు. వారిది ఒక నిస్సహాయ స్థితి. రెండువైపులా అవినీతే కన్పించి అందుకు ప్రత్యామ్నాయం తోచనపుడు వారు నిస్సహాయులు కావటం గాక ఏమి చేయగలరు. అయితే, ఇటువంటి పరిస్థితులవల్లనే వారు, రాజకీయరంగం నుంచి బయటివారు ఎవరైనా బలమైన రీతిలో అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని ముందుకు తీసుకువచ్చినపుడు మాత్రం దానిని బలపరుస్తారు. ఇందుకు ఇటీవలి ఉదాహరణ అణ్ణా హజారే ఉద్యమానికి వచ్చిన స్పందన. అది ఎక్కువ ముందుకు సాగలేదన్నది వేరే విషయం. కాని, అవినీతి ఆరోపణలను ప్రతిపక్షాలు చేసినపుడు ప్రజలలో కన్పించని స్పందన, రాజకీయాలకు బయటి సామాజిక ప్రముఖులు చేసినపుడు కన్పించటమన్నది ఇక్కడ గుర్తించవలసిన విషయం.

ఇటువంటిదే మరొక అంశం పరిపాలనా సమర్థత. ఈ విషయమై కూడా ఎవరు ప్రతిపక్షంలో ఉంటే వారు అధికార పక్షాన్ని నిందించటం షరా మామూలుగా మారింది. కాని తాము అధికారానికి వచ్చినపుడు సమర్థవంతంగా పాలించగలరనే నమ్మకాన్ని ఎవరూ ప్రజలకు కల్పించలేకపోతున్నారు. దేశంలో ఎక్కడ చూసినా దశాబ్దాల కాలంగా ఇదే పరిస్థితి ఉంటున్నది. ఇది కూడా దొందూదొందే అన్న అభిప్రాయాన్ని ప్రజలకు కలిగించింది. మనకు స్వాతంత్ర్యం లభించిన 70 సంవత్సరాల తర్వాత కూడా దేశం ఇంత వెనుకబడి ఉండటానికి, అనేక ఇతర దేశాలవలె పురోగతిని సాధించలేకపోవటానికి ఇది ఒక ప్రధాన కారణం. ఎంతసేపూ జిడిపి జపం చేయటం, ఆ విషయమై వీరికన్న ముందు, వారికన్న వెనుక అనే పోలికలు మినహా నిజమైన అభివృద్ధి గురించి ఉభయపక్షాలలో ఎవరూ మాట్లాడరు.

కులాల జనాభా తేల్చాలి!

కోడం పవన్‌కుమార్
9848992825

వెనుకబడిన కులాలలో చైతన్యం పెరగడంతో ఏ కులానికి ఆ కులం రాష్ట్రంలో తమదే పెద్ద సంఖ్యగా చెప్పుకోవడం ఇటీవల కాలంలో ఎక్కువైంది. జనాభా లెక్కల ఆధారంగా జనాభా నిష్పత్తిలో సమన్యాయం జరుగుతుందని కుల సంఘాలు భావిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో కులాల వారీగా జనాభాను గుర్తించడం అనివార్యంగా మారింది. ఈ లక్ష్యంతోనే కేంద్రప్రభుత్వం బిసిలను వర్గీకరణ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం బిసి కులాలపై ఇంటింటి సర్వే చేయించాలని నిర్ణయించాయి. సామాజికపరంగా చూస్తే, 1990 తర్వాత అస్తిత్వ కేంద్రంగా వచ్చిన ఉద్యమాలు రెండు ప్రధాన విషయాలను సమాజం ముందు నిలిపాయి. ఒకటి పౌరసత్వం, సమానతలపై నిలదీయటం; రెండు తమ సంఖ్యా బలానికి తగినట్లుగా రాజకీయ, ప్రభుత్వ, విద్యారంగాలలో ప్రాతినిధ్యం కోసం డిమాండ్ చేయడం. మొదట్లో ఆయా అస్తిత్వ ఉద్యమాలు విలువలు, విషయపరంగానూ తమ రాజకీయాలపై నియంత్రణ కలిగి ఉండటం వల్ల అనేక విజయాలు సాధించాయి. కాలక్రమేణా బలహీనపడటంవల్ల ఉద్యమాలు కూడా నీరసించి పోయాయి.

భూమితో పాటు కులం, మతం ఇక్కడి ప్రజలపై ఉన్న అనుబంధాన్ని 1857న జరిగిన సిపాయి తిరుగుబాటుతో బ్రిటీష్ పాలకులు గుర్తించారు. దీంతో కుల కట్టుబాట్లు, మత ఆచార వ్యవహారాలు, కులానికి, మతానికి మధ్యవున్న విడదీయరాని సంబంధంపై బ్రిటీషువారు దృష్టి సారించారు. అప్పటి సోషియాలజిస్టులు, ఆంత్రోపాలజిస్టులతో అధ్యయనం జరిపించారు. ఎత్నొగ్రాఫిక్ అధ్యయనాలు కూడా చేయించారు. 1857 తర్వాత తమ ఆధీనంలో ఉన్న ప్రాంతాల్లో జిల్లా మాన్యువల్స్, గజిటీర్స్ తయారు చేయించి, భూ వ్యవస్థలతో పాటు సామాజిక వ్యవస్థల గురించి విపులంగా తెలుసుకునే ప్రయత్నం చేశారు.

జనాభా లెక్కలు, కులం, మతం, జెండర్, పిల్లలు, పెద్దల వంటి పలు అంశాల సేకరణకు బీజం వేశారు. కులంపై తొలిసారి అధ్యయనం చేసిన సామాజిక శాస్త్రవేత్తలు, బ్రిటీష్ అధికారులు విలియం హంటర్, హెర్బర్ట్‌రిస్లే, ఎడ్గార్ థర్ట్‌సన్, జె.హెచ్.హట్టన్‌ల ఆధ్వర్యంలో మనదేశంలో 1871 నుంచి 1931వరకు అరవై సంవత్సరాల పాటు పది సంవత్సరాలకొకసారి ఆరుసార్లు కుల ప్రాతిపదికన జనాభా లెక్కలు సేకరించారు. దీంతో కుల ప్రాధాన్యత పెరిగి ఆయా కులాలు తమ 'కులెదా' పెంచాలని ఒత్తిడులు, తమ కులమే గొప్పదని వాదనలు, వీటికితోడు అగ్రకులాల ఆధిపత్య పోరుతో 1941 నుంచి జనాభా లెక్కల సేకరణలో కులాన్ని చేర్చకుండా నిలిపివేశారు.

స్వాతంత్రోద్యమ అనంతరం దేశ రాజకీయాల్లో కులం అత్యంత ప్రభావశీల అంశంగా ముందుకు వచ్చింది. పేదరికం, వెలి, అణిచివేత, సామాజిక హోదా, ఆధిపత్యం, గౌరవ మర్యాదలకు మారుపేరుగా కులం రోజురోజుకూ బలపడుతూ వచ్చింది. దేశ సామాజిక వ్యవస్థపై అగ్రకులాల పట్టును కుల జనాభా లెక్కల ద్వారా వెలుగులోకి తెచ్చింది. 1909లో మింటోమార్లే సంస్కరణల ద్వారా ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు, 1932లో బ్రిటిష్ వారు షెడ్యూల్ కులాలకు కూడా కులప్రాతిపదికన ప్రత్యేక నియోజకవర్గాలు కేటాయించడానికి సిద్ధపడ్డారు. ఆ ఏడాది అంబేద్కర్–గాంధీల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు వాటి స్థానంలో ఎస్‌సిలకు రాజకీయ రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి. సుమారు అరవై ఏళ్ల తర్వాత తిరిగి 1990లో మండల్ కమిషన్ నివేదిక అమలు కావడంతో ఓబిసి చైతన్యాన్ని దేశవ్యాప్తం చేసింది. దీంతో 1991 నుంచి కులాన్ని జనాభా లెక్కల్లో చేర్చాలని డిమాండ్ మొదలై 2001 నాటికి గరిష్ట స్థాయికి చేరుకుంది. ప్రజా డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని కేంద్రప్రభుత్వం 2011 నుంచి జనాభా లెక్కల్లో కులాలవారీ లెక్కలు సేకరించారు. కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం ఒక ప్రత్యేక కమిటీ వేసింది. కానీ ఇంతవరకు కులాల లెక్కలను ప్రకటించలేదు.

వ్యక్తుల సామాజిక స్థాయిని, సంపదను, జ్ఞానాన్ని అధికారాన్ని కులం నిర్ణయిస్తుందని జ్యోతిబా ఫూలే, అంబేద్కర్‌లు సూచించారు. ఈ విషయాన్ని జనాభా లెక్కలు స్పష్టం చేయడానికి ఆస్కారముంది. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులపైనే కాకుండా వార్డు, గ్రామ, పట్టణ ప్రాంతాల ప్రజల లెక్కలు అందించే ప్రాథమిక సమాచారానికి ఆధారంగా నిలుస్తుంది.

పార్లమెంట్ నుంచి గ్రామస్థాయి వరకు రిజర్వేషన్లను ఏర్పాటు చేయడానికి అవకాశ ముంటుంది. ఆదాయం, జీవన ప్రమాణం, విద్య, ఆరోగ్యం, ఉద్యోగ అవకాశాలు తదితరమైన అంశాలకు చెందిన సమాచారం అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక ప్రక్రియ ను ప్రతిబింబించేలా ప్రభుత్వ విధానాలను జోడించి కులాల వారీగా జనాభా లెక్కించడం తప్పనిసరిగా మారింది.

జనాభా లెక్కల సేకరణతో జాతికి ఒక రూపం వస్తుంది. సామాజిక న్యాయం, అస్తిత్వాలని స్థిరపరచడం, జ్ఞాన సమపార్జనకో కాకుండా సామూహిక అస్తిత్వాలను సేకరించుకునే ప్రక్రియగా గుర్తించాలి. జనాభా లెక్కల సేకరణలో కులంను పొందుపరచడం వెనుకబడిన కులాల సమస్యలు, రిజర్వేషన్లు, కోటాలకు ఓ రూపాన్ని ఇచ్చి సాంఘిక, సామాజిక, ఆర్థిక బలోపేతం చేయడం ఒక కోణమైతే, జీవితాన్ని క్రమబద్ధీకరించి అర్థవంతం చేసే సంక్లిష్ట నిర్మాణంగా చూడటం మరో కోణం. కులాన్ని వర్గంతో పాటు అధికారం, వనరులు, ఆధిక్యతల పంపకాన్ని నిర్దేశించే పంపిణీ సంబంధాల నెట్‌వర్క్‌లా ఉపయోగపడుతుంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వెనుకబడిన కులాల లెక్క తేల్చేందుకు ప్రభుత్వం సిద్ధం కావడం చాలా సంతోషకరమైన విషయం. సమగ్ర కుటంబ సర్వే జరిపినప్పుడే కులాల సంఖ్య వెల్లడవుతుందని చాలామంది ఆశించారు. కానీ అలా జరుగలేదు. జనాభా ప్రతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఉద్దేశంతో సమగ్ర అధ్యయనం చేయడానికి ముందుకువచ్చిన బిసి కమిషన్‌ను కూడా అభినందించాలి.

కులపరమైన సమాచారం సేకరించేటప్పుడు చిన్నసంఖ్యలో ఉన్న సంచార జాతులను సరిగ్గా గుర్తించాలి. జనాభా లెక్కలు సేకరించే వారికి ఆయా కులాలలోని ఉప కులాల పేర్లు తెలియకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతుంటాయి. వీటిని అధిగమించేలా సర్వేకు సమగ్ర రూపకల్పన జరగాలి. సమగ్రమైన, సరైన కులాల వివరాల సేకరణకు జాగ్రత్తగా, శ్రద్ధగా రూపొందించిన ఎత్నోగ్రాఫిక్(ఫీల్డ్ వర్క్)తో కూడిన అధ్యయనాల ద్వారానే సాధ్యపడుతుందన్న నిష్ణాతుల సూచనను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వ యంత్రాంగం ద్వారా నిర్వహించిన సేకరణ కంటే స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ ద్వారా కుల సేకరణ జరపాలన్న విషయాన్ని ప్రభుత్వం గమనంలోకి తీసుకోవాలి. అప్పుడే కులాల జనాభా పారదర్శకంగా ఉంటుంది.



భీష్ముడు గంగా,శంతనుల అష్టమ పుత్రుడు. ఇతని అసలు పేరు 'దేవవ్రతుడు''. వార్ధక్యదశలో శంతనుడు, సత్యవతి సౌందర్యానికి దాసుడై, మన్మథవశవర్తియై, విరహవేదనతో వ్యాకుల శయ్యాగతుడైతే, ఈ సంగతి తెలిసిన 'దేవవ్రతుడు'' తన తండ్రి ఆనందం కోసం, సుఖసంతోషాల కోసం, స్వసుఖాలను, జీవన మాధుర్యాన్ని తృణప్రాయంగా త్యజించి, 'నా జీవితంలో వనితకు, వివాహానికి తావులేదు'' అని సత్యవతికి వాగ్దానం చేశాడు. భీషణ ప్రతిజ్ఞకు కట్టుబడిన త్యాగశీలి. అందుకే ఆయన 'భీష్మ''డయ్యాడు.



అప్రతిహత పరాక్రమవంతుడు

పితామహుని ప్రతాపం : కురుక్షేత్ర రణక్షేత్రంలో ధర్మహోమాగ్నికి అధర్మపరులను సమిథులుగా, అవినీతి వర్తనులను హవిస్సుగా, అరివీరుల హాహాకారాల 'స్వాహా''కారాలతో యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు స్వయంగా జరిపించిన ఆహ్వ యజ్ఞాన్ని ... ఒంటిచేత్తో పదిరోజులు నడిపించిన నిరుపమాన ధనుర్విద్యా పితామహుడు భీష్ముడు. భీష్మ ధనుర్విముక్త నిశిత శరాఘాతాలకు, పరమశివుని మెప్పించి పాశుపతం సంపాదించిన పార్థుడే కాదు, పార్థసారథి కూడా నిశ్చేష్టుడయ్యాడు. 'ఆహవరంగంలో ఆయుధం పట్టను'' అని పల్కిన శ్రీకృష్ణుడే తన ప్రతిజ్ఞను విస్మరించి భీష్మసంహారానికి ఆయుధం పట్టాడు. పరమాత్ముడి చేతనే ప్రతిజ్ఞాభంగం చేయించిన అప్రతిహత పరాక్రమవంతుడు భీష్ముడు.

శరతల్పం: తల నెరిసి, చూపు మందగించి, జవసత్వాల పట్టు తప్పి, వార్ధక్యవార్ధికి అవ్వాలితీరాన వున్నా భీష్ముడు ... పున్సత్వం నశించిన పాండవులు, శిఖండిని ముందునుంచుకుని పోరుకు తలబడితే, తాను శిఖండి కాలేక అస్త్రసన్యాసం చేసి, గాండీవ ధనుర్విముక్త శరసహస్రానికి శరతల్పగతుడయ్యాడు. అంతమాత్రాన అర్జునుడు విజయుడయ్యాడనుకుంటే మాత్రం పొరపాటే. అధర్మపక్షాన నిలబడి, ధర్మంతో పోరుకు సిద్ధపడినప్పుడే భీష్ముడు మరణాన్ని స్వాగతించాడు. అదే, తన అసమర్థతకు శిక్ష అని భావించాడు. అంపశయ్యగతుడైన భీష్ముని చూసి దేవతలు సైతం దుఃఖించారు. అమ్ములు ములుకుల్లా బాధిస్తున్నా, సహిస్తూ, యుద్ధరంగంలో పీనుగుల గుట్టల మధ్య, క్షతగాత్రుల రోదనలు వింటూ, నక్కల, తోడేళ్ళ, రాబందుల, గుడ్లగూబల అరుపులు ఆలకిస్తూ, ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు, యాభై ఎనిమిది రోజులు ఒంటరిగా మరణవేదనను అనుభవిస్తూ, మానవజన్మకు మహత్తరమైన మరణం కోసం, ఉత్తరాయణ పుణ్యకాలం కోసం ఎదురుచూస్తూ గడిపాడు భీష్ముడు. కురుక్షేత్ర సంగ్రామం ముగిసింది. ధర్మరాజు విజయలక్ష్మిని వరించాడు. స్వజనుల రక్తతిలకంతో, అయినవాళ్ళ అశ్రుజలధారలతో హస్తిన సింహాపీఠంపై సార్వభౌమునిగా అభిషిక్తుడయ్యానే ...

అన్న బాధతో ధర్మజుడు, సంతోషాన్ని మానసిక శాంతిని పొందలేకపోయాడు. వెంటనే శ్రీకృష్ణునితో కలిసి, తన సోదరులను వెంటబెట్టుకుని శరతల్పగతుడైన ఆ 'శాంతనవుని'' దగ్గరకు వచ్చాడు.

మహాప్రస్థానం : ధ్యాన సమాధి స్థితిలోనున్న భీష్ముడు, ఎవరో తన దగ్గరకు వచ్చిన అలికిడికి ఏకాగ్రత సడలి, అలసటతో వాలివున్న కనురెప్పలను భారంగా పైకెత్తి చూసాడు. పాండవులు, శ్రీకృష్ణుడు కనిపించారు. మరణానికి చివరిమెట్టు మీదవున్న అంతిమ క్షణంలో మాధవుని ముఖారవింద దర్శనం ఆ కురువృద్ధునికి ఆనందం కలిగించింది. భక్తితో చేతులు జోడించాడు. పాండవులు ఆ జ్ఞాననిధికి పాదాభివందనం చేశారు. మౌనంగానే వారిని ఆశీర్వదించాడు భీష్ముడు. అప్పుడు ధర్మరాజు వినయంగా చేతులు జోడించి, 'పితామహా! సంగ్రామ ఫలమైన విజయలక్ష్మిని వరించానన్న మాటేగానీ, మానసిక విజయాన్ని వరించలేకపోయాను. నాకు మానసిక శాంతి కలిగే మార్గాన్ని ఉపదేశించు. ఈ విశ్వంలో గొప్ప దైవం ఎవరు? ఎవరిని కీర్తిస్తే సుఖసంతోషాలు లభిస్తాయి. ఎవరిని అర్చిస్తే సకల శుభాలు కలుగుతాయి? ఎవరిని శరణుకోరితే ఈ భయంకర సంసార సాగరం నుంచి విముక్తి కలుగుతుంది?'' అని ప్రశ్నించాడు.

భీష్ముడు చిరునవ్వుతో ధర్మజుని వైపు చూసి ... తన చూపులను శ్రీకృష్ణునిపై నిలిపి, 'ధర్మజా! నీ సందేహాలన్నింటికీ నా చివరి సమాధానం, లీలా మానుష విగ్రహుడైన ఈ శ్రీకృష్ణుడే'' అంటూ చేతులు జోడించి, 'జగత్ ఏభుం దేవదేవమనంతం పురుషోత్తమం'' అంటూ ప్రారంభించి, 'విశ్వం విష్ణుర్వషట్కారో భూత భవ్య భవత్ప్రభుః'' అంటూ విష్ణుసహస్రనామావళిని వేయి విధాలుగా కీర్తిస్తూ, విశ్వకళ్యాణ కాంక్షతో మానవాళికి అందించాడు. అదే ఏకాగ్రతతో శ్రీకృష్ణుని చూస్తూ 'ఊర్ధ్వలోక ప్రయాణానికి అనుమతి ఇమ్మని కోరాడు. శ్రీకృష్ణుడు దీవిస్తూ 'గాంగేయా! నీ భక్తిపారవశ్యం నాకు ఆనందం కలిగించింది. మాఘశుద్ధ ఏకాదశి తిథిని నీ సంస్మరణదినంగా నీకు కానుక యిస్తున్నాను. మహామహులకు లభించే శాశ్వత పుణ్యలోకాలు నీకు లభిస్తాయి'' అని పలికాడు. మాఘశుద్ధ అష్టమి తిథిరోజున భీష్ముని ఆత్మ ఈ భౌతిక ప్రపంచాన్ని వీడి పరమాత్ముడైన శ్రీకృష్ణునిలో లీనమైంది. మహాభారత ఇతిహాసంలోని ఓ మహామహుని మహాప్రస్థానం ఇలా ముగిసింది.

భీష్మ నిర్యాణం జరిగి సహస్రాబ్దాలు గతిస్తున్నా ఆయన ప్రవచించిన 'విష్ణుసహస్రనామ స్తోత్రం'' ఇప్పటికీ భాగవతుల రసాగ్రాలపై నర్తిస్తూనే వుంది. ఆయన దివ్యవాణి విశ్వవ్యాప్తమై ప్రతిధ్వనిస్తూనే వుంది. విష్ణుసహస్రనామ పఠనం సర్వదుఃఖహరణం, సకల శుభకరణం. ఆ నామావళిలోని ప్రతి అక్షరం దైవస్వరూపమే. ప్రతినామమూ మహామంత్రమే. అది అజరామరం.

" తేజో భాస్కరునకు అస్తమయం వుండదు
త్యాగ భాస్కరులకు అస్తమయం వుండదు"

అశ్రుతర్పణం: భీష్ముడు పరమపదం చేరిన మాఘశుద్ధ అష్టమిని 'భీష్మాష్టమి'' గాను, మాఘశుద్ధ ఏకాదశిని 'భీష్మఏకాదశి''గాను మానవాళి స్మరించడమే, మనం ఆ పితామహునకు యిచ్చే అశ్రుతర్పణాలు. భారతజాతి మొత్తం ఆయనకు వారసులే. అందుకే జాతి, మత, కులభేదాలు విస్మరించి అందరూ ఆ మహాయోధునికి ఈ భీష్మఏకాదశి పర్వదినం నాడు తిలాంజలులు సమర్పించాలి.

28న
భీష్మ ఏకాదశి

'వైయాఘ్రపద్య గోత్రాయ సాంకృత్యప్రవరాయచ
గంగాపుత్రాయ భీష్మాయ ఆజన్మ బ్రహ్మచారిణే
అపుత్రాయ జాలందద్మి నమో భీష్మాయ వర్మణే
భీషశ్శాంతనవో వీర స్సత్యవాదీ జితేంద్రియః
అభిరర్భివాప్నోటు పుత్రపౌత్రో చితాం క్రియమ్ ''

అని ధర్మసింధువు చెబుతూంది. అంటే, 'వ్యాఘ్రపాద గోత్రమునందు జన్మించినవాడు, సాంకృత్యప్రవరుడు, గంగాపుత్రుడు, ఆజన్మ బ్రహ్మచారి, అపుత్రకుడు అయిన భీష్మునకు తర్పణములు యిచ్చుచున్నాను. ఈ తర్పణములతో శాంతనపుత్రుడు, వీరుడు, సత్యసంధుడు, జితేంద్రియుడు అయిన భీష్ముడు పుత్రపౌత్రక్రియలవలె తృప్తినొందుగాక'' అను అర్థముగల ఈ మంత్రముతో అపసవ్యముగా యజ్ఞోపవీతము వేసుకుని, తర్పణమిచ్చి, ఆచమనము చేసి, సవ్యముగా యజ్ఞోపవీతము వేసుకుని ఈ క్రింది శ్లోకముతో అర్ఘ్యము యివ్వాలి.

"వసూనామవతారాయ శంతనోరాత్మజయచ
అర్ఘ్యం దదామి భీష్మాయ ఆ బాల్య బ్రహ్మచారిణే''

'అష్టవసువులకు ఏకావతారమగు శంతను పుత్రుడైన భీష్మునకు అర్ఘ్యం యిచ్చుచున్నాను'' అని అర్థం. శాస్త్రం ప్రకారం తండ్రి లేనివారే తర్పణాలు యివ్వడానికి అర్హులు. కానీ, భీష్మునికి తర్పణాలు యిచ్చే విషయంలో తండ్రి జీవించివున్నా వారు కూడా తర్పణాలు యివ్వవచ్చునని ఋషులు సమ్మతించారు. అయితే జీవత్పితృకులు తర్పణాలు యిచ్చేటప్పుడు యజ్ఞోపవీతాన్ని అపసవ్యంగా వేసుకోకుండా కుడిచేతి బొటనవేలికి చుట్టుకుని తర్పణాలు యివ్వాలి. భీష్మునికి తర్పణాలు యిస్తే బహుపుణ్యప్రదమని, అనేక జన్మల పాపాలు నశిస్తాయని శాస్త్ర ప్రమాణం. అంతేకాదు ... 'సంతానం లేని దంపతులు 'భీష్మాష్టమి నాడు'' కానీ 'భీష్మఏకాదశి'' నాడు గానీ, భీష్మునికి శ్రాద్ధము (తద్దినం) పెడితే వారికి సత్ సంతానం కలుగుతుందని శాస్త్ర ప్రమాణం.

ముఖ్యంగా విష్ణు సహస్ర నామ జపం, ధ్యానం వల్ల భయం పోతుంది. శుభం కలుగుతుంది. గణపతిని, వ్యాస భగవానుని,పితామహుని,పాండవులను, తల్లిదండ్రులను, గురువులను భక్తి పూర్వకంగా స్మరించి తదుపరి, ఈ దివ్య నామములను జపిస్తూ తేజోమయుడైన, పరమాత్ముని ధ్యానించి బాధల నుంచి విముక్తులమవుదాం.



మన భరత భూమి పుణ్య భూమి. భక్తికి, భక్తి తత్వానికి పుట్టినిల్లు. అచంచలమైన భక్తి విశ్వాసాలతో భగవదారాధన చేసి, దైవానుగ్రహాన్ని పొందేందుకు, మన పూర్వులు నియమించిన కొన్ని పర్వ దినాలలో, ఏకాదశి వొకటి.

కనుక, ఈ భీష్మఏకాదశి పర్వదినాన భీష్మాచార్యునికి తిలాంజలులు సమర్పించి శ్రద్ధాంజలి ఘటిద్దాం. మన కర్తవ్యాన్ని నిర్వహిద్దాం.

ఆరోగ్యం అల్లాహ్ అనుగ్రహం

"ఐదు విషయాలను ఐదు విషయాలకు పూర్వం మేలైనవిగా భావించండి.
* యవ్వనాన్ని వృద్ధాప్యానికి పూర్వం
* ఆరోగ్యాన్ని అనారోగ్యానికి పూర్వం * కలిమిని లేమికి పూర్వం * తీరికను నిమగ్నతకు పూర్వం * జీవితాన్ని మరణానికి పూర్వం''
– ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)

వక్త చెప్పిన ఐదు విషయాల్లో రెండో విషయం గురించి కాస్తంత చర్చిద్దాం. ఆరోగ్యాన్ని అనారోగ్యానికి పూర్వం మేలైనదిగా భావించాలి అంటే ఆరోగ్యాన్ని మహా భాగ్యంగా అల్లాహ్ ప్రసాదించిన గొప్ప అనుగ్రహంగా భావించి దాన్ని కాపాడుకోవాలి. దీపం ఉన్నప్పుడే ఇంటిని చక్కదిద్దుకోవాలన్నది ప్రవక్త బోధన సారాంశం. దీపం ఆరిపోతే ఇంటిని సరిదిద్దడం ఎంత కష్టమో ఒక్కసారి ఆరోగ్యం చెడితే దాన్ని బాగుచేసుకోవడం కష్టతరం. ఆరోగ్యం బాగున్నప్పుడు ఉన్న చురుకుదనం అస్వస్థతకు గురైనప్పుడు ఉండదు. నిస్సహాయత, నిరాశ దరిచేరతాయి. ఓపిక నశిస్తుంది. ఏ పనీ సక్రమంగా చేయలేము. అందుకే మనకు ఈ రోజు దేవుడు ప్రసాదించిన ఆరోగ్యానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి. వీలైనన్ని నమాజులు, పుణ్యకార్యాలు చేసుకోవాలి. నమాజు కోసం మస్జిద్ కు చేరుకోవాలి. మంచి పనుల్లో పాల్గొనాలి. తోటివారిని ఆదుకునేందుకు ముందుండాలి. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి. ఆరోగ్యం చెడితే మనమే మరొకరిమీద ఆధారపడాల్సిన గత్యంతరం ఏర్పడుతుంది. ఆరోగ్యాన్ని పాడుచేసే దురలవాట్లకు దూరంగా ఉంటూ మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోవాలి. మనిషి మనుగడకోసం ఈ ప్రపంచంలో ఎన్నో వనరులను మనకు లోబర్చాడు అల్లాహ్. ఎన్నో అనుగ్రహాలను ప్రసాదించాడు. అమూల్యమైన ఈ అనుగ్రహాలను మనిషి లెక్కించాలనుకుంటే అది అసాధ్యమే. మనిషి జీవితానికి మంచి ఆరోగ్యం, అంగసౌష్టవం, దేహదారుఢ్యం ఎంతో అవసరం. మంచి ఆరోగ్యంతోనే మనిషి చురుగ్గా ఉండగలుతాడు. అప్పుడే మేథస్సులో మంచి ఆలోచనలకు బీజం పడుతుంది. జీవితంలో ఏమి సాధించాలన్నా పరిశ్రమించగలడు. చెమటోడ్చి శక్తియుక్తులన్నీ ధారపోసి తాను అనుకున్నది సాధించుకోగలడు. విజయతీరాలకు చేరేందుకు కఠోరశ్రమను చేయగలడు. ఆరోగ్యవంతులే తన స్వయానికీ, తన ఇంటివారికి చివరికి సమాజానికీ లబ్ధిచేకూర్చగలుగుతారు. దానికి భిన్నంగా వ్యాధిగ్రస్తుడు, రోగగ్రస్తుడు, బలహీనమైన మనిషి జీవితంలో దేన్నీ సాధించలేడు. చివరికి తమ అవసరాలను తీర్చుకోవడానికి కూడా ఇతరులపై ఆధారపడాల్సి వస్తుంది. ప్రాపంచిక భౌతిక అవసరాలు తీర్చుకోవడానికి, జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవడానికి ఆరోగ్యం ఎంతటి కీలకపాత్ర పోషిస్తుందో ధార్మిక అవసరాలు తీర్చుకోవడానికి, ధార్మిక ఉన్నతిలోనూ ఆరోగ్యం అంతే కీలక పాత్ర పోషిస్తుంది. ఆరోగ్యంగా చురుగ్గా ఉన్న ముస్లిమే దైవారాధనలను సక్రమంగా నిర్వర్తించగలడు. ధార్మిక కార్యకలాపాలను ఆచరించగలడు. సత్యధర్మ మార్గంలో వచ్చే అవరోధాలను ఎదురించి నిలకడ చూపగలడు. మంచిని పెంచి చెడును నిర్మూలించడంలో వచ్చే కష్టాలను స్థైర్యంతో ఓర్చుకోగలడు. సమాజ సేవలో, తోటి వారిని ఆదుకోవడంలో చురుగ్గా పాల్గొనగలడు.



"అందుకే అల్లాహ్ తన ప్రవక్తలుగా నవయువకులనే ఎన్నుకున్నాడు. ''మూసా తన నిండు యౌవనదశకు చేరుకున్నప్పుడు, అతని పెరుగుదల పరిపక్వతను సంతరించుకున్నప్పుడు, మేము అతనికి వివేకాన్నీ, జ్ఞానాన్నీ ప్రసాదించాము. మేము సజ్జనులకు ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తూ ఉంటాము.'' (దివ్యఖుర్–ఆన్ 28:14)"

వారి ప్రవక్త వారితో ఇలా అన్నాడు : ''మీకు ఏలికగా అల్లాహ్ తాలూత్‌ను నియమించాడు.'' ఇది విని వారు ఇలా అన్నారు : ''మాపై రాజ్యం చేసే హక్కు అతనికెలా సంక్రమిస్తుంది? రాజ్యం చేసే హక్కూ, అర్హతలూ అతనికంటే మాకే ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే, అతడు శ్రీమంతుడు కాదు.'' దానికి సమాధానంగా ప్రవక్త వారితో ఇలా అన్నాడు : ''మీకు బదులుగా అల్లాహ్ అతనినే ఎన్నిక చేశాడు. అల్లాహ్ అతనికి బుద్ధిబలాన్నీ, కండబలాన్నీ సమృద్ధిగా ప్రసాదించాడు. తాను కోరిన వారికి తన రాజ్యం ప్రసాదించే అధికారం అల్లాహ్ కు ఉంది. (దివ్యఖుర్ఆన్ 2:267)

పరిపాలన చేయాలన్నా, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలన్నా, వ్యక్తిగత లక్ష్యాలైనా, ధార్మిక సేవకైనా, సామాజిక సేవకైనా బుద్ధిబలంతో పాటు కండబలం కూడా అవసరమని ఈ ఖుర్ఆన్ ప్రబోధనల ద్వారా తెలుస్తోంది.

మనిషి ఆరోగ్యంగా ఉంటేనే అతనిలో ఆరోగ్యకరమైన ఆలోచనలు పుడతాయి. ఏదైనా నేర్చుకోగలడు, పదిమందికి నేర్పగలడు. నలుగురుకి సహాయపడగలడు. అనారోగ్యం పాలైతే ఆలోచించే స్థోమత సన్నగిల్లుతుంది. మన సంకల్పాలు బలహీనమవుతాయి. చురుకుదనం మందగిస్తుంది. అందుకే ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసం) 'ఆరోగ్యాన్ని అనారోగ్యానికి పూర్వం మేలైనదిగా భావించాలని తాకీదు చేశారు

ముహమ్మద్ ముజాహిద్


పంచయజ్ఞాలు




యజ్ఞం లేదా యాగం ఒక విశిష్టమైన హిందూ సంప్రదాయం. భారతదేశంలో పురాణకాలం నుండి వివిధ రకాలైన యజ్ఞాలు జరిగాయి. దేవతలకు తృప్తి కలిగించం యజ్ఞం లక్ష్యం. 1. బ్రహ్మ యజ్ఞం : ఒక ఋక్కును గాని , యజస్సును గాని , సామాన్ని గాని శక్తి కొద్దీ నిత్యమూ అభ్యసించడం ... అనగా నిత్యవేదాధ్యయనం 2. దేవ యజ్ఞం : దేవతాతృప్తి కోసం హవిస్సు మొదలైన దేవతా ప్రీతికరమైన పదార్థాల్ని అగ్నిలో హోమం చేయడం 3. పితృయజ్ఞం : పితృదేవతా ప్రీతికై స్వధాకారంతో తర్పణాలు ఇచ్చి విప్రులకు భోజనం పెట్టడం . 4. భూత యజ్ఞం: నిత్యమూ చేయవలసిన వైస్యదేవానుష్టానం అనంతరం ఆరుబయలు ప్రదేశములో భూత తృప్తి నిమిత్తము భూత బలిగా ఇచ్చే ఆహార సమర్పణ. 5. మనుష్య యజ్ఞం : యథాశక్తిగా అతిథులకు భోజనం పెట్టడం .

మనిషి ఆంతర్యంలోని అనంత శక్తి

దేవుడు తన జ్ఞానాన్ని, శక్తి సామర్థ్యాన్నంతటినీ కలబోసి చేసిన అద్భుతమైన, అపురూపమైన సృష్టి మానవుడు. అందుకే నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయము, ఆశ్చర్యము కలుతున్నాయంటాడు. కీర్తనాకారుడైన దావీదు (కీర్తన 139:14). దేవుని శక్తికి, సృజనాత్మకతకు, ప్రావిల్యంగా దేవుని మంచితనానికి మనిషి ప్రతీక. నేను ఇంకాస్త పొడుగ్గా, ముక్కు కళ్లు ఇంకాస్త పెద్దవిగా, నేనింకాస్త సన్నగా ఉంటే ఇంకా ఎక్కువ విజయం సాధించి ఉండే వాడినని మీరెప్పుడైనా అనుకున్నారా? దేవుడు మీలో నిక్షిప్తం చేసిన శక్తిసామర్థ్యం, మొత్తంగా మీ విలువ మాకింకా అర్థం కాలేదన్న మాట. తోటి వాళ్ళు విసిరే నెగిటివ్ కామెంట్లు, ఫాషన్ సూత్రాలు, శీర్షికల ఆధారంగా మీ విలువను మీరు బేరీజు వేసుకోకండి. లోకానికి సొంత పోకడలున్నాయి, అవి ఎప్పుడూ మారుతూంటాయి. అద్దంలో మీకు కనిపించే రూపం కేవలం బాహ్యం!! మీ ఆంతర్యంలో దేవుడు నింపిన సౌందర్యాన్ని మీకు చూపించగలిగిన అద్దాన్ని, ఎలా శక్తి సామర్థ్యాల్ని వెలగట్టగల కేలిక్యులేటర్‌ను మనిషెన్నటికీ నిర్మించలేడు. శరీరం, ఆత్మల కలయికే మనిషి. శరీరం నానాటికీ కృశించిపోతూండగా దైవిక చింతనతో, దేవున్ని ఆత్మతో సత్యంతో ఆరాధించే నిరంతర దైవిక ప్రక్రియతో ఆంతర్యంలోని 'జీవి''నానాటికీ ప్రజ్వలనమవుతూండగా, ఆ క్రమంలోనే మనిషి విశ్వాసిగా మారుతాడన్నది బైబిలు వివరించే మర్మం, తాత్పర్యం. నేను కృశిస్తున్న బాహ్య గుడారంలో ఉంటూ కూడా నానాటికీ ప్రజ్వరిల్లుతున్న ఆంతర్యపు ఆత్మ జీవినంటాడు. అందుకే అపొస్తలుడైన పౌలు (2 కోరింది, 4:16). మన ఆంతర్య సౌందర్యం, జీవితో పొంతనలేని బాహ్యసౌందర్యాన్ని లోకం ఆస్వాదిస్తుంది, ఆరాధిస్తుంది. దేవుడు మాత్రం విశ్వాసి ఆంతర్యంలో నానాటికీ ఎదుగుతున్న ఆంతర్యజీవిని అతని ద్వారా విశ్వాసి జీవితంలో వర్ధిల్లుతున్న జీవనసాఫల్యాన్ని చూసి ఆనందిస్తాడు. దేవుడు ఆత్మ గనుక ఆయన్ను ఆరాధించేవారు ఆత్మతో సత్యంతో ఆరాధించాలని యేసు ప్రభువు ఒక అద్భుతమైన ఆరాధనా రహస్యాన్ని ఆవిష్కరించాడు. (యోహాను 4:24). ఆరాధనంటే ఇంటిపై కప్పు ఎగిరిపోయేలా బిగ్గరగా చేసే ప్రార్థనలు, కర్ణభేరిని పగులగొట్టే డప్పు వాయిద్యాలుగా భ్రమిస్తున్న నేటి విశ్వాసులకు అంతతొందరగా తేలిగ్గా ఈ మర్మం అర్థం కాదు. దేవుని ఆత్మతో విశ్వాసి ఆత్మ, ఆంతర్యంలోని సత్యం మమేకమైనప్పుడు వెలువడే సృజనాత్మక శక్తిని ఎదుర్కోగల 'విధ్వంసక శక్తి' ఈ లోకంలో లేదు. మానవాళి పట్ల దేవుని ప్రణాళికలనది అమలుచేసి లోకాన్ని పరలోకంగా మార్చుతుంది.





రివ.డా.టి.ఎ. ప్రభుకిరణ్
98488 21472

వేములఘాట్ డిమాండ్లకు పరిష్కారం



మన తెలంగాణ / హైదరాబాద్ : మల్లన్న సాగర్ రిజర్వాయర్ పరిధిలోని వేములఘాట్ గ్రామ ప్రజల డిమాండ్లను పరిష్కరించి గత 600 రోజులగా దీక్షను విరమింపజేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును కోరారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ సామర్థ్యం పెంపు, నిర్వాసితులకు నష్టపరిహారం తదితర అంశాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, ఇంజనీరింగ్ నిపుణులతో పాటు అందరి సలహాలు పరిగణలోకి తీసుకుని నష్ట నివారణకు తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన సిఎం కెసిఆర్‌కు శుక్రవారం ఒక లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మల్లన్న సాగర్ రిజర్వాయర్‌ను 50 టియంసిల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టడం అన్యాయమని రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం తప్పుపట్టిందని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ముక్తకంఠంతో ఖండించాయని చాడ లేఖలో తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం పునర్ పరిశీలనకు సిద్ధపడకుండా ముంపు గ్రామస్తులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించకుండా దాట వేసిందన్నారు. రిజర్వాయర్ సామర్థ్యాన్ని 5 టియంసిలకు కుదించగలిగితే గ్రామాల ముంపు తగ్గుతుందన్నారు. వేములఘాట్ గ్రామస్తులు ఐక్యమత్యంతో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఎలాగైతే రిలే దీక్షలు నిర్వహించారో, అదే విధంగా 600 రోజులుగా రిలే దీక్షలు ప్రజల చైతన్యానికి అద్దం పదుతున్నదన్నారు.

డిస్కంల సిఎండిలకు అవార్డులు





మన తెలంగాణ/హైదరాబాద్: టిఎస్ ఐపాస్ పథకం అమలులో ప్రతిభ కనబరిచిన విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రభుత్వం గౌరవించింది. పరేడ్ గ్రౌండ్స్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ చేతుల మీదుగా డిస్కంల సిఎండిలకు టిఎస్ ఐపాస్ అవార్డులు అందజేశారు. టిఎస్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి గౌరవరం రఘుమారెడ్డి, టిఎస్ ఎన్‌పిడిసిఎల్ సిఎండి అన్నమనేని గోపాలరావు అవార్డులు అందుకున్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం తమకు అందే దరఖాస్తులకు త్వరితగతిన మంజూరు చేయడం, గరిష్టంగా వారం రోజుల్లో ఎల్‌టి, హెచ్‌టి కనెక్షన్‌లు ఇచ్చేలా తగు ఏర్పాట్లు చేయడం, తదితర సులభ ప్రక్రియలను డిస్కంలు ప్రవేశపెట్టాయి. దీంతో పరోక్షంగా పారిశ్రామిక అభివృద్ధి, సానుకూల వాతావరణం పెరిగాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

సౌర విద్యుత్‌లో రాష్ట్రం అగ్రగామి



మన తెలంగాణ/హైదరాబాద్: సౌరవిద్యుత్‌లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని టిఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం విద్యుత్‌సౌధలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేసిన సందర్భంగా ప్రసంగిస్తూ విద్యుత్ వాహనాల పాలసీని విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత ఈ నిర్ణయం ఉంటుందన్నారు. విద్యుత్ వాహనాల చార్జింగ్ ఏజెన్సీలకు ప్రత్యేక టారిఫ్ కేటగిరీని పొందుపరుస్తామని స్పష్టం చేశారు. జెన్‌కో ఆధ్వర్యంలో రూ.37,938 కోట్ల అంచనాతో 5,880 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఇందులో మణుగూరు (4 యూనిట్లు, 270 మెగావాట్లు), కొత్తగూడెం (800 మెగావాట్లు, 1 యూనిట్), దామరచర్ల (5 యూనిట్లు, 800 మెగావాట్లు) ఉన్నాయని వివరించారు. కెటిపిఎస్ (పాల్వంచ) 7వ దశ (800 మెగావాట్లు) పనులు చివరి దశలో ఉన్నాయని, రెండు నెలల్లో సింక్రనైజేషన్ ప్రక్రియ ముగిస్తామన్నారు. ప్రభుత్వరంగంలోని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అభివృద్ధిని చూసి దేశమంతటి నుంచి ప్రశంసలు వస్తున్నాయన్నారు. 11,000 మెగావాట్ల డిమాండ్ వచ్చినా తట్టుకునేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నామన్నారు. సోలార్ పాలసీతో 30 మెగావాట్ల నుంచి 3000 మెగావాట్లకు మించిన సామర్థ్యాన్ని రాష్ట్రం దక్కించుకుందన్నారు. వినియోగదారులకు సత్వర, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఉద్యోగులు పునరంకితం కావాలని ప్రభాకరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెఎండి ట్రాన్స్‌కో సి.శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో డైరెక్టర్లు జి.నర్సింగ్‌రావు, టి.జగత్‌రెడ్డి, జె.సూర్యప్రకాష్, జెన్‌కో డైరెక్టర్లు సి.రాధాకృష్ణ, ఎం.సచ్చిదానందం, సిహెచ్. వెంకటరాజం, ఎస్.అశోక్‌కుమార్, లలిత్ కుమార్ పాల్గొన్నారు.

డిజిపి కార్యాలయంలో...



తెలంగాణ పోలీసు హెడ్ క్వార్టర్స్ డిజిపి కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రేహ్యాండ్స్ ఎస్‌పి రమేష్‌రెడ్డి ఈ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డిజిపి కార్యాలయ అధికారులు, సిబ్బంది, సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల పంచాయతీ

(మొదటిపేజీ తరువాయి)

వాదన ఉన్నా ఆరు నెలలలోపు నిర్వహించవచ్చని మరో వాదన కూడా వినిపిస్తోంది. మొదటి వాదన ప్రకారం చూస్తే మే, జూన్, జూలై నెలల్లో ఎప్పుడైనా ఎన్నికలను నిర్వహించుకోవచ్చు. దీనిని దృష్టిలో ఉంచుకునే ఎన్నికల సంఘం రాష్ట్రప్రభుత్వానికి తాత్కాలిక షెడ్యూల్‌ను పంపింది. పలు సూచనలు కూడా చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం మార్చి 18లోగా పంచాయతీ ఓటర్ల తుది జాబితా సిద్ధం కావాలి. ఏప్రిల్ 16న రిజర్వేషన్లను ఖరారు చేయాలి. ఏప్రిల్ 17న పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై నిర్ణయం జరగాలి. జూన్ రెండవ వారంలో రాష్ట్రంలో విద్యాసంవత్సరం మొదలవుతుంది కాబట్టి మే చివరికల్లా ఎన్నికలు నిర్వహించాలని అధికారులు అభిప్రాయపడ్డారు.

అనుమానాలెందుకు

పంచాయతీ విభాగం అధికారుల అభిప్రాయం ప్రకారం.... ఎన్నికల సంఘం సూచించిన తాత్కాలిక షెడ్యూల్ ప్రకారం మే నెలాఖరులోగా ఎన్నికలు పూర్తి కావాలంటే గతేడాది నవంబర్ చివరినాటికే పంచాయతీల జాబితా తయారీ, డిసెంబర్ 17నాటికి వార్డుల పునర్విభజన జరగాలి. కానీ జనవరి ముగుస్తున్నా ఇవేమి పూర్తి కాలేదు. ఇక ముందస్తు కోసం ఇప్పుడున్న పంచాయతిరాజ్ చట్టానికి సవరణలు జరగాలి. దీని కోసమే సర్కారు కసరత్తు చేస్తోంది. ఇప్పటికి కొలిక్కి రాలేదు. మరింత సమయం పట్టవచ్చని అధికారవర్గాల అభిప్రాయం. ఇప్పటికిప్పుడు చట్ట సవరణ జరిగినా ఓటర్ల జాబితా సవరణ, రిజర్వేషన్ల ఖరారు వంటి వాటికి సమయం పడుతుంది. సర్పంచి ఎన్నిక పరోక్షమా, ప్రత్యక్ష్యమా అనే అంశం ఇంకా తేలలేదు. బ్యాలట్ పత్రాల ముద్రణతో ఇది ముడిపడి ఉంది. మరోవైపు ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటుపై ఈ నెల 31 కల్లా అధికారుల నుంచి నివేదిక అందుతుంది. అధిక జనాభా ఉన్న మేజర్ గ్రామ పంచాయతీలను మున్సిపాల్టీలుగా మార్చే ప్రతిపాదనకు సంబంధించిన ప్రక్రియ కూడా ఇంకా ఊపందుకోవాల్సి ఉంది.

బ్యాలట్ బాక్సుల కొరత

పంచాయతి ఎన్నికలను బ్యాలట్ పద్ధతిన నిర్వహించాల్సి ఉన్నందున బ్యాలట్ బాక్సుల లభ్యత కీలకమవుతోంది. లెక్క ప్రకారం రాష్ట్రంలో మొత్తం 41,395 బ్యాలట్ బాక్స్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు అన్ని జిల్లాల కలెక్టర్ల నుంచి 26,243 బాక్స్‌లకు సంబంధించిన వివరాలు అందాయని, సుమారు15 వేల బ్యాలట్ బాక్సుల ఆచూకీపై జిల్లాల అధికారులు ఆరా తీస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో దాదాపు ఒక లక్షా 20వేల పోలింగ్ కేంద్రాలు ఉంటాయని, కర్నాటక, మహారాష్ట్రల నుంచి సుమారు 60 వేల బాక్సులను తెప్పించే పనిలో రాష్ట్ర ఎన్నికల అధికారులు నిమగ్నమయ్యారు.

పండుగలా పశుసంక్రాంతి

• రూ.1.20లక్షలు పలికిన ధూలియా జాతి గేదె



మన తెలంగాణ/ హైదరాబాద్/ నార్సింగి : నార్సింగి కేంద్రంగా 150 ఏళ్లుగా కొనసాగుతున్న పశు సంక్రాంతిని వైభవంగా నిర్వహించారు. నిజాం కాలం నుండి ప్రతి ఏడాదిసంక్రాంతి పండుగ తరువాత వచ్చే వారంలో మొదటి శుక్రవారం పశు సంక్రాంతి జరుపుకుంటారు. పశు సంక్రాంతి వ్యాపారులు, కొనుగోలుదారులతో కొత్త శోభ సంతరించుకుంది. దేశంలోని మేలు రకానికి చెందిన ఆవులు, గేదెలు, ఎద్దులు, మేక పొట్టేళ్లు ఒక చోటకు చేరి పశు సంక్రాంతికి నార్సింగి వేదికైంది. తెలంగాణ రాష్ట్రానికి వన్నె తీసుకవచ్చే పశు సంక్రాంతి నగర శివారు ప్రాంతంలోని నార్సింగిలో చూడ ముచ్చటగా సాగింది. శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ నార్సింగిలో జరిగే పశు సంక్రాంతిని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ లో 150 ఏళ్లుగా సాగుతున్న పశు సంక్రాంతి నార్సింగి వేదికైందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. నార్సింగిసంతను విస్తరించి దేశ, అంతర్జాయ ఖ్యాతిని తీసుకవచ్చేలా ముఖ్యమంత్రి కేసిఆర్ సంబంధిత మంత్రుల దృష్ఠికి తీసుకెళ్తామన్నారు. ఇక్కడికి బీహర్, కర్నాటక, మహరాష్ట్ర, ఒరిస్సా ల నుంచి గేదెలను తీసుకవచ్చి రైతులు వ్యాపారం చేస్తుంటారు. ఇక్కడ ఈ రోజు గేదెలు లక్షల పైన ఉంటుందని చెప్పారు. నార్సింగి మార్కెట్ కమిటీని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. రైతులకు స్థలం సరిపోక ఇబ్బందులు ఉన్నాయి. నార్సింగి పశు సంక్రాంతిని భారతదేశం గర్వించే స్థాయిలో ఉంచుతామని అన్నారు. ఈ ఈ కార్యక్రమంలో గండిపేట ఎంపిపి తలారి మల్లేష్, నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బి. శ్రీరాములు, మార్కెట్ కమిటి డైరెక్టర్ మహ్మద్ ఫారుఖ్, ఖానాపూర్ సర్పంచ్ రామేశ్వరం నర్సింహ, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజనేయులు, నార్సింగి మాజీ సర్పంచ్ జి.వెంకటేష్ యాదవ్, ఎంపీటీసీ రామక్రిష్ణారెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి చైర్మెన్ పత్తి ప్రవీణ్, నాయకులు ఎండి బషీర్ తదితరులు పాల్గొన్నారు.



బర్రెల అమ్మకాల రికార్డు ...



2011గుజ్జర్‌జాతికి చెందిన బర్రె1.25లక్షలు, 2012 ముర్రె జాతికి చెందిన బర్రె 1.75లక్షలు, 2013దూలియా జాతికి చెందినా బర్రె 1.85 లక్షలు, 2014ధూలియా జాతికి చెందినా బర్రె2.01లక్షలు, 2014జాఫ్రి జాతికి చెంది న బర్రె 2.10లక్షలు, 2015లో జాఫ్రి జాతికి చెందిన బర్రె 2.05లక్షలు, 2016లో గుజ్జర్ జాతికి చెందిన 1.85లక్షలు, 2017లో ముర్రె జాతికి చెందిన బర్రె1.65లక్షలు పలకగా 2018లో1.20లక్షలు అమ్మకాలు జరిగాయని అధికారులు తెలిపారు.

సంతలో కాల్పుల కలకలం

- నాటు తుపాకీతో గాలిలోకి కాల్పులు
- ఉల్లిగడ్డలు విక్రయించే స్థలంపై వివాదం
- పోలీసుల అదుపులో నిందితుడు



నిందితుడు గజరాజ్‌సింగ్

మన తెలంగాణ/ చర్లపల్లి : కూరగాయల సంతలో వ్యక్తుల మధ్య చోటుచేసుకున్న వాగ్వివాదం తుపాకీ కాల్పులకు దారి తీసిన సంఘటన కుషాయిగూడ పోలీసు స్టేషన్ పరిధిలోని చర్లపల్లిలో జరిగింది. మాల్లాపూర్(నాచారం) పరిధిలోని మర్రిగూడకు చెందిన గజరాజుసింగ్ (50) తన తోటి వ్యాపారులను హెచ్చరించడంలో భాగంగా తుపాకీని తీసి చూపిస్తూ కాలుస్తానంటూ హెచ్చరికలు చేశారు. ఇది గమనించిన అక్కడే ఉన్న పెట్రోలింగ్ వ్యాన్ పోలీసు అయిన చక్రపాణి అతడిని అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో ఒక రౌండ్ కాల్పులు గాలిలో జరిగాయి. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కాప్రా మునిసిపల్ సర్కిల్ పరిధిలో నిర్వహించే వారాంతపు సంతలో గజరాజసింగ్ ఉల్లిగడ్డల వ్యాపారం చేస్తున్నాడు. అదే మర్రిగూడ వాసులైన శంకర్, చంద్రశేఖర్, పవన్, తులసీదాస్‌లు కూడా ఈ వారాంతపు సంతలోనే కూరగాయలను విక్రయిస్తుంటారు. అయితే, శుక్రవారం సాయంత్రం చర్లపల్లి డివిజన్‌లో జరుగుతున్న వారంతపు సంతలో తాము కూర్చునే స్థలం విషయంపై గజరాజసింగ్‌కు, ఈ నలుగురికి మధ్య వాగ్వావాదం జరిగింది. అక్కడే పైపులైన్‌ల కోసం రోడ్డుకు ఒకవైపు తవ్వకాలు జరగడంతో ఆ రోడ్డు మార్గం కుచించుకుపోయింది. అయితే నేనంటే నేనే ఈ స్థలంలో కూర్చుంటామని వీరి మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో తులసీదాస్, బాబు, శంకర్‌లకు స్వల్పగాయాలయ్యాయి. ఈ నేపథ్యంలోనే గజరాజు తాను ఇప్పుడే వస్తానంటూ వెళ్ళి తిరిగి నాటు తుపాకీతో వచ్చి వాదనకు దిగినవారికి చూపిస్తూ హెచ్చరించాడు. అక్కడే ఉన్న పెట్రోల్ వ్యాన్ పోలీసు కానిస్టేబుల్ చక్రపాణిరెడ్డి నిందితుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో నాటు తుపాకి చేయి పైకి లేచి ఒక రౌండ్ గాలిలో కాల్పులు జరిగాయి. వెంటనే పోలీసులు గజరాజసింగ్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో 'మహిళా' విభేదం

మన తెలంగాణ / హైదరాబాద్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహణకు సంబంధించిన అంశం విషయంలో కాంగ్రెస్ నేతలు నేరెళ్ళ శారద, మాజీ ఎంపి వి.హనుమంతరావు, పిసిసి ఉపాధ్యక్షుడు నిరంజన్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం మహిళా దినోత్సవాన్ని జరిపే విషయమై నేరెళ్ళ శారద ఒక ప్రతిపాదన చేశారు. హైదరాబాద్‌లో భారీ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించాలన్న అంశంతో పాటు దీనికి జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు, పలువురు సీనియర్ నేతలు వస్తారని ఆమె ప్రతిపాదించారు. దీనికి స్పందించిన వి.హనుమంతరావు తొలుత మహిళా విభాగం కార్యకర్తలు వచ్చేలా చూసుకోవాలని ఆమెకు హితవు పలికారు. దీంతో వారిద్దరి మధ్య స్వల్ప స్థాయిలో వాదన జరిగింది. ఈ క్రమంలో నిరంజన్ జోక్యం చేసుకోవడంతో మరింత వేడి పుట్టింది. ఒక దశలో వాదన తీవ్ర స్థాయికి చేరుకోవడంతో నిరంజన్ వాడిన పదజాలం పరుషమైనదిగా ఉందని నేరెళ్ళ శారద అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పలువురు నేతలు జోక్యం చేసుకుని ముగ్గురికీ సర్దిచెప్పారు.

రెవెన్యూ లోటు

(మొదటిపేజీ తరువాయి)

చేసుకోవడంతో రూ. 3,998 కోట్ల మేరకు లోటు ఏర్పడింది. బడ్జెట్ అంచనాల ప్రకారం వివిధ ద్రవ్య సంస్థల నుంచి రూ. 26,096 కోట్లను సమకూర్చుకోవాల్సి ఉండగా ఇప్పటికే 88% మేర (రూ. 23,084 కోట్లు) పొందగలిగింది. అయినా కూడా బడ్జెట్‌లో అంచనాల్లో పేర్కొన్న రూ. 1.44 లక్షల కోట్ల మొత్తం (రెవిన్యూ, కాపిటల్ కలుపుకుని) ఆదాయంలో తొమ్మిది నెలల కాలానికి కేవలం 56% (రూ. 82,367 కోట్లు) మాత్రమే లక్ష్యాన్ని చేరుకోగలిగింది. వివిధ రకాల పన్నుల ద్వారా రూ. 79,624 కోట్ల మేర ఆదాయాన్ని సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అంచనా వేసుకున్నా జిఎస్టి కారణంగా దాదాపు రూ. 20 వేల కోట్ల మేరకు గండి పడినట్లయింది. తొమ్మిది నెలల కాలంలో పెట్రోలియం, మద్యం విక్రయాలు, స్టాంపులు రిజిస్ట్రేషన్లు.. ఇలా పలురకాల పన్నుల ద్వారా రూ. 50,272 కోట్ల మేర, జిఎస్టి ద్వారా మరో రూ. 10 వేల కోట్లు ఆర్జించినా లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోయినట్లు కాగ్‌కు సమర్పించిన వివరాల ద్వారా తెలుస్తోంది. అక్టోబరు చివరి నాటికి రూ. 4,548 కోట్ల మేరకు రెవిన్యూ లోటు ఉన్నా నవంబరులో లక్ష్యానికి మించి రూ. 1,397 కోట్లు ఎక్కువ ఆర్జించడంతో ఆ లోటు రూ. 3,150కు తగ్గించుకోగలిగింది. కానీ డిసెంబరు చివరి నాటికి అది రూ. 848 కోట్లు పెరిగి రూ. 3,998 కోట్లకు చేరుకుంది. ఇంకా మూడు నెలల సమయం ఉన్నందున దీన్ని పూడ్చుకుని మిగులు బడ్జెట్ స్థాయికి చేరుకుంటుందా లేక ఈసారి లోటు బడ్జెట్‌గానే ఉండిపోతుందా అనేది కీలకంగా మారింది. గత ఆర్థిక సంవత్సరంలో సైతం పదకొండు నెలల వరకూ లోటు బడ్జెట్‌లోనే కొనసాగిన పరిస్థితి ఒక్కసారిగా మార్చి నెలలో వచ్చిన ఆదాయంతో మిగులులోకి వెళ్ళిపోయింది. ఈసారి కూడా అదే తరహాలో ఉంటుందని ఆర్థికశాఖ అధికారులు ధీమాతో ఉన్నారు. ఇప్పటివరకూ ఆర్థిక వృద్ధి రేటులో (ఎక్సయిజ్ కలుపుకుని) 19%తో సంతృప్తిగానే ఉన్నామని నమ్మకంతో ఉన్న అధికారులు రానున్న బడ్జెట్‌ను కనీసంగా 20% వరకూ పెంచుకోవచ్చని భావిస్తున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల విభాగం ద్వారా సుమారు మూడు వేల కోట్ల రూపాయలను ఆర్జించాలని రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకుంటే ఇప్పటికే దాదాపు 98% ఫలితాల్ని (రూ. 2,939 కోట్లు) సాధించింది. రానున్న రెండు నెలల్లో లక్ష్యం కంటే మరికొంత అదనంగా ఆర్జించే అవకాశం ఉంది. అయితే ఇది రెవిన్యూ లోటును పూడ్చుకునేంత స్థాయిలో ఉంటుందా అనేది అనుమానమే. ఖర్చుల విషయంలో నవంబరు నెల కంటే డిసెంబరులో దాదాపు రూ. 1,500 కోట్లు పెరిగింది. వివిధ ద్రవ్య సంస్థల నుంచి కూడా నవంబరులో కేవలం రూ. 472 కోట్లను మాత్రమే అప్పుగా తీసుకుంటే డిసెంబరులో మాత్రం అది రూ. 2,771 కోట్లుగా ఉంది. అయినా మొత్తం ఆదాయంలో పెద్దగా మార్పు కనిపించలేదు. కొత్త బడ్జెట్‌కు కసరత్తు చేస్తున్న సమయంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఫలితాలు కూడా గణనీయమైన పాత్ర పోషిస్తాయి. కానీ పన్నుల వసూళ్ళు ప్రభుత్వానికి సంతృప్తి కలిగిస్తున్నా కాగ్ విశ్లేషణ ప్రకారం కనిపిస్తున్న రూ. 20 వేల కోట్లను రానున్న రెండు నెలల్లో ఏ రకంగా సర్దుబాటు చేసుకుంటారన్నది కీలకంగా మారింది.

డివైడర్‌కు ఢీకొన్న నాని కారు

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణంగా జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 మీదుగా గచ్చిబౌలి వైపు వెళ్తున్నారు. ఫ్రోస్టు పబ్ సమీపంలో కారు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్ పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ప్రమాద సమయంలో కారులో నాని, డ్రైవర్ శ్రీనివాస్‌లు ఉన్నట్టు, వారికి పెనుప్రమాదం తప్పిందని, కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు శ్రీనివాస్‌రావు తెలిపారు. కారు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని ఆయన తెలిపారు. డ్రైవర్‌కు బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా అతడు మద్యం సేవించలేదని తేలినట్టు ఆయన వెల్లడించారు. ముందుగా కారులో నాని తండ్రి రాంబాబు ఉన్నాడని డ్రైవర్ శ్రీనివాస్ తెలపగా నాని తండ్రితో మాట్లాడటంతో అసలు విషయం బయటకు తెలిసింది.

చెల్లుబాటుకాని ఇతర రాష్ట్రాల వర్సిటీల

దూరవిద్య డిగ్రీలు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎక్కడో యూనివర్సిటీ ఉంటుంది...కానీ ఆ వర్సిటీ దూరవిద్య కేంద్రం ఇక్కడే ఉంటుంది. సులువుగా డిగ్రీలు కావాలనుకునే అభ్యర్థులకు డిగ్రీలు, పిజిలు అందిస్తుంటారు. చూచిరాతలను తలపించేలా నామమాత్రంగా పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తుంటారు. ఇలా పొందిన డిగ్రీలు ఉన్నత విద్యకుగానీ, ఉద్యోగాలకు కావని చెల్లుబాటు కావని ఇటీవల ఉన్నత విద్యామండలి తేల్చిచెప్పడంతో అభ్యర్థులు లబోదిబోమంటున్నారు.

నిబంధనలకు నీళ్లొదిలిన వర్సిటీలు

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) 2013లో తీసుకువచ్చిన నిబంధనల ప్రకారం వర్సిటీ జురిడిక్షన్ పరిధిలోని దూరవిద్య కేంద్రాల ద్వారా పొందే డిగ్రీలు, పిజిలకు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ప్రభుత్వ వర్సిటీ అయినా, ప్రైవేట్ వర్సిటీ అయినా వాటి జురిడిక్షన్ పరిధి దాటి ఏర్పాటు చేసుకున్న 'ఆఫ్ క్యాంపస్' కేంద్రాల ద్వారా అందించే సర్టిఫికెట్లు చెల్లుబాటు కావు. చాలా వర్సిటీలకు దూరవిద్య ద్వారా లభించే నిధులే ప్రధాన ఆర్థిక వనరు. దాంతో ఇతర రాష్ట్రాలలో కూడా స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసి దూరవిద్యా విధానంలో డిగ్రీలు, పిజిలు అందిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గీతం యూనివర్సిటీకి దూరవిద్యా కేంద్రం నల్గొండ జిల్లాలో ఉంటుంది. ఇతర జిల్లాలకు చెందిన విద్యార్థులు కూడా అక్కడ ప్రవేశాలు పొంది పరీక్షలకు హాజరవుతుంటారు. అలాగే ఎపికి చెందిన నాగార్జున యూనివర్సిటీ, తమిళనాడుకు చెందిన అళగప్ప వర్సిటీ, సిక్కిం మణిపాల్ యూనివర్సిటీ తెలంగాణలో స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసుకుని డిగ్రీలు, పిజిలు అందిస్తున్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన వర్సిటీలు వేలకు వేలు ఫీజులు తీసుకుంటూ డిగ్రీ, పిజిలలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

ఉన్నతవిద్యలో 56 మంది ప్రవేశాల తిరస్కరణ



దూర ప్రాంతాల నుంచి వచ్చి కూడా ఆయా సెంటర్లలో ప్రవేశాలు పొందున్నారు. మూడేళ్లపాటు పరీక్షలు రాసి డిగ్రీ పట్టా వచ్చిన తర్వాత అది చెల్లుబాటు కాదు అని తెలిసే సరికి వారు లబోదిబోమంటున్నారు. ఇలాంటి దూరవిద్య కేంద్రాల ద్వారా డిగ్రీలు పొందిన విద్యార్థులకు తెలంగాణలో ఎంబిఎ, బి.ఇడి ప్రవేశాల్లో చేదు అనుభవం ఎదురైంది. 56 మంది అభ్యర్థుల దరఖాస్తులను ఉన్నత విద్యామండలి తిరస్కరించింది. వారి సర్టిఫికెటుల చెల్లుబాటు కావని తేల్చిచెప్పింది.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ఇతర రాష్ట్రాల వర్సిటీల దూరవిద్య కేంద్రాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి. ఆయా వర్సిటీల గుర్తింపు, సర్టిఫికెట్లు చెల్లుబాటు గురించి ముందుగా తెలుసున్న తర్వాతనే ప్రవేశాలు తీసుకోవాలి. అవగాహన లేకుండా ప్రవేశాలు తీసుకుంటే సమయం, డబ్బు వృధా అవుతుంది.



డిఎంకె ఎంపి కనిమొళిపై కేసు నమోదు

మన తెలంగాణ/హైదరాబాద్ : తమిళనాడు డీఎంకే పార్టీ ఎంపీ కనిమొళిపై సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైయింది. హిందూవులు పవిత్రంగా పూజించే శ్రీ వేంకటేశ్వరస్వామిపై ఆమె అనుచిత వ్యాఖ్యలు చేసినందున రంగారెడ్డి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి,అడ్వకేట్ కరుణాసాగర్ ఈ నెల 12న సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన హుండీనే కాపాడుకోలేని దేవుడు, భక్తులను ఏం కాపాడుతాడన్ని కనిమొళి చేసిన వ్యాఖ్యల ఆధారంగా ఈ ఫిర్యాదు చేశారు. ఈ ఉదంతంపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో అడ్వకేట్ కరుణాసాగర్ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. ఫిర్యాదు పరిశీలించిన కోర్టు కేసు నమోదు చేయాలని సైదాబాద్ పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు ఆమెపై ఐపిసి 295ఎ,298,504 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ సత్తయ్య తెలిపారు.

కేరళలో భగవత్ జెండావిష్కరణ

పాలక్కాడ్ : భారత 69వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేరళలోని పాలక్కాడ్‌లో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ శుక్రవారం జాతీయ జెండావిష్కరణ చేశారు. విద్యాభారతి ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాస్ విద్యా పీఠం ఉన్నత పాఠశాలలో భగవత్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాగా, పాలక్కాడ్‌లో నిర్వహించే మూడు రోజుల ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల శిబిరంలో భగవత్ పాల్గొనున్నారు. 5 వేలకుపైగా సంఘ్ ఆఫీస్ బేరర్ల కూడా హాజరుకానున్నారు.


మేడారం.. భక్త జనసంద్రం

- భక్తులతో కిటకిటలాడిన గద్దెల ప్రాంగణం
- తల్లులను దర్శించుకున్న ప్రముఖులు
- ఆర్‌టిసి ప్రత్యేక బస్సుల నిర్వహణ

మన తెలంగాణ/మేడారం: మేడారం భక్త జనసంద్రంగా మారింది. ప్రధాన జాతరకు నాలుగు రోజుల వ్యవధి ఉండగానే భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి తల్లులకు మొక్కులను చెల్లించుకుంటున్నారు. భక్తులతో సమ్మక్కసారలమ్మ గద్దెల ప్రాంగణం శుక్రవారం కిటకిటలాడింది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు నాలుగు రోజులపాటు ప్రధాన జాతర జరగనుంది. జాతర సందర్భంగా భక్తుల రద్దీతో తమ మొక్కులను చెల్లించుకోవడం ఇబ్బందిగా ఉంటుందని ముందుగానే భక్తులు వస్తున్నారు. శుక్రవారం సెలవు దినం కావడంతో రాష్ట్ర నలుమూల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గురువారం అర్ధరాత్రి నుంచి మేడారానికి వాహనాలు పెద్దఎత్తున తరలాయి. జంపన్న వాగు వద్ద స్నానఘట్టాల కింద స్నానాలు చేసి తల్లులను దర్శించుకున్నారు. భక్తులు నిలువెత్తు బంగారాలతో అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ప్రారంభం కాక ముందే భక్తులు పెద్దఎత్తున వస్తుండడంతో జాతర సందర్భంగా కోటి మందికి పైగా భక్తులు వస్తారని ఇప్పటికే అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. శుక్రవారం ఆర్‌టిసి అధికారులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల నుంచి, డివిజన్ కేంద్రాల నుంచి మేడారంకు ప్రత్యేక బస్సులను నడిపించారు. మేడారంలోని నార్లాపూర్ నుంచి మేడారం వరకు ఆర్‌టిసి అధికారులు ముందుగా ప్రకటించినట్లుగా ఉచిత సర్వీస్‌లను నడిపారు. కాగా శుక్రవారం రోజున పాలకుర్తి ఎంఎల్‌ఎ ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎంఎల్‌ఎ అరూరి రమేశ్, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



కరెంటు షాకుతో ఇద్దరు మృతి



మన తెలంగాణ/ దౌల్తాబాద్: వ్యవసాయ పొలంలో బోరు మోటారు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం ఊరకుంట తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన సత్యనాయక్ వ్యవసాయ పొలంలో బోరు మోటారు ఖాళీ పోవడంతో బాగుచేసేందుకు పొలానికి వెళ్లారు. మోటారును వెలికి తీసేందుకు అతడి కూమారులు శ్రీశైలం(23), శ్రీకాంతు, తమ్ముడు లాల్యానాయక్, వరుసకు అల్లుడైన వాల్యానాయక్(35)ను తోడుగా తీసుకెళ్లాడు. ఐదుగురు కలిసి బోరు మోటారును వెలికి తీస్తుండగా పైపులపై ఉన్న విద్యుత్ తీగలు తాకాయి. దీంతో నలుగురు అక్కడికక్కడే కూప్పకూలిపోయారు. ఇది గమనించిన పక్క పొలాల వారు అప్రమత్తమై వెంటనే వారిని ఆటోలో కోస్గి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీశైలం, వాల్యనాయక్ మృతి చెందగా, సత్యనాయక్, లాల్యానాయక్‌కు చికిత్స పొందుతున్నారు.

పైపు కింద పడి కార్మికుడి మృతి

మన తెలంగాణ/జోగిపేట: సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలం తాడ్మన్నూర్ గ్రామ శివారులో జరుగుతున్న మిషన్ భగీరథ పనుల్లో కార్మికుడు అనుమోలుకుమార్ (20) ప్రమాదవశాత్తూ పైపు కింద పడి మృతి చెందాడు. మృతుడు బిహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూలూర్‌పాడ్‌లో దొంగల హల్‌చల్

మన తెలంగాణ/జూలూరుపాడు: ఖమ్మం జిల్లా జూలూరుపాడులో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎంపిటిసి సాయిల నాగేశ్వరరావు ఇంట్లో దొంగలు చొరబడి రూ.80 వేల నగదు, బానోత్ బాలు అనే వ్యక్తి ఇంట్లో సుమారు 2తులాల బంగారంతో పాటు రూ.25 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఒకేరోజు రెండు ఇళ్లల్లో చోరీ జరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కామ్రేడ్ బుచ్చిరెడ్డి సేవలు మరువలేనివి

మన తెలంగాణ/యాదాద్రిభువనగిరి: అట్టడుగు వర్గాల కోసం, నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పట్టిన జెండాను విడువకుండా తుదిశ్వాస వదిలే వరకు కామ్రేడ్ పెద్దిరెడ్డి బుచ్చిరెడ్డి అహర్నిషలు పోరాటాలు చేశారని, ఆయన సేవలు మరువలేనివని యునైటెడ్ ఫ్రంట్ చైర్‌పర్సన్ విమలక్క అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం బహుపేట గ్రామంలో శుక్రవారం జరిగిన బుచ్చిరెడ్డి సంస్మరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దోపిడీ వ్యవస్థను నిర్మూలించేందుకు సామాజిక న్యాయం సమానత్వం వర్తింపుకు అహర్నిశలు పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమాల్లో రైతు కూలీ సంఘం పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగంటి కొమురయ్య, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర కన్వీనర్ అబ్బన్న, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు యువన్యాయవాది పెంట రమేశ్, సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అప్పులు

- అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య

మన తెలంగాణ/దామెర/కారేపల్లి: వేర్వేరు జిల్లాలో ఇద్దరు రైతులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. వరంగల్ రూరల్ జిల్లా దామెర మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన ఇజ్జగిరి సురేశ్ తనకున్న ఎకరం భూమితో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకొని, రూ.7లక్షల వరకు అప్పు చేసి పంటలు వేశాడు. ప్రకృతి వైపరీత్యాలు, చీడు పీడల వల్ల కనీసం రూ.లక్ష దిగుబడి కూడా రాలేదు. అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెంది శుక్రవారం ఇంట్లో పంట వద్దకు వెళ్లి వస్తానని చెప్పి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అటుగా వెళ్తున్న రైతులు చూసి కుటుంబికులకు తెలపడంతో వారు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బీక్యాతండాకు చెందిన బానోతు శంకర్ తనకున్న రెండెకరాల భూమిని సాగు చేస్తున్నాడు. సరైన దిగుబడి రాకపోవడంతో అప్పులు ఏ విధంగా తీర్చాలనే బెంగతో మనస్తాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి

- జెండా ఏర్పాట్లు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మన తెలంగాణ/కోహెడ: సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం జెండా ఏర్పాట్లు చేస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. జెండా పైపు విద్యుత్ వైర్లకు తగలడంతో గొట్టే చంద్రయ్య(43) అనే సెక్యూరిటీ గార్డు కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. అరెపల్లి గ్రామానికి చెందిన మృతుడు కోహెడ వ్యవసాయ మార్కెట్‌లో కాంట్రాక్టు పద్ధతిన సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, బిజెపి, సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు కార్యాలయం ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. దాదాపు ఐదు గంటల పాటు కార్యాలయం వద్దనే నిరసన తెలపగా, ఎంఎల్‌ఎ సతీశ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మార్కెట్ కమిటీ నుంచి రూ.5లక్షలు, ట్రాన్స్‌కో శాఖ నుంచి రూ.5లక్షలు, మృతుడి భార్యకు ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం, ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

రష్యా అధికారులపై అమెరికా ఆంక్షలు

వాషింగ్టన్: క్రిమియా విద్యుత్ శక్తి ప్లాంట్‌కు టర్బైన్లను సరఫరా చేసిన రష్యా అధికారులతోపాటు తూర్పు ఉక్రెయిన్‌కు చెందిన పలువురు మంత్రులపై శుక్రవారం అమెరికా ఆంక్షలు విధించింది. రష్యాకు సరఫరా చేసేందుకు జర్మనీ ఇంజనీరింగ్ దిగ్గజం సిమెన్స్ టర్బైన్లను తయారు చేసింది. ఈ టర్బైన్లను అధికారులు రష్యాకు బదులుగా 2014లో ఉక్రెయిన్ నుంచి ఆక్రమించుకున్న క్రిమియాకు తరలించారు. ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో భాగమైన ఉక్రెయిన్ స్వతంత్ర దేశంగా విడిపోయింది. కాగా, టర్బైన్ తయారు చేసిన మునిచ్ సంస్థపై అమెరికా ఎలాంటి ఆంక్షలు విధించలేదు.

రెండో దశ 'మెట్రో'పై ప్రభుత్వం దృష్టి



- డిపిఆర్ రూపకల్పనలో అధికారుల కసరత్తు
- ఢిల్లీ మెట్రో అధికారుల అధ్యయనం
- పలు ప్రాంతాల్లో పర్యటన, మేధో మథనం

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: ఇప్పటికే మొదటి దశ మెట్రోరైలు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది చివరి నాటికి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇక రెండో దశపై ప్రభుత్వం దృష్టి సారించింది. రెండవ దశ మెట్రోరైలు ప్రాజెక్ట్ కోసం డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) రూపకల్పనకు కసరత్తు ప్రారంభమైంది. ఇందుకు ఢిల్లీ మెట్రోరైలు కార్పొరేషన్‌కు చెందిన నిపుణులు నగరానికి వచ్చారు. రెండవ దశలో ప్రతిపాదించిన వివిధ ప్రాంతాల్లో ఈ పర్యటించిన బృందం బేగంపేట్‌లోని మెట్రో భవన్‌లో రెండు రోజుల పాటు మేధో మథనం నిర్వహించి, పలు అంశాలపై కూలంకుశంగా చర్చించినట్లు హైదరాబాద్ మెట్రోరైలు ఎం.డి.ఎన్‌విఎస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే నాగోల్ నుంచి అమీర్‌పేట్, అమీర్‌పేట్ నుంచి మియాపూర్ వరకు 30 కిలోమీటర్ల మేరకు అందుబాటులోకి వచ్చినా, జూన్ కల్లా అమీర్‌పేట నుంచి హైటెక్‌సిటీ వరకు, అలాగే ఈ సంత్సరం చివరికి అమీర్‌పేట్ నుంచి ఎల్.బి.నగర్ వరకు, సికింద్రాబాద్ జెబిఎస్ నుంచి గౌలిగూడ సిబిఎస్ వరకు మెట్రోరైలును అందుబాటులోకి తెచ్చే దిశగా పనులను వేగవంతం చేశామని, పనుల పురోగతిని వారికి వివరించారు. మెట్రోరైలు రెండవ దశ డిపిఆర్‌ను నగరంలోని ట్రాఫిక్‌కు తగిన విధంగా రవాణా వ్యవస్థ అందుబాటులోకి తెచ్చే అంశంతో పాటు గూగుల్ మ్యాప్ ద్వారా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా గుర్తించే అంశాన్ని పరిగణలోకి తీసుకొని, డిపిఆర్‌ను తయారు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రయాణికులను పెంచుకునే అధ్యయనం, మెట్రో మొదటి దశ, ఎంఎంటిఎస్, ఆర్‌టిసి బస్సుల రాకపోకల అనుసంధానం, పాదచారులు మెట్రో స్టేషన్‌కు చేరుకునేలా ఫీడర్ బస్సు సర్వీసుల నిర్వహణ వంటి అంశాలున్నట్లు వివరించారు. దీంతో పాటు స్థల సేకరణ, క్షేత్ర స్థాయిలో టోపోషీటర్ తయారు చేసేందుకు కావాల్సిన ఫీల్డు సర్వేయర్లు, డిపోలు, ఎలక్ట్రికల్ వ్యవస్థ ఏర్పాటు, రూట్ అలైన్‌మెంట్, రెండో దశ కింద స్టేషన్లు నిర్మించే ప్రాంతాల ఎంపిక వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని డిపిఆర్‌ను తయారు చేసే అంశంపై డిపిఆర్ నిపుణులతో మేధోమథనం నిర్వహించనున్నట్లు ఎన్‌విఎస్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో డిఎంఆర్‌సి డైరక్టర్ ఎన్.డి.శర్మ, హెచ్‌ఎంఆర్‌ఎల్ చీఫ్ ఇంజనీర్ డివిఎస్.రాజు, ఎస్.ఈ లక్ష్మణ్, పంచమ్, విష్ణువర్ధన్‌రెడ్డి, జి.ఎం.వినోద్‌కుమార్, డిసిపి బాలాకృష్ణ తదితరులు హాజరయ్యారు.

గణతంత్ర వేడుకల్లో దళితుల నిరసన

- అంబేడ్కర్ చిత్రం ఏర్పాటు చేయాలని డిమాండ్



మన తెలంగాణ/ మిర్యాలగూడ: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేడ్కర్ చిత్రం ఏర్పాటు చేయనందుకు నిరసిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఆర్‌డిఒ కార్యాలయంలో దళితులు నిరసనకు దిగారు. కార్యాలయం ఎదుట బైఠాయించి సిబ్బందిని లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటు చేయకుండా దళితుల ఆత్మగౌర వాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆర్‌డిఒ గోపాలరావు మాట్లాడుతూ తాము ప్రభుత్వ నిబంధనల మేరకే నడుచుకుంటున్నామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేసి వన్ టౌన్ స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.





స్వచ్ఛ భారత్‌లో కామారెడ్డి జిల్లా దోమకొండను వంద శాతం ఒడిఎఫ్‌గా ప్రకటించినందుకు సర్పంచ్ డి.శారదకు, ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తహసీల్దార్ సాయిభుజంగరావుకు ఉత్తమ అవార్డులను శుక్రవారం కామారెడ్డిలోని ఇందిరా గాంధీ స్టేడియంలో కలెక్టర్ సత్యనారాయణ, ఎస్‌పి శ్వేతారెడ్డిల చేతులమీదుగా అందజేశారు.

– మన తెలంగాణ/దోమకొండ



69వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా కల్లూర్ ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన జెండా ఆవిష్కరణలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఆర్‌డిఒ కుముదినీ సింగ్ జెండా ఎగురవేస్తుండగా ఒక్కసారి జారి కింద కువచ్చింది. వెంటనే జెండాను సిబ్బంది సరిచేసి మరలా ఎగురవేసారు.

– మన తెలంగాణ/కల్లూరు

బొడ్డుపల్లి శ్రీనివాస్‌ది ప్రభుత్వ హత్యే

- పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

మన తెలంగాణ/నల్లగొండ: నల్లగొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త, కాంగ్రెస్ జిల్లా నాయకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను ప్రభుత్వమే హత్య చేయించిందని పిసిసి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఉత్తమ్‌తో పాటు సిఎల్‌పి నేత జానారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేతలు షబ్బీర్ అలీ, హనుమంతరావు, ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. టిఆర్‌ఎస్ పార్టీలో చేరని కాంగ్రెస్ నాయకులను నకిరేకల్ ఎంఎల్‌ఎ వీరేశంతో ప్రభుత్వం హత్యలు చేయిస్తుందని మండిపడ్డారు. ఈ చర్య ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని అణచివేసేందుకే సిఎం కెసిఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డిలు ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. చైర్‌పర్సన్ భర్త హత్యకు గురైతే పోలీసులు పట్టించుకోకపోవడం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ఈ ఘటనపై ఈ నెల 27న డిజిపి మహేందర్‌రెడ్డిని కలవనున్నట్లు తెలిపారు. జానారెడ్డి మాట్లాడుతూ నల్లగొండలో కాంగ్రెస్ బలంగా ఉందని, పార్టీని అణచివేసేందుకే అధికార పార్టీ నాయకులు శ్రీనివాస్‌ను హత్య చేయించారన్నారు. శ్రీనివాస్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ నల్లగొండలో కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను భయందోళనకు గురి చేసేందుకే శ్రీనివాస్‌ను హత్య చేయించారని మండిపడ్డారు. ఈ హత్యకు ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం, మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రోద్బలంతోనే నకిరేకల్ ఎంఎల్‌ఎ వేముల వీరేశం శ్రీనివాస్ హత్యకు కారణమయ్యారని ఆరోపించారు. ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి మాట్లాడుతూ ప్రాణాలకు హాని ఉందని సిఎం కెసిఆర్‌ని కలిసి విన్నవించుకున్నా రక్షణ కల్పించలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, నకిరేకల్ ఎంఎల్‌ఎ వేముల వీరేశం హత్యా రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనపై సిఐడితో విచారణ చేయించి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఫొటో కలకలం

శ్రీనివాస్ హత్య కేసులో నిందితులుగా భావిస్తున్న వారితో నకిరేకల్ ఎంఎల్‌ఎ వేముల వీరేశం దిగిన ఫొటో జిల్లాలో కలకలం రేపింది. దీంతో నిందితులతో ఎంఎల్‌ఎకు సంబంధం ఉందన్న ఆరోపణలకు బలం చేకూరినట్లయిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. శ్రీనివాస్ హత్యకు పక్కా ప్రణాళికతో అధికార పార్టీ నేతలు పనిచేశారని మీడియా సమావేశంలో ఈ ఫొటోను ప్రదర్శించడం సంచలనంగా మారింది.



సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


- బిసి సంఘాల డిమాండ్

మన తెలంగాణ /హైదరాబాద్: నల్లగొండ పట్టణ మున్సిపల్ చైర్మన్ భర్త శ్రీనివాస్ హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని బిసి సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. బిసి సామాజిక వర్గం వారిని రాజకీయంగా ఎదుగుతుంటే చూసి ఓర్వలేని కొన్ని శక్తులు భౌతికంగా నిర్మూలించాలని చూస్తున్నాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎంబిసి విద్యార్థి సంఘం నాయకులు పి. బడేసాబ్, బిసి యువజన సంఘం నాయకులు కె. శ్యాంకుర్మ, బిసి సమాఖ్య నాయకులు ఎస్. దుర్గయ్య, బిసి విద్యార్థి సంఘం నాయకులు కె. శ్రీనివాస్ ముదిరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు.

సావిత్రి, ఎస్వీ రంగారావులకు పద్మ అవార్డులు ప్రకటించాలి

భారత ప్రభుత్వం గురువారం పద్మ పురస్కారాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. వీటిలో తెలుగు క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్‌కు పద్మశ్రీ అవార్డు దక్కగా చిత్ర పరిశ్రమ తరపున మ్యూజిక్ మాస్ట్రో ఇళయరాజాకు పద్మ విభూషణ్ పురస్కారం దక్కింది. శుక్రవారం తన కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలను నిర్వహించిన పవన్ పద్మ పురస్కారాలపై స్పందించారు. ''తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్‌కు పద్మశ్రీ దక్కడం, ఇళయరాజాకు పద్మ విభూషణ్ ప్రకటించడం ఆనందంగా ఉంది. మరింతమంది తెలుగువారికి ఈ పురస్కారాలు వచ్చి ఉండే బాగుండేది. ఇండస్ట్రీ తరపున మహానటి సావిత్రి, ఎస్వీ రంగారావులకు మరణానంతరం కూడా పద్మ అవార్డులను ప్రకటించినా సముచితంగానే ఉంటుంది. ఈ విషయంలో తెలుగు ముఖ్యమంత్రులు ఇద్దరు చొరవ చూపాలని కోరుతున్నాను'' అని పవన్‌కళ్యాణ్ పేర్కొన్నాడు.





భరత్ అనే నేను

మహేశ్‌బాబు


సూపర్‌స్టార్ మహేష్‌బాబు, టాప్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో శ్రీమతి డి.పార్వతి సమర్పణలో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దానయ్య డి.వి.వి. నిర్మిస్తున్న భారీ చిత్రం 'భరత్ అనే నేను'. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం విడుదల చేశారు. ఉదయం 7 గంటలకు సినిమా ఫస్ట్ ఓత్, 8 గంటలకు లోగో, 9 గంటలకు ఫస్ట్‌లుక్ విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు కొరటాల శివ మాట్లాడుతూ ''ఆంధ్రప్రదేశ్ విడిపోక ముందు జరిగే ఫిక్షనల్ పొలిటికల్ డ్రామా ఇది. ఈ సినిమా ప్రమోషన్‌కు రిపబ్లిక్ డే మంచి సందర్భం అని మేమంతా భావించి 'భరత్ అనే నేను' ఫస్ట్ ఓత్ పేరుతో శుక్రవారం ఉదయం 7 గంటలకు ఆడియోను రిలీజ్ చేశాం. ఇలాంటి కంటెంట్‌కి వీడియో కంటే ఆడియోను రిలీజ్ చేస్తే మంచి ప్రభావం ఉంటుందని మేమంతా భావించాం. అందుకే మహేష్‌బాబు వాయిస్‌తో ఫస్ట్ ఓత్‌ని రిలీజ్ చేయడంతో ప్రమోషన్‌ను ప్రారంభించేశాం''అని అన్నారు. నిర్మాత దానయ్య డి.వి.వి. మాట్లాడుతూ ''సినిమా ఫస్ట్‌లుక్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించి రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతోంది. మహేష్, కొరటాల శివ కాంబినేషన్‌లో ఇంత భారీ చిత్రం చేయడం చాలా ఆనందంగా ఉంది''అని చెప్పారు. మహేష్, కైరా అద్వాని, ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్‌లతో పాటు ప్రముఖ తారాగణం నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతంః దేవిశ్రీ ప్రసాద్, పాటలుః రామజోగయ్యశాస్త్రి, సినిమాటోగ్రఫీః రవి కె.చంద్రన్, ఎస్.తిరునపుక్కరసు, ఎడిటింగ్ః శ్రీకర్ ప్రసాద్.

ప్రభంజనంగా 'ఓ సైనిక...'

అల్లు అర్జున్, అనుఇమ్మాన్యుయేల్ జంటగా వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కుతున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ బ్యానర్‌లో శిరీష శ్రీధర్ నిర్మాతగా బన్నీవాసు సహ నిర్మాతగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రంలో అర్జున్, శరత్‌కుమార్‌లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ , శేఖర్ సంగీతమందిస్తున్నారు. ఈ చిత్రంలోని 'ఓ సైనిక...' అనే తొలి పాటను గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదల చేశారు. అద్భుతమైన స్పందన వస్తున్న ఈ పాట గురించి గీత రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ ''ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'ఓ సైనిక' అనే పాటను రిపబ్లిక్ డేను పురస్కరించుకొని శుక్రవారం ఉదయం అన్ని ప్లాట్‌ఫామ్స్‌లో రిలీజ్ చేశాం. పాట విడుదలైన తర్వాత ఇది ప్రభంజనం అనే చెప్పొచ్చు. నాకు, వక్కంతం వంశీకి, బన్నీ వాసుకు వచ్చే మెసేజ్‌లు మామూలుగా లేవు. బాలీవుడ్ సంగీత దర్శకులు విశాల్ , శేఖర్ చాలా సంవత్సరాల తర్వాత తెలుగులో ఈ సినిమా చేశారు. వారికి ఇది మంచి కమ్‌బ్యాక్ ఫిల్మ్. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మన సైనికులకు ఘన నివాళిని ఇచ్చామనిపించింది. ఇలాంటి పాట రాసే అవకాశం నాకు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఈ సాంగ్ మేకింగ్ వీడియో గురించి చెప్పుకోవాలి. రియల్ లైఫ్ షాట్స్‌ని పెట్టి చేసిన వీడియో అద్భుతంగా ఉంది. పాట రాసిన నాకు కళ్ల నుంచి నీళ్లొచ్చాయి. అంత చక్కగా ఉంది ఈ వీడియో. సినిమా ప్రమోషన్స్‌లో నాంది ప్రస్తావనగా మొదలైన ఈ పాటకు మంచి స్పందన రావడం చాలా సంతోషంగా ఉంది. చంద్రబోస్ నాకు మెసేజ్ పెట్టి అవార్డుల పంట పండినట్టేనని అన్నారు. అవార్డులు పక్కన పెడితే నాకు మెసేజ్‌ల రూపంలో అవార్డులు వచ్చినట్టేనని అనిపించింది. ఈ పాటతో చాలా మంది హృదయాల్ని టచ్ చేయగలిగాను. ఇక వక్కంతం వంశీ కథా బలం గొప్పది. ఆయన రాసిన గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమా తన దర్శకత్వంలో మంచి సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః రాజీవ్ రవి, ఎడిటర్ః కోటగిరి వెంకటేశ్వరరావు, ఫైట్స్ః రామ్ లక్ష్మణ్.



అల్లు అర్జున్



రామ్‌చరణ్

జాతీయ జెండాకు చిట్టిబాబు సెల్యూట్

మెగా హీరో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'రంగస్థలం1985'. రిపబ్లిక్ డే సందర్భంగా సినిమా యూనిట్ ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. రంగస్థలంరిపబ్లిక్ డే పోస్టర్ పేరిట ఇది విడుదలైంది. ఇందులో ఎడమ చేతిలో కోడిపుంజును పట్టుకొని కుడి చేత్తో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తూ చెర్రీ కనపడుతున్నాడు. మైత్రి మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సమంత హీరోయిన్. జగపతిబాబు, ఆది పినిశెట్టి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్నాడు. మార్చి 30న ఈ సినిమా విడుదలకానుంది. ఇక ఈ చిత్రంలో రామ్‌చరణ్ పక్కా పల్లెటూరి యువకుడిగా కనిపిస్తున్నాడు. వినికిడి లోపం ఉన్న చిట్టిబాబు అనే పాత్రలో అతను నటిస్తున్నాడు. ఈ అంశమే సినిమాలో కీలకంగా ఉండి మంచి వినోదాన్ని, ఆసక్తికరమైన కథనాన్ని అందిస్తోంది. మెగా అభిమానులు కోరుకునే మాస్ కంటెంట్ కూడా ఈ సినిమాలో ఎక్కువగానే ఉంది. ఇక తాజాగా విడుదలైన టీజర్‌కు అనూహ్య స్పందన వచ్చింది. విడుదలైన తొలి 50 నిమిషాల్లోనే 10 లక్షలు, గంటన్నరలో 20 లక్షలు, మూడు గంటల్లో 30 లక్షల వ్యూస్ వచ్చాయి. దీంతో ఈ చిత్రంపై అభిమానులు, ప్రేక్షకుల అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఇక టీజర్‌ను చూసిన పలువురు సినీ సెలబ్రిటీలు చరణ్, సుకుమార్‌లపై ప్రశంసల జల్లులు కురిపించారు. దర్శకధీరుడు రాజమౌళి మాట్లాడుతూ టీజర్ చాలా బాగుందని, ఈ సీజన్‌లో నేను ఎక్కువగా ఎదురుచూస్తున్న చిత్రం ఇదేనని అన్నాడు. గతంలో కూడా ఎన్నో సందర్భాల్లో తనకు ఇష్టమైన దర్శకుడు సుకుమార్ అని, ఆయన కథ, కథనం, సన్నివేశాల్ని వివరించే తీరు చాలా బాగుంటాయని ఆయన చెప్పాడు. ఇక రాజమౌళి తన నెక్స్ట మూవీని చరణ్, ఎన్టీఆర్‌లతో చేయనున్న విషయం తెలిసిందే.

నాగశౌర్యలో నన్ను నేను చూసుకున్నా

\- చిరంజీవి



'ఛలో' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో గౌతమ్, శంకర్ ప్రసాద్ ముల్పూరి, నాగశౌర్య, చిరంజీవి, మహతి స్వర సాగర్, వెంకీ కుదుముల, ఉషా ముల్పూరి, రష్మిక మండన్నా

నాగశౌర్య హీరోగా రష్మిక మండన్నా హీరోయిన్‌గా ఐరా క్రియేషన్స్ పతాకంపై శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో వెంకీ కుదుముల దర్శకత్వంలో ఉషా ముల్పూరి నిర్మిస్తున్న చిత్రం 'ఛలో'. ఈ చిత్రం టీజర్, ట్రైలర్‌కు సోషల్ మీడియాలో అత్యధికంగా వ్యూస్ వచ్చాయి. మహతి స్వర సాగర్ సంగీతమందించిన ఈ చిత్రంలోని 'చూసి చూడంగానే...' పాట సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అన్ని పాటలు కూడా మ్యూజికల్ హిట్‌గా నిలిచాయి. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ హైదరాబాద్ యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరవ్వగా... దర్శకులు వంశీ పైడిపల్లి, నందినిరెడ్డి, నిర్మాత సి.కళ్యాణ్, సంగీత దర్శకులు మహతి స్వర సాగర్, కళ్యాణి మాలిక్, నటి ప్రగతితో పాటు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ''నాగశౌర్య వారి అమ్మగారితో కలిసి ఓ రోజు మా ఇంటికి వచ్చాడు. 'ప్రీ రిలీజ్ ఫంక్షన్ చేస్తున్నాం. మీ సమక్షంలో జరగాలి. తప్పకుండా రావాలి'అని అడిగాడు. ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా నాగశౌర్యకు వస్తానని చెప్పాను. నా కెరీర్ ప్రారంభంలో నా సినిమా హండ్రెడ్ డేస్ ఫంక్షన్‌కు నేను అభిమానించే ఓ పెద్ద స్టార్ వస్తే బాగుంటుందని అనుకున్నాను. కానీ ఆ స్టార్ రాలేకపోయాడు. దీంతో నేను ఎంతో నిరుత్సాహపడ్డాను. ఆ సంఘటన గుర్తుకొచ్చినప్పుడు నాగశౌర్యలో నన్ను నేను చూసుకున్నాను. నన్ను రమ్మని కోరుతున్నాడు అంటే ఆ ఉత్సాహం, ఆ ప్రోత్సాహం వేరు కాబట్టి నాగశౌర్యను ప్రోత్సాహించాలని అనుకున్నాను. మా నిహారికతో నాగశౌర్య చేసిన సినిమాను టీవీలో చూశాను. అతను చాలా హ్యాండ్‌సమ్‌గా ఉన్నాడు. స్పార్క్‌గా ఉన్నాడు. ఇలాంటి హీరోలు ఖచ్చితంగా ఇండస్ట్రీకి రావాలి, కావాలి. అప్పుడే ఇండస్ట్రీకి ఒక ఫ్రెష్‌నెస్, కొత్త ఉత్సాహం వస్తుంది. రెండు, మూడు సంవత్సరాలుగా పెద్ద హీరోల సినిమాలు ఎంత హిట్ అయ్యాయో యంగ్ హీరోల చిత్రాలు కూడా అంతకంటే హిట్ అయ్యాయి. ఉయ్యాల జంపాల, పెళ్లి చూపులు, అర్జున్ రెడ్డి, ఊహలు గుసగుసలాడే, శతమానం భవతి, ఫిదా... అలాగే ఈమధ్య వచ్చిన 'హలో' ఇవన్నీ ప్రేక్షకుల ఆదరణ పొందాయి. 'ఛలో' కూడా పెద్ద స్థాయిలో విజయం సాధించాలని నాగశౌర్య కెరీర్‌లో ఇది బెస్ట్ సినిమాగా నిలబడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. 'ఛలో' ట్రైలర్ చూశాక ఆంధ్ర, తమిళనాడు బోర్డర్‌లో జరిగే మంచి ప్రేమ కథా చిత్రంలా అనిపించింది. ట్రైలర్ చూడగానే ఈ సినిమాను త్వరగా చూడాలని అనిపించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకొని శంకర్ ప్రసాద్, గౌతం, ఉషలకు వారి బ్యానర్‌లో మంచి సినిమాగా నిలవాలని ఆశిస్తున్నాను. వెంకీ కుదుముల ఒక డైరెక్టర్‌లా కనిపించలేదు. నా అభిమానుల్లో ఒకడిగా అనిపించాడు. ఈ సినిమా అందరినీ అలరించి సూపర్ డూపర్ హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ ''దర్శకుడు వెంకీ ఫస్ట్ సినిమా ఇది. ట్రైలర్ చూశాక ఎంత ఆత్మవిశ్వాసంతో ఈ సినిమా తీశాడో అర్థమవుతోంది. నాగశౌర్య సినిమాలు చూశాను. అతను చాలా బాగా నటించాడు. ఈ సినిమా అతనికి మంచి విజయాన్ని అందించాలని కోరుకుంటున్నాను''అని తెలిపారు. చిత్ర దర్శకుడు వెంకీ కుదుముల మాట్లాడుతూ ''చిరంజీవికి ఉన్న అభిమానులు, భక్తుల్లో నేను ఒకడిని. మా సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు ఆయన రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఒక అసిస్టెంట్ డైరెక్టర్‌ని అయిన నాకు డైరెక్షన్ ఛాన్స్ ఇచ్చిన ఐరా క్రియేషన్స్‌కు, నాగశౌర్యకు థాంక్స్''అని చెప్పారు. హీరో నాగశౌర్య మాట్లాడుతూ ''నేను చాలా చిన్నవాడిని. చిరంజీవి చెయ్యి నా మీద పడింది. ఇది చాలు నాకు. మళ్లీ జన్మంటూ ఉండే మా అమ్మా, నాన్నలకే పుడతాను. మెగాస్టార్ అభిమానిగానే పుడతాను. వెంకీ చాలా అద్భుతమైన డైరెక్టర్. రెండు సంవత్సరాల్లో వెంకీ పెద్ద డైరెక్టర్ అయి చిరంజీవితో సినిమా చేయాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. హీరోయిన్ రష్మిక మండన్నా మాట్లాడుతూ ''సినిమా టీమ్ అంతా నాకు చాలా సపోర్ట్ చేశారు. ముఖ్యంగా ఉష నాకు తెలుగు నేర్పించారు. సాగర్ మంచి ట్యూన్స్ అందించారు. వెంకీ బ్యూటిఫుల్‌గా సినిమాను డైరెక్ట్ చేశాడు'' అని పేర్కొన్నారు.



ఆ వ్యామోహం తగ్గలేదు

ప్రపంచ సుందరి ఐశ్వర్యారాయ్ తన తొలి సినిమా నుంచే అందం... అభినయంతో అందరినీ ఆకట్టుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పెళ్లయినప్పటికీ ఐశ్వర్య పట్ల ప్రేక్షకుల ఆదరాభిమానాలు ఏమాత్రం తగ్గలేదు. అయితే ఇప్పటివరకు సినిమాల్లో తాను మాత్రమే ప్రధానంగా ఉండాలని ఎప్పుడూ అనుకోలేదట. కేవలం మంచి సినిమాలు ఎంపిక చేసుకొని నటనలో ఉన్నత స్థాయికి ఎదగాలన్న తత్వమే తనకు మొదటి నుంచి ఉందని చెబుతోంది ఈ అందాలతార. ''మంచి సినిమాల్లో నటించాలన్న ఆరాటం నాలో రోజురోజుకూ పెరుగుతోంది. నేను ఎదగడానికి... నటనలో మరిన్ని పాఠాలు నేర్చుకోవడానికి వీలయ్యే పాత్రల కోసమే ఎప్పుడూ అన్వేషిస్తా. ఆ తత్వం ఇప్పటికీ అలాగే ఉంది. నా తొలి సినిమా నుంచి కథ నచ్చితేనే సినిమాలు ఒప్పుకున్నాను. ఏది చేయాలనిపిస్తే అది చేశాను. అందుకే పెద్దపెద్ద స్టార్లతో నటించినా ఎప్పుడూ అభద్రతాభావం కలగలేదు. ఇన్నాళ్లుగా సినిమాల్లో నటిస్తున్నప్పటికీ నా వ్యక్తిత్వం మారలేదు. నటన పట్ల నా వ్యామోహం ఏమాత్రం తగ్గలేదు సరికదా.. ఇంకా పెరుగుతూనే ఉంది''అని చెప్పింది ఈ నీలి కళ్ల సుందరి.

చేతిలోన చెయ్యేసి చెప్పు బావా

అరుణ్ రాహుల్, అంజన జంటగా సుమన్, భానుచందర్ ప్రధాన పాత్రల్లో కట్ల రాజేంద్ర ప్రసాద్ దర్శకత్వంలో కె.జె.రాజేష్ నిర్మిస్తున్న చిత్రం 'చేతిలోన చెయ్యేసి చెప్పు బావా'. ఈ చిత్రం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సాయి వెంకట్ క్లాప్ కొట్టారు. సుమన్, భానుచందర్‌లు కలిసి దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందజేశారు. అనంతరం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో హీరో రాజేష్ మాట్లాడుతూ ''మలయాళం, తమిళ భాషల్లో నటించిన నేను మొదటి సారి ఈ చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీనిస్తున్నాను. మంచి కథతో వస్తున్న ఈ చిత్రంతో సక్సెస్‌ను అందుకుంటానన్న నమ్మకముంది''అని అన్నారు. హీరోయిన్ అంజన మాట్లాడుతూ ''తెలుగులో హీరోయిన్‌గా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉంది. ఈ సినిమా హీరోయిన్‌గా నాకు మంచి గుర్తింపు తీసుకువస్తుంది''అని తెలిపారు. దర్శకుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ''నిర్మాత రాజేష్ మంచి కథ అందించారు. దానికి తోడు టైటిల్ కూడా అద్భుతంగా కుదిరింది. ప్రేమను దక్కించుకోలేని ఓ ప్రేమ జంట మరో జన్మలో తమ ప్రేమను ఎలా దక్కించుకున్నారు... వారి పగను ఎలా తీర్చుకున్నారన్న అంశాలతో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఫిబ్రవరి చివరలో షూటింగ్ మొదలుపెట్టి ఏప్రిల్ వరకు పూర్తిచేస్తాం. వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం''అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతంః పార్థసారథి, కెమెరాః వేణు మురళీధరన్.వి, ఆర్ట్ః శ్రీను, కథ, నిర్మాతః కె.జె.రాజేష్, డ్యాన్స్, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, దర్శకత్వంః కట్ల రాజేంద్రప్రసాద్.



కె.జె.రాజేష్, అంజన, చలపతి రాజు, అరుణ్ రాహుల్, కట్ల రాజేంద్రప్రసాద్

హీరోను డామినేట్ చేస్తా

రవితేజ, రాశీఖన్నా, సీరత్‌కపూర్ హీరోహీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'టచ్ చేసి చూడు'. బేబీ భవ్య సమర్పణలో లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్, వల్లభనేని వంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రచయిత విక్రమ్ సిరికొండ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయికలలో ఒకరైన సీరత్‌కపూర్‌తో ఇంటర్వ్యూ...

భిన్నమైన పాత్ర నాది...

ఈ సినిమాలో నా పాత్ర భిన్నంగా ఉంటుంది. హీరోను డామినేట్ చేసే క్యారెక్టర్ నాది. హీరోకు ఏం చేయాలో చెబుతుంటాను. నా కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రమిది.

మంచి సినిమాలు చేస్తున్నా...

రవితేజ వంటి పెద్ద హీరోతో ఈ సినిమా చేయడం చాలా హ్యాపీగా ఉంది. 'రన్ రాజా రన్' సక్సెస్ తర్వాత నా సినిమాలు కొన్ని సరిగా ఆడలేదు. దానికి నేను పెద్దగా బాధపడను. 'రాజుగారి గది2' నుంచి మంచి సినిమాలు చేస్తున్నాను.

సెకండాఫ్‌లో వస్తా...

ఈ చిత్రంలో నేను సెకండ్ హీరోయిన్‌ని కాదు. ఒక ముఖ్యమైన పాత్ర నాది. నా క్యారెక్టర్ ఫస్ట్ హీరోయినా, సెకండ్ హీరోయినా అని నేను చూడను. పాత్రలోని ప్రాముఖ్యతను మాత్రమే చూస్తాను. అయితే సినిమా మొత్తం నా పాత్ర ఉండదు. ముఖ్యమైన సెకండాఫ్‌లో వస్తాను. నాకు, రాశీఖన్నాకు కాంబినేషన్ సీన్లు కూడా ఉండవు.

మామూలు విషయం కాదు...

రవితేజ చాలా సింపుల్‌గా ఉంటారు. సెట్స్‌లో సరదాగా ఉంటారు. ఇండస్ట్రీలో ఎన్నో ఏళ్లుగా ఉంటున్న ఆయన అలా ఉండటం మామూలు విషయం కాదు. ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా ఉండే ఆయన లైఫ్‌ను ఎంజాయ్ చేస్తూ ఉంటారు.

దేశాన్ని కాపాడటం కోసం...

సినిమా ట్రైలర్‌ను చూస్తే దేశాన్ని కాపాడటం కోసం ఒక పోలీస్ ఆఫీసర్ ఏం చేశాడు అనేది కథ అని తెలుస్తుంది. ఇందులో పోలీసుల ప్రాముఖ్యతను చూపిస్తారు.

సురేష్ ప్రొడక్షన్‌లో...

ప్రస్తుతం సురేష్ ప్రొడక్షన్‌లో ఒక సినిమా చేస్తున్నాను. రవికాంత్ పేరెపు డైరెక్టర్. 'గుంటూరు టాకీస్' ఫేమ్ సిద్ధు ఇందులో హీరో.



సీరత్‌కపూర్



'బ్యాంక్ ఆఫ్ అమెజాన్' వచ్చేస్తోంది..

న్యూఢిల్లీ: ఇ–కామర్స్ రంగంలోకి దూసుకెళ్తున్న అమెజాన్ బ్యాంకింగ్ రంగంలోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతోంది. 'బ్యాంకు ఆఫ్ అమెజాన్'తో భారత్, మెక్సికో దేశాల్లో పేమెంట్ సర్వీసులను ప్రారంభించాలనుకుంటోంది. పెట్టుబడులు, కొనుగోళ్ల కోసం ఫైనాన్స్ టెక్నాలజీ స్టార్టప్‌లను సంప్రదిస్తోందని సిబి ఇన్‌సైట్స్ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. భారత్‌లో ఇంటివద్దే క్యాష్–పికప్ సర్వీసుల కోసం అమెజాన్ ప్రత్యేకంగా తన వినిమోగదారులకు డిజిటల్ వాలెట్ కూడా ప్రవేశపెట్టి.. బ్యాంక్‌ల మాదిరిగానే సేవలను అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అనుసంధానం చేయడంతో పాటు స్టార్టప్ కంపెనీలు కొనుగోలు చేయడం, ఉన్నవాటిలో పెట్టుబడులు పెట్టటం ద్వారా వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోంది. మెక్సికోలో కూడా క్రెడిట్, డెబిట్ కార్డులకు ప్రత్యామ్నాయంగా అమెజాన్ నగదు చెల్లింపు సేవలను తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. అయితే అమెరికాలో ప్రారంభించిన ఈ సేవలకు అనూహ్య స్పందన లభిస్తోంది. సంప్రదాయ సేవలను ఇది అందించనప్పటికీ, అమెరికా ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం అధికంగానే ఉండడంతో మూడు కోట్ల మంది అమెరికన్లు బ్యాంకింగ్ వ్యవస్థకు దూరం అయ్యారు. ఈ వ్యవస్థపై నేషనల్ బ్యాంకులకు అమెరికా రెగ్యులేటర్ హెడ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గృహ కొనుగోలుదారులకు శుభవార్త

జిఎస్‌టి రేటు 12 నుంచి 8 శాతానికి తగ్గింపు



న్యూఢిల్లీ: తొలిసారి గృహ కొనుగోలుదారులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద సిఎల్‌ఎస్ఎస్(క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీమ్) వినియోగించి ఇంటిని కొనుగోలు చేసేవారికి జిఎస్‌టి రేటును 12 శాతం నుంచి 8 శాతానికి ప్రభుత్వం తగ్గించినట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించింది. కుటుంబ ఆదాయం వార్షికంగా రూ.18 లక్షల వరకు ఉండి, తొలిసారి గృహాన్ని కొనుగోలు చేసేవారు రూ.2.7 లక్షల వరకు ప్రయోజనానికి అర్హులవుతారు. అయితే సిఎల్‌ఎస్ఎస్‌కు అర్హులు కాని వారు, 12 శాతం జిఎస్‌టి చెల్లించాల్సిందేనని తెలిపింది. క్రెడిట్ లింక్ సబ్సిడీ స్కీమ్ కింద 150 చదరపు మీటర్ల వరకు కార్పెంట్ ఏరియాను వారు కొనుగోలు చేసుకోవచ్చు. కార్పెట్ ఏరియా అంటే గోడల వెలుపల ఉన్న ప్రాంతం..గత ఏడాది నవంబర్ నెలలోనే సిఎల్‌ఎస్ఎస్ కింద అర్హులైన గృహాలకు కార్పెట్ ఏరియాను పెంచడాన్ని కేబినెట్ ఆమోదించింది. మధ్యతరగతి ఆదాయ వర్గాన్ని కూడా కేంద్రం రెండు కేటగిరీలుగా వర్గీకరించింది. రూ.6 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఆదాయమున్న వారిని ఎంఐజి(మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్)1 కేటగిరీ కిందకి తెచ్చింది. వీరికి రూ.9 లక్షల వరకు రుణం అందిస్తున్నారు. వీరికి 4 శాతం వడ్డీ రాయితీ అందుబాటులో ఉంది. రూ.12 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఆదాయమున్న వారిని ఎంఐజి2 కేటగిరీ కిందకి తెచ్చి.. వీరికి రూ.12 లక్షల రుణం అందిస్తున్నారు. వీరికి 3 శాతం వడ్డీ రాయితీ అందిస్తోంది. 2022 సంవత్సరం నాటికి అన్ని పట్టణ ప్రాంకాల్లోని పేదలకు గృహాలు అందించడమే ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన లక్ష్యంగా ఉంది.



సామాన్యుడు ఆశించేదేమిటి?

కేంద్ర బడ్జెట్ 2018–19 సామాన్య పౌరులకు ఎంతో కీలకమైంది. వారు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను)ని అమలు చేసిన తర్వాత ప్రభుత్వానికి ఇది తొలి బడ్జెట్.. అలాగే 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఇది ఆఖరి పూర్తి బడ్జెట్ అవుతుంది. అందువల్ల ఈ కేంద్ర బడ్జెట్ 2018–19 ప్రభుత్వానికెంతో కీలకమైంది. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. సాధారణంగా బడ్జెట్‌ను ఫిబ్రవరి ఆఖరున ప్రవేశపెట్టేవారు.. అయితే ఎన్‌డిఎ ప్రభుత్వం దీనిలో మార్పు తీసుకొచ్చింది. ఒక నెల ముందుగానే బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించి దీనిని ఆచరణలోకి తీసుకొచ్చింది. రైల్వే బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేశారు. మొత్తానికి మరో నాలుగు రోజుల్లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై సామాన్య పౌరుల్లో ఎలాంటి అంచనాలు ఉన్నాయంటే.. చాలానే ఉన్నాయి. పన్ను సంస్కరణ, సామాజిక భద్రతపై ప్రజల్లో చాలా అంచనాలు ఉన్నాయి. ఆర్థిక పరిస్థితుల ప్రకారం, ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుంది. కొందరు నిపుణులు చెబుతున్న దాని ప్రకారం.. వేతన జీవులు ఏం కోరుకుంటారో తెలుసుకుందాం..





పన్ను శ్లాబ్ సవరణ..

ముందుగా బడ్జెట్ 20 18 నుంచి సామాన్య పౌరులు కోరుకునేదేమిటంటే పన్ను శ్లాబ్ సవరణ.. డీమానిటైజేషన్(నోట్ల రద్దు), 2017లో జిఎస్‌టి అమలు అనంతరం పన్ను చెల్లింపులు పెరిగాయి. దీనికి ప్రత్యక్ష, పరోక్ష పన్నుల నుంచి రెవెన్యూ అనేక రెట్లు పెరిగింది. ప్రభుత్వ పరోక్ష పన్ను ఆదాయంలో పెరుగుదల ఉంది. దీంతో పన్ను శ్లాబ్‌లో సవరణను ప్రతి పౌరుడు అంచనా వేస్తున్నాడు.

ఇన్వెస్ట్‌మెంట్‌పై మినహాయింపు పెంచాలి

ప్రస్తుతం 80సి పరిమితి రూ.1.5 లక్షలుగా ఉంది. ఈ పరిమితి కింద పిపిఎఫ్, పిఎఫ్, బీమా, ఇఎల్ఎస్ఎస్, టాక్స్ సేవింగ్ ఎఫ్‌డి వంటివి ఉన్నాయి. ఈ పరిమితి ఆశించనంతగా లేదు. సామాన్య పౌరులు పొదుపునకు మరింత ఊతం ఇవ్వాలని కోరుకుంటున్నారు. ఈ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు ఉండాలని ఆశిస్తున్నారు.

జీవిత బీమా పథకాలపై ప్రత్యేక మినహాయింపు



ప్రతి వ్యక్తికి జీవిత బీమా అవశ్యం.. ప్రస్తుతం 80సి సెక్షన్ కింద బీమా ప్రీమియం చెల్లింపులపై మినహాయింపు పొందుతున్నాం.. బీమాను ఎక్కువ మంది కోరుకునేది. జీవిత బీమాపై ప్రత్యేక మినహాయింపు స్వాగతించదగింది. దేశంలో ప్రభుత్వ సామాజిక భద్రత కనీసమే.. అందువల్ల ఆర్థిక భద్రతను ఇచ్చే జీవిత బీమా పాలసీల కొనుగోలు చేసేందుకు ప్రజలను ప్రోత్సహించాలి.



గృహ ఆస్తుల నుంచి నష్టం

దేశవ్యాప్తంగా రెరా(రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) అమలు గృహ కొనుగోలుదారులకు భారీ ఊరట కల్గించింది. అయితే రియల్ ఎస్టేట్ రంగం ఇప్పటికీ స్తబ్ధుగానే ఉంది. దీనికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అవసరం.. ప్రస్తుత ఆదాయ పన్ను చట్టం ప్రకారం ఇంటి ఆస్తులపై నష్టం పరిమితి రూ.2 లక్షలు.. సెక్షన్ 24 కింద ఈ పరిమితి రెండో ఇంటికి వర్తిస్తుంది, ఎనిమిది రుణ సంవత్సరాల నిబంధన ఉంది. ఈ పరిమితి పెంచాలని ఆశిస్తున్నారు.

సామాజిక భద్రత

దేశంలో మనకు సామాజిక భద్రత పథకాలు లేవు. ఆర్థిక మంత్రి నుంచి ఈసారి సామాజిక భద్రత పథకం లేదా మెడికల్ సెక్యూరిటీ పథకాన్ని కోరుకుంటున్నారు. ఇది పదవీ విరమణ అనంతరం మెరుగైన జీవితానికి దారితీస్తుంది. ఇది పెన్షన్ స్కీమ్‌లా ఉండొచ్చు.



పన్ను రహిత వైద్య పరిహారం



వేతన జీవులకు పన్ను రహిత వైద్య పరిహారం పరిమితి రూ.15 వేలుగా ఉంది. ఈ పరిమితిని చాలా సంవత్సరాల నుంచి సవరించలేదు. అయితే ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరిగాయి. అందువల్ల పన్ను రహిత వైద్య పరిహారాన్ని ప్రభుత్వ పరిశీలించాలి, పరిహార పరిమితి పెంచాలి.

పన్ను రహిత గ్రాట్యుటీ

వేతన జీవులకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ పన్ను రహిత గ్రాట్యుటీ అంశం.. ప్రస్తుతం గ్రాట్యుటీకి పన్ను రహిత పరిమితి రూ.10 లక్షలుగా ఉంది. బడ్జెట్ 2018–19లో ఈ పరిమితిని 20 లక్షలకు పెంచాలని ఆశిస్తున్నారు.

జిఎస్‌టి రేటు తగ్గింపు



జిఎస్‌టిని ప్రవేశపెట్టిన తర్వాత కొన్ని వస్తువులు, సేవల ధరలు పెరిగాయి. నిత్యావసర వస్తువులు, సేవలపై జిఎస్‌టి రేటు తగ్గాలని సామాన్య మానవుడు కోరుకుంటున్నాడు. వీటిలో బీమా, రవాణా, కమ్యూనికేషన్, విద్య వంటివి ఉన్నాయి. ఇవి కేంద్ర బడ్జెట్ 2018–19లో సామాన్యుడికి అవసరమైనవే కాదు.. ప్రభుత్వానికి అవసరమే.. ఈ బడ్జెట్ 2019 లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం చూపనుంది.

పరిశోధన రంగానికి ప్రాధాన్యత

- **ఉన్నత విద్యాసంస్థలు చొరవ తీసుకోవాలి**
- **దావోస్‌లో ఐటి శాఖ మంత్రి కెటిఆర్**

మన తెలంగాణ / హైదరాబాద్ : దేశంలో పరిశోధనా రంగానికి మరింత ప్రాధాన్యత పెరగాల్సిన అవసరం ఉన్నదని, ఇందుకోసం దేశంలోని పరిశోధనా సంస్థలు, ఉన్నత విద్యా సంస్థలు మరింత చొరవ తీసుకోవాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ కోరారు. దావోస్‌లో శుక్రవారం జరిగిన ఇన్వెస్ట్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన డెవలపింగ్ ఆర్‌డి ఇన్ ఇండియా అన్న అంశంపై జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ ప్రైవేటు రంగంలో పెద్ద సంస్థలు చేస్తున్న పరిశోధనలతో దేశంలోని అకాడమిక్ రీసెర్చ్‌ని సమ్మిళితం చేసినప్పుడు మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. పరిశోధనా కార్యక్రమాలతో పాటు పరిశోధన అనంతరం ఫలితాల ఆధారంగా ప్రభుత్వ ప్రొత్సాహకాలు ఉండేలా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సిలికాన్ వ్యాలీలో గొప్ప విజయావకాశాలకు కారణం ఇక్కడి పరిశోధనా సంస్థలేనని కెటిఆర్ అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో 50 పరిశోధన సంస్థలను అనుసంధానం చేస్తూ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (ఆర్ఐసిహెచ్) ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. రీసెర్చ్ ఫలితాల మార్కెట్లోకి రావడానికి రిచ్ సంస్థ కృషి చేస్తుందని కెటిఆర్ పేర్కొన్నారు. ఇస్రో లాంటి భారతీయ సంస్థలు తమ పరిశోధన పటిమను, సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటాయని, అతి తక్కువ ఖర్చుతో అత్యుత్తమ ఫలితాలు సాధించ వచ్చని ఇస్రో విజయం నిరూపిస్తుందని కెటిఆర్ అన్నారు. రానున్న రోజుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెద్ద కంపెనీల నుండి కాకుండా స్టార్టప్ నుంచే వస్తాయని ,తెలంగాణ ఈ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

కెటిఆర్‌కు అపూర్వ గౌరవం



దావోస్ సదస్సులో మంత్రి కెటిఆర్‌కు అపూర్వమైన గౌరవం దక్కింది. దావోస్‌లోని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో భాగంగా శుక్రవారం పలు దేశాల ఉప ప్రధానులు, మంత్రులు పాల్గొన్న లివరేజింగ్ డిజిటల్ టు డెలివర్ వాల్యూ టు సొసైటీ అన్న అంశంపై కెటిఆర్ ప్రసంగించారు. ఈ సమావేశంలో ప్యానెలిస్టులంతా ఆయా దేశాల కేంద్ర ప్రభుత్వాలకు ప్రాతినిధ్యం వహించగా , మంత్రి కెటిఆర్ ఒక్కరికే ఒక రాష్ట్ర మంత్రిగా ఇందులో పాల్గొనే అవకాశం దక్కడం గమనార్హం. మంత్రి తన ప్రసంగంలో తెలంగాణ ప్రభుత్వం మొదలు పెట్టిన డిజిటల్ తెలంగాణ కార్యక్రమం గురించి వివరించారు. ఇందులో భాగంగా మిషన్ భగీరథతో పాటు ప్రతి ఇంటికీ ఫైబర్ ఆప్టిక్ కేబుల్ సౌకర్యం ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా కల్పిస్తున్నామని , ప్రభుత్వ సేవలన్నీ డిజిటల్ మాధ్యమాల ద్వారా అందజేస్తున్నామన్నారు.అట్లాగే డిజిటల్ అక్షరాస్యతా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. బెల్జియం, బ్రెజిల్, డెన్‌మార్క్ పోర్చుగల్ మయన్మార్ , ఇండోనేషియా ,నైజిరియా, లెబనాన్, బంగ్లాదేశ్ , ఖతార్, పాకిస్తాన్ దేశాల మంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు

ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి : నిపుణులు

న్యూఢిల్లీ: ఈక్విటీ మార్కెట్లు రోజుకో చరిత్ర సృష్టిస్తూ కొత్త మైలురాళ్లను అధిగమిస్తున్నాయి. సూచీలు దూసుకుపోతున్న తీరు టెక్నికల్ విశ్లేషకులను విస్మయానికి గురిచేస్తోంది. సెన్సెక్స్ 36 వేల పాయింట్లు, నిఫ్టీ 11 వేల పాయింట్లను దాటింది. ఈ సమయంలో ఇన్వెస్టర్లు కొంత అప్రమత్తంగా ఉండడం అవసరం అని చెబుతున్నారు. నిఫ్టీ ప్రస్తుత రెసిస్టెన్స్ లెవెల్స్‌కు చేరువలో ఉన్న విషయం అందరూ ఒప్పుకుంటున్నారు. షార్ట్ చేసే విషయంలో మాత్రం ఆచితూచి వ్యవహరించాలనే సలహానే వినిపిస్తున్నాయి. ఓవరాల్‌గా మూమెంటం మాత్రం అప్‌సైడ్ ఉందని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ర్యాలీ ప్రారంభ సమయంలో అయితే టార్గెట్‌ను అంచనా వేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ గత 13 నెలలుగా మార్కెట్ ర్యాలీ చేస్తూనే ఉందని, ఇలాంటి సమయంలో నిర్ణీత టార్గెట్ ఇవ్వడం చాలా కష్టమని అంటున్నారు. ప్రస్తుత ట్రెండ్ చూస్తే 30 శాతం వరకూ షార్ట్ టెర్మ్‌లో పెరిగే అవకాశాలు ఉన్నాయి. 11,700 – 12,000 పాయింట్ల స్థాయిని నిఫ్టీ సులభంగానే అందుకునే అవకాశం ఉందంటున్నారు. రాబోయే కొన్ని సెషన్స్‌లోనే నిఫ్టీ 11,300 మార్క్‌ను అందుకునే అవకాశాలున్నాయి. పలు టెక్నికల్ ప్రమాణాల ప్రకారం ట్రెండ్ చాలా పటిష్టంగా ఉంది.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	29220	31251.34	0%
ముంబై	29950	32032.09	0.94%
ఢిల్లీ	29600	31657.75	1.37%
కోల్‌కతా	30160	32256.68	1.48%
కేరళ	28150	30106.95	0.72%
బెంగళూరు	28750	30748.66	1.41%
హైదరాబాద్	29220	31251.34	–0.14%
గల్ఫ్	1440.37	1540.50	0.03%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42000.00	42000.00	0.00
ముంబై	42000.00	42000.00	0.00
ఢిల్లీ	42000.00	42000.00	0.00
కోల్‌కతా	42000.00	42000.00	0.00
హైదరాబాద్	42000.00	42000.00	0.00

కోడిగుడ్లు (100కు) నెక్ రేటు



హైదరాబాద్	402	విశాఖపట్నం	402
వరంగల్	382	చిత్తూరు	398
విజయవాడ	397	చెన్నై	405
గోదావరి	397	బెంగళూరు	390

18 పిఎస్‌బిలపై దృక్పథం 'స్థిరం'



- మూలధనం ప్రకటనతో మెరుగవనున్న బ్యాంకులు • రేటింగ్ సంస్థ క్రిసిల్ వెల్లడి

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్‌లకు(పిఎస్‌బి)లకు కేంద్ర మూలధనం ప్రకటించడం వాటికి కలిసొచ్చింది. రేటింగ్ సంస్థ క్రిసిల్ తాజాగా ప్రకటించిన నివేదికలో 18 పిఎస్‌బిలపై దృక్పథాన్ని 'ప్రతికూలం' నుంచి 'స్థిరం'గా సవరించింది. ప్రభుత్వరంగ బ్యాంకులకు కేంద్ర ప్రకటించిన నిధుల ప్రకారంగా నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ వెల్లడించింది. ఈ నిధులతో పిఎస్‌బిల ఆర్థిక పరిస్థితులు మెరుగనుందని, బాసెల్ 3 రెగ్యులేటరీ నిబంధనలు అందుకోగలదని సంస్థ పేర్కొంది. ప్రభుత్వ బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండిబకాయిలకు వ్యతిరేకంగా ఇది దోహదం చేస్తుందని తెలిపింది.

మూడు రోజుల క్రితం 20 పిఎస్‌బిలకు రూ.88,139 కోట్ల మూలధన నిధిని అందిస్తున్నట్టు కేంద్ర వెల్లడించింది. రిక్యాపిటైజేషన్ బాండ్ల ద్వారా రూ.80 వేల కోట్లు, బడ్జెటరీ కేటాయింపుల ద్వారా రూ.8,139 కోట్లు అందివ్వనుంది. బ్యాంకుల పనితీరు ఆధారంగా చేసుకుని ఈ నిధులు అందించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆరోగ్యకరంగా ఉంచడమే తమ బాధ్యత అని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. బ్యాంకులకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డిఐ) పరిమితిని పెంచే ప్రతిపాదనేమీ లేదన్నారు. గతేడాది అక్టోబర్‌లో ప్రకటించిన అతిపెద్ద బ్యాంకు రీక్యాపిటలైజేషన్ ప్రణాళిక వివరాలను బుధవారం వెల్లడించింది. ఈ ప్రణాళికలో భాగంగా తొలుత రూ.88,139 కోట్ల మూలధనాన్ని పిఎస్‌బిల్లో జొప్పించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. జాబితాలో ఎస్‌బిఐకి రూ.8,800 కోట్లు నిధులు, అత్యధికంగా ఐడిబిఐకి రూ.10,610 కోట్లు నిధులు అందనున్నాయి. ఆ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.5,740 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడాకు రూ.5,375 కోట్లు, కెనరా బ్యాంకుకు రూ.4,865 కోట్లు అందనున్నాయి. ఇంకా యూనియన్ బ్యాంకుకు రూ.4524 కోట్లు, సిండికేట్ బ్యాంకు రూ.2,839 కోట్లు, ఆంధ్రాబ్యాంకుకు రూ.1,890 కోట్లు, విజయ్ బ్యాంకుకు రూ.1,277 కోట్లు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకుకు రూ.785 కోట్లు, బ్యాంకు ఆఫ్ ఇండియాకు రూ.9,232 కోట్లు, యుసిఐకు రూ.6,507 కోట్లు, ఐఒబికి రూ.4,694 కోట్లు, ఒబిసికి రూ.3,571 కోట్లు, దేనా బ్యాంకుకు రూ.3,045 కోట్లు, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్రకి రూ.3,173 కోట్లు, యునిటెడ్ బ్యాంకుకు రూ.2,634 కోట్లు, కార్పొరేషన్ బ్యాంకుకు రూ.2,187 కోట్లు, అలహాబాద్ బ్యాంకుకు రూ.1,500 కోట్లు లభించనున్నాయి. మొత్తం విలువ రూ.88,139 కోట్లలో రూ.8,139 కోట్లను బడ్జెట్ కేటాయింపుల ద్వారా అందించనుంది. వచ్చే రెండేళ్లలో మొండిబకాయిలతో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.2.11 లక్షల కోట్లు ఇవ్వనున్నట్టు జైట్లీ గతేడాదే ప్రకటించిన సంగతి తెలిసిందే.

బెంగాలీ నటి సుప్రియ దేవి కన్నుమూత



కోల్‌కత్తా: అలనాటి బెంగాలీ నటి సుప్రియ దేవి (85) కన్నుమూశారు. ఆమెకు అనేకసార్లు గుండెనోపి రావడంతో శుక్రవారం తెల్లవారుజామున తన నివాసంలో మృతి చెందినట్లు ఆమె కూతురు తెలియజేశారు. 1933లో జన్మించిన సుప్రియ ఐదు దశాబ్దాలపాటు సినీరంగానికి సేవలందించారు. 1952లో ఉత్తమ్ కుమార్ సరసన 'బసు పరివార్'తో నటిగా అరంగేట్రం చేశారు. మళ్లీ ఆమె ఉత్తమ్‌కుమార్‌తోకలిసి 1959లో నటించారు. పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. అదే విధంగా బెంగాల్ ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత అవార్డు అయిన బంగా విభూషణ్‌ను కూడా పొందారు. కాగా, ప్రఖ్యాత బెంగాల్ నటి మృతి చెందడ చాలా బాధాకరమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. ఆమె సినిమాల ద్వారా సుప్రియను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామన్నారు. ఆమె మృతి పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు సిఎం ట్వీట్ చేశారు. సుప్రియ మృతి చెందిన విషయాన్ని తాను నమ్మలేకపోతున్నానని మరో సీనియర్ నటి సావిత్రి చటోపాధ్యాయ అన్నారు. తామిద్దరం తరుచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారమని ఆమె చెప్పారు. కాగా, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి సోవన్‌దెబ్ చటోపాధ్యాయ సుప్రియ నివాసానికి వెళ్లి ఆమెకు నివాళి అర్పించారు. ప్రభుత్వం తరఫున అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.















బల సంపన్న భారత్

రాజ్‌పథ్‌లో ఆయుధ పాటవం.. సాంస్కృతిక వైభవం

న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా రైసినా హిల్స్‌లో వివిధ రకాల ప్రదర్శనలతో భారతదేశ వైభవాన్ని నలు దిశలా చాటారు. ఆయుధ పాటవ ప్రదర్శన ప్రతి ఒక్కరిని విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా భారత వాయుసేన విమానాలు ఆకాశంలో గర్జిస్తూ చేసిన విన్యాసాలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. అవి సాగుతున్నంత సేపు అందరి చూపులు ఆకాశంవైపే ఉన్నాయి. ఈ ఏడాది మొదటి సారిగా 'రుద్ర' హెలీకాప్టర్లు చేసిన విన్యాసాలు, వాటి శబ్దాలు చెవులను గిల్లుమనిపించాయి. అవి చేసిన ప్రత్యేక చప్పుడు అందరికి వింతగా తోచింది. సి–130జె సూపర్ హెర్క్యూలస్ విమానాల విన్యాసాలు, డిఆర్‌డిఒ స్వయంగా రూపొందించిన నేత్ర ఎయిర్‌క్రాఫ్ట్ విన్యాసాలు అద్భుతంగా అనిపించాయి. సి–17 గ్లోబ్ మాస్టర్, సుఖోయ్–30 ఎంకెఐ రకం యుద్ధ విమానాలు, తేజాస్, జాగ్వార్, మిగ్–29ఫైటర్లు విన్యాసాలు జరుగుతున్నంత సేపు అతిథులు, ఉత్సవాలకు హాజరైన ప్రజలు కరతాళ ధ్వనులు చేశారు. 900కి.మీ వేగంతో సుఖోయ్ యుద్ధ విమానాలు పొగలు విరజిమ్మాతూ ఆకాశాన్ని భాగాలుగా చూపించిన తీరు చూపరులను రెప్ప లు వాల్చనీయలేదు. పదాతి దళాల కవాతులు ఆకట్టుకున్నాయి. భారత ఆర్మీకి చెందిన యుద్ధ ట్యాంకు టి–20 (భీష్మ), బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ, రాడార్ సిస్టమ్, మొబైల్ ఆధారిత ట్రాన్స్‌వర్ స్టేషన్, ఆకాశ్ ఆయుధ వ్యవస్థ కూడా పరేడ్‌లో కనిపించాయి. నౌకా దళ విన్యాసాలకు లెఫ్టినెంట్ తుషాత్ గౌతమ్ నాయకత్వం వహించారు. తీర ప్రాంత, సీమా బల్, ఇండో టిబెటన్ సరిహద్దు దళం, ఢిల్లీ పోలీసుల కవాతు కనువిందు చేసింది. మరోవైపు వివిధ రాష్ట్రాలకు చెందిన కళలు, సంస్కతిని ప్రతిభింభిస్తూ శకటాలను ప్రదర్శించారు. ఆలిండియా రేడియోకు చెందిన శకటం ప్రధాని మోడీ నెలవారీ ప్రోగ్రామ్ 'మన్ కీ బాత్'కు అద్దం పట్టింది. రాజధానిలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల ప్రదర్శనలు ఆహుతునుల కట్టిపడేశాయి.

'సీమా భవానీ' అద్భుతం..

సరిహద్దు భద్రత దళం(బిఎస్‌ఎఫ్)కు చెందిన మహిళా బైకర్ల బృందం 'సీమా భవాని' తొలిసారిగా రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొంది. నేడు రాజ్‌పథ్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో సీమా భవాని బృందం అద్భుత ప్రదర్శన చేశారు. దళాలకు సంబంధించి పూర్తిగా మహిళలతో కూడిన మోటార్ సైకిల్ బృందం వేడుకల్లో పాల్గొనడం ఇదే తొలి సారి. ఎస్‌ఐ స్టాంజిన్ నోర్యాంగ్ ఆధ్వర్యంలో మహిళా బైకర్లు చేసిన స్టంట్స్ అబ్బురపరిచాయి. ఇందులో పాల్గొన్న వారంతా 25 నుంచి 30ఏళ్ల లోపు వారే. 350సిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటార్‌సైకిళ్లపై వీళ్లు వివిధ స్టంట్స్, ఆక్రోబాటిక్స్ ప్రదర్శించి ఆకట్టుకున్నారు. బిఎస్‌ఎఫ్ అకాడమీకి చెందిన సెంట్రల్ స్కూల్ ఆఫ్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్‌లో వీరికి శిక్షణ ఇచ్చారు. బిఎస్‌ఎఫ్‌లోని వివిధ ర్యాంకుల్లో పనిచేస్తున్న మహిళలను ఎంపిక చేసి ఈ బృందాన్ని తయారుచేశారు. 'దుర్గాదేవి లాగా వాళ్లు మన సరిహద్దుల్ని రక్షిస్తున్నారు. అందుకే వీరి బృందానికి సీమా భవాని అని పేరుపెట్టాం' అని డిప్యూటీ కమాండెంట్ రమేశ్ చంద్ర తెలిపారు. వేడుకలకు మాజీ ప్రధానులు మన్మోహన్, దేవెగౌడ హాజరయ్యారు. బిజెపి అధ్యక్షుడు అమిత్ షా కూడా ఉన్నారు.



మోడీ హల్‌చల్

న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవ పరేడ్ అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ సంప్రదాయానికి విరుద్ధంగా రాజ్‌పథ్‌కు సుదీర్ఘంగా నడుచుకుంటూ వెళ్లి హర్షధ్వానాలు చేస్తున్న ప్రేక్షకులకు శుభాకాంక్షాలు తెలిపారు. కాషాయం, ఎరుపు, ఆకుపచ్చ తలపాగ ధరించిన మోడీ ప్రేక్షకులకు ఉత్సాహంగా అభివాదం చేస్తూ ముందు నడుచుకుంటూ వెళ్తుండగా వ్యక్తిగత భద్రత సిబ్బంది, మోటార్ కాన్వాయ్‌లు ఆయనను అనుసరించాయి. ప్రేక్షకులను ఉత్సాహపరుస్తూ మోడీ వారిని సమీపిస్తుండగా ప్రతిస్పందనగా వారు మరింత బిగ్గరగా చప్పట్లు కొడుతూ హర్షధ్వానాలు చేశారు. తన భద్రతావలయం నుంచి మోడీ బయటకు రావడం ఇది మొదటిసారి కాదు. గత ఏడాది ఎర్రకోటలో స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ముగియగానే భద్రతా సిబ్బందిని తోసిరాజని చిన్నారులకు షేక్ హ్యాండ్ ఇచ్చారు.

'దశ'దేశాలు చూస్తుండగా

ఘణతంత్ర పండుగ

- ఆకట్టుకున్న త్రివిధ దళాల విన్యాసాలు, కళా ప్రదర్శనలు
- ఢిల్లీ రాజ్‌పథ్‌లో మువ్వన్నెల రెపరెపలు

న్యూఢిల్లీ: 69వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం నాడు ఘనంగా జరిగాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహా కేంద్ర మంత్రులు, ఏసియాన్ దేశాల అధినేతలు, అతిథులు ప్రత్యక్షంగా వీక్షిస్తుండగా భారత త్రివిధ దళాలు తమ విన్యాసాలతో ఆకట్టుకున్నాయి. దేశ ఆయుధ వైభవాన్ని రాజ్‌పథ్ వీధుల్లో చాటాయి. సాంస్కృతిక ప్రదర్శనలతో దేశ నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు భిన్నత్వాన్ని చాటారు. అతిథులకు కనువిందు చేశారు. ఆయా రాష్ట్రాలతో పాటు కేంద్ర మంత్రిత్వశాఖలకు చెందిన ఆయా శకటాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 10దేశాల అధినేతలు రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరుకావడం భారత గణతంత్ర చరిత్రలో ఇదే ప్రథమం. ఆసియాలో భారత్ కీలక శక్తిగా ఎదుగుతుందనడానికి ఇదొక మచ్చుతునకగా ఈ దృశ్యం సాక్షాత్కరమైంది. రాజ్‌పథ్ ఇరువైపులా వేలాది మంది సమక్షంలో, కోట్లాది మంది పరోక్షంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతీయగీతాలాపన చేశారు. అనంతరం వేడుకలు ప్రారంభమయ్యాయి. రైసినా హిల్స్‌లో అంగరంగ వైభంగా నిర్వహించిన ఈ ఉత్సవానికి మయన్మార్ ప్రతినిధిగా అంగ్ సాన్ సూకీ, వియత్నాం ప్రధాని గుయెన్ ఫుక్, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డుటెర్టీ, థాయ్‌లాండ్ ప్రధానమంత్రి ప్రయూత్ చాన్ ఓచా, సింగపూర్ ప్రధాని లీ సీన్ లూంగ్, బ్రూనై సుల్తాన్ హాజీ హసనల్, ఇండొనేసియా ప్రెసిడెంట్ జోకో విడొడో, మలేషియా ప్రధాని నజీబ్ రజాక్, లావోస్ ప్రధానమంత్రి తొంగ్లోన్ సిసోలిత్, కంబోడియా ప్రధాని హున్ సేన్ ఈ ప్రదర్శనల వీక్షించి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. లెఫ్టినెంట్ జనరల్ అసిత్ మిస్త్రీ నాయకత్వంలో జరిగిన గణతంత్ర పరేడ్ ఆద్యంత ఆహుతులను ఆకట్టుకుంది. రాష్ట్రపతి గౌరవ వందనం చేస్తూ త్రివిధ దళాలు ముందుకుసాగాయి. పరేడ్‌లో ఏసియాన్ పతాకాన్ని చేతపట్టుకుని సైనికులు ముందుకు సాగారు. సాహస బాలురతో కూడిన వాహనాలు ముందుకు సాగుతున్నప్పుడు కరతాళ ధ్వనులు వినిపించాయి. దేశ వ్యాప్తంగా 61 మంది గిరిజన నేతలను కేంద్ర ప్రభుత్వం తరపున ఉత్సవాలకు ఆహ్వానించారు.

ఉద్వేగానికి గురైన రాష్ట్రపతి...

గణతంత్ర వేడుకల్లో భాగంగా ప్రెసిడెంట్ మెడల్స్ ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి కోవింద్ ఉద్వేగానికి గురయ్యారు. ఓ అమర సైనికుడి త్యాగానికి కంటతడి పెట్టారు. ఉగ్రవాదులతో పోరులో అసువులు బాసిన కార్పొరల్ జ్యోతి ప్రకాశ్ నిరాలాకు ప్రకటించిన



అశోక్ చక్ర అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా ఆయన సతీమణి సుష్మానంద్, తల్లి మాలతీదేవి అందుకున్నారు. వారు అవార్డు అందుకున్న తర్వాత ప్రెసిడెంట్ కోవింద్ కొద్దిసేపు ఉద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. చేతి రుమాలు తీసి కన్నీళ్లు తుడుచుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా 390మంది అధికారులకు రాష్ట్రపతి సాహస పురస్కారాలు లభించాయి. వీటిలో ఒక కీర్తి చక్ర, 14 శౌర్య చక్ర, 28 పరమ్ విశిష్ట సేవా పతకాలు, 4 ఉత్తమ్ యుద్ధ్ సేవా పతకాలున్నాయి. ఉత్తమ సేవలు అందించిన 27 మంది సిబిఐ అధికారులకు కూడా రాష్ట్రపతి పురస్కారాలు ప్రకటించారు.



రాహుల్‌కు ఆరో వరుసలో సీటు

న్యూఢిల్లీ: రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరైన కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ ఆరో వరసలో తనకు కేటాయించిన సీట్లో కూర్చున్నారు. అయితే సీటు వివాదంపై కాంగ్రెస్ మరోసారి మోడీ సర్కార్‌పై విరుచుకుపడింది. రాహుల్‌కు ముందు వరుసలో సీటు కేటాయించకుండా ప్రభుత్వం చౌకబారు ఎత్తుగడలకు పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ సమాచార విభాగం ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా వ్యాఖ్యానించారు. గతంలో సోనియా గాంధీ రిపబ్లిక్ డే పరేడ్‌లో ముందువరుసలో కూర్చునేవారని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రాహుల్‌ను ఉద్దేశపూర్వకంగానే ఆరవ వరసలో కూర్చోపెట్టారని ప్రభుత్వ అభిమతమేదైనా తమకు మాత్రం రిపబ్లిక్ డే వేడుకలే ప్రధానమని చెప్పుకొచ్చిన సూర్జేవాలా రిపబ్లిక్ డే వేడుకల్లో సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ పక్కన కూర్చున రాహుల్ ఫోటోను ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. ముందువరుసలో మాజీ ప్రధానులు హెచ్‌డి దేవెగౌడ, మన్మోహన్ సింగ్‌లు కూర్చున్నారు. కాగా, రిపబ్లిక్ డే వేడుకలకు తొలిసారిగా పది ఆసియాన్ దేశాధినేతలు హాజరయ్యారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేద్దాం : రాహుల్

భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం మరోసారి ప్రతిజ్ఞ చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. స్వేచ్ఛ, సమానత్వాలను కాపాడేందుకు నడుం బిగించాలన్నారు. 'ఈ గణతంత్ర దినోత్సవం నాడు మన అద్భుతమైన గణతంత్ర దేశానికి గీటురాయిలాంటి రాజ్యాంగ పరిరక్షణకు యావజ్జీవిత ప్రతిజ్ఞ చేద్దాం. రాజ్యాంగం ప్రమాదంలో పడినపుడల్లా సమైక్యంగా కాపాడటానికి మరోసారి శపథం చేద్దాం' అని ట్వీట్ చేశారు.

'నీట్'కు ఒకటే సెట్ ప్రశ్నాపత్రం

- సుప్రీంకోర్టుకు తెలిపిన సిబిఎస్‌ఇ

న్యూఢిల్లీ: ఎంబిబిఎస్, బిడిఎస్‌లలో ప్రవేశానికి నేషనల్ ఎలిజిబిలిటి కం ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) రాసే విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ఒకే సెట్ ప్రశ్నాపత్రం మాత్రమే రూపొందిస్తామని సుప్రీంకోర్టుకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్‌ఇ)తెలిపింది. వైద్య విద్యానభ్యసించాలనుకునే వారికి ఒకే సెట్ ప్రశ్నాపత్రం ఇచ్చేలా ఆదేశించాలని 'సంకల్ప్' చారిటబుల్ ట్రస్ట్ దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ అరుణ్ మిశ్రా, ఎఫ్‌ఎ నజీర్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇప్పటివరకు హిందీ, ఆగ్లం సహా 10 భాషలలో పరీక్షలు రాసేందుకు విద్యార్థులను అనుమతించామని సిబిఎస్‌ఇ పేర్కొంది. వేర్వేరు భాషలో వేర్వేరు సెట్ల ప్రశ్నా పత్రాలు తయారు చేయడం తర్క విరుద్ధమని, ప్రశ్నలు వేర్వేరుగా ఉన్నప్పుడు విద్యార్థుల యోగ్యతను మూల్యాంకనం చేయడం చాలా కష్టమని అంతకు ముందు ధర్మాసనం పేర్కొంది. సుప్రీం సూచనల మేరకు ఈ విద్యా సంవత్సరం నుంచి ఒకటే సెట్ ప్రశ్నా పత్రాన్ని వివిధ భాషల్లో తర్జుమా చేసి ఇస్తామని సిబిఎస్‌ఇ తెలిపింది.

మహిళా ఉగ్రవాది అరెస్టు



శ్రీనగర్: 69వ గణతంత్ర దినోత్సవ వేడుకల కంటే ముందు ఒకరోజు జమ్మూకశ్మీర్‌లో మహిళా ఉగ్రవాదిని పోలీసులు అరెస్టు చేశారు. దక్షిణ కశ్మీర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న 18ఏళ్ల యువతిని విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. జమ్మూ కశ్మీర్‌లో జరిగే రిపబ్లిక్ వేడుకల్లో ఆత్మాహుతి దాడికి ఈ యువతి ప్లాన్ చేసినట్లు విచారణలో తేలింది. పూర్తిస్థాయి విచారణ తర్వాత మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఐసీస్‌తో ఈ యువతికి సంబంధాలున్నాయని, ఎప్పటికప్పుడూ ఇక్కడి సమాచారాన్ని వారికి చేరవేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఐసీస్ సహకారంతో సిరియా వెళ్లేందుకు యువతి ప్రయత్నించినట్లు తెలిసింది. పుణెకు చెందిన ఈమె 11వ తరగతి వరకు చదువుకుంది.

ఆసియాన్‌పై చిన్నచూపు లేదు

- పది దేశాల పత్రికల్లో ప్రధాని మోడీ వ్యాసాలు

సింగపూర్: పెద్దవా, చిన్నవా అన్న తేడాలతో నిమిత్తం లేకుండా అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని 'ఆసియాన్' గౌరవిస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం నాడు అన్నారు. భారత, ఆసియాన్ మధ్య ఎటువంటి పోటీలు, ఘనత చాటింపులకు తావులేని సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. పది ఆసియాన్ దేశాలలో 10 భాషలకు చెందిన 27 వార్తా పత్రికలు మోడీ అభిప్రాయాలను ప్రముఖంగా ప్రచురించాయి. 69వ గణతంత్ర దినోత్సవం, ఆసియాన్ – భారత్ శిఖరాగ్ర సభ సందర్భంగా ఆయన పంచుకున్న అభిప్రాయాల వివరాలను విదేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ ఒక ట్వీట్‌లో వివరించారు. 'షేర్డ్ వాల్యూస్, కామన్ డెస్టినీ' పేరిట వ్యాసంలో మోడీ ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలను ప్రముఖంగా ప్రస్తావించారు. 'స్ట్రెయిట్ టైమ్స్' పత్రిక ఆ వ్యాసాన్ని ప్రచురించింది. ఆసియాన్‌తో సాంస్కృతిక, సహకార సంబంధాలను భారత్ కలిగి ఉన్నట్లు మోడీ వివరించారు. ఆ సంబంధాల్లో పంతాలు, పట్టింపులు, చాటింపులు, పోటీలు వంటివి లేవని వివరించారు. భవిష్యత్తుకు అందరినీ కలుపుకుపో యే నిర్దిష్టమైన దార్శనిక శక్తి ఆసియాన్ కలిగి ఉందని చెప్పారు. ఆసియాన్, భారత్ 25 ఏళ్ల మైత్రికి చిహ్నంగా ఆ కూటమి నాయకులతో శిఖరాగ్ర సభకు ఆతిథ్యం ఇచ్చే హక్కు భారత్ కలిగి ఉందని మోడీ చెప్పారు. ఆసియాన్‌తో పటిష్టమైన భాగస్వామ్యం ఉన్నట్లు తెలిపారు. మానవ జా తిలో నాలుగోవంతు ఉన్న



190 కోట్ల జనాభాకు ఆసియాన్ – భారత్ భాగస్వామ్యం గొప్ప భవిష్యత్తును హామీ ఇస్తోందని కూడా తెలిపారు. భారత, ఆగ్నేయాసియా మధ్య గాఢమైన బంధాలు భవిష్యత్తుకు కీలకంగా మారాయన్నారు.

పాక్ బహుమతులకు బిఎస్‌ఎఫ్ నో

న్యూఢిల్లీ: పాకిస్థాన్ రేంజర్లకు భారత సరిహద్దు బలగాలు (బిఎస్‌ఎఫ్) షాకిచ్చాయి. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పాక్ రేంజర్లు ఆఫర్ చేసిన తీపి తినుబండారాలను తీసుకునేందుకు నిరాకరించాయి. సరిహద్దు వెంట ఆక్రమణ చర్యలు, దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ రూపంలో నిరసన తెలిపాయి. అదే సమయంలో బంగ్లాదేశ్ బలగాలతో మాత్రం స్వీట్లు పంచుకున్నాయి. ప్రతి గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవానికి సరిహద్దు వద్ద ఉన్న గేట్లను ఓసారి ఓపెన్ చేసి ఇరు దేశాలకు చెందిన సైనికులు గౌరవ వందనం చేసుకోవడంతో పాటు స్వీట్లు కూడా పంచుకుంటారు.

రాజ్యాంగ రక్షణకు ప్రతిపక్షాల యాత్ర

- 29న ఢిల్లీలో తదుపరి సమావేశం

ముంబయి: ఈ నెల 29న న్యూఢిల్లీలో ప్రతిపక్షాలు సమావేశంఅయి బిజెపితో రానున్న పోరాటాన్ని చర్చిస్తాయని ఎన్‌సిపి అధ్యక్షుడు శరద్ పవార్ శుక్రవారం నాడు చెప్పారు. ప్రమాదంలో పడిన రాజ్యాంగాన్ని రక్షించాలని నినదిస్తూ ప్రతిపక్షాల వారు యాత్ర నిర్వహించారు. రిపబ్లిక్ డే నాడు కాకతాళీయంగా ఈ యాత్ర జరిగింది. గణతంత్ర దినోత్సవం రాజ్యాంగం అమలులోకి వచ్చిన సంకేత దినం. ఈరోజు వామపక్షాలతో సహా అనేక మంది ప్రతిపక్ష నాయకులను ఒకే ఉమ్మడి వేదిక మీదికి తేవడం విశేషం. లోక్‌సభ ఎన్నికలకు కేవలం ఏడాది కాలం మిగిలి ఉండగా జరిగిన ఈ యాత్ర బిజెపితో పోరుకు ప్రతిపక్షాల మధ్య గల ఐక్యతకు నిదర్శనం. పవార్, సీతారాం ఏచూరి (సిపిఐ–ఎం), శరద్ యాదవ్ (జెడి–యు తిరుగుబాటు నాయకుడు), డి. రాజా (సిపిఐ), హార్దిక్ పటేల్ (గుజరాత్ పటీదార్ నాయకుడు), దినేశ్ త్రివేది (తృణమూల్), సుశీల్ కుమార్ షిండే (కాంగ్రెస్) సహా పలు రాష్ట్రాల నుంచి నాయకులు ఈ యాత్రలో పాల్గొన్నారు. రాష్ట్ర సచివాలయం వద్ద ఒవల్ మైదానంలో యాత్ర అనంతరం పవార్ ప్రసంగిస్తూ భావ సారూప్యత గల పార్టీలు రాజ్యాంగ రక్షణకు ఏకత్రాటిపైకి రావడం ఉమ్మడి నిర్ణయమని చెప్పారు. తమ ఐక్యతపై తదుపరి చర్చలు ఈ నెల 29న ఢిల్లీలో జరుగుతాయని, రాజ్యాంగ పరిరక్షణకు ఏమి చేయాలన్నది చర్చిస్తామని తెలిపారు.



ప్రభుత్వం నియంతృత్వం దిశగా కదులుతున్నప్పుడు ప్రజాస్వామ్య, సెక్యులర్ శక్తులు ఏకం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలవల్ల దేశానికి పెను ప్రమాదం కేంద్రం నుంచి రానుందని కూడా హెచ్చరించారు.



చీలికలకు కారణమవుతున్న కశ్మీర్, రోహింగ్యా సమస్యలు

దావోస్: ప్రపంచంలో భేదాభిప్రాయాలకు కశ్మీర్, రోహింగ్యా సమస్యల వంటివి కారణమని పాకిస్థాన్ శుక్రవారం నాడు ప్రకటించింది. ఆ సమస్యలపై అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరగాలని సూచించింది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యు ఇఎఫ్) సమావేశం నిమిత్తం ఇక్కడకు తన మంత్రివర్గ సహచరులతో వచ్చిన పాకిస్థాన్ ప్రధాని సహీద్ ఖకాన్ అబ్బాసీ ఇక్కడ విలేకరుల గోష్ఠిలో మాట్లాడుతూ కశ్మీర్ ప్రస్తావన తెచ్చారు. చైనాతో గట్టి సంబంధాలను తాము ఆశిస్తున్నామని చెప్పారు. అలాగే అమెరికాతో కూడా సంబంధాల పటిష్ఠానికి కోరుతున్నామన్నారు. ఇటీవల కొంతకాలంగా చైనాతో సంబంధాలు మెరుగు చెందినట్లు చెప్పారు. అందుకు బెల్ట్ అండ్ రోడ్ పథకం (బిఆర్ఐ), చైనా–పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ (సిపిఇసి) పథకం వంటివి కారణమని తెలిపారు. విదేశాంగ మంత్రి ఖ్వాజా మొహమ్మద్ కూడా గోష్ఠిలో కశ్మీర్, రోహింగ్యా సమస్యలు వంటివి ప్రపంచంలో చీలికల కారణమవుతున్నట్లు ఆరోపించారు. దేశం పుట్టినప్పటి నుంచి చైనాతో మంచి సంబంధాలు కలిగి ఉన్నామని ఖ్వాజా అన్నారు.

లాటరీ వీసాలకు స్వస్తి : ట్రంప్



భారత వృత్తి నిపుణులకు ప్రయోజనం

వాషింగ్టన్: అత్యంత నైపుణ్యంగల కార్మికుల వీసాల కోసం అనుసరించే లాటరీ పద్ధతికి స్వస్తి పలకాలని ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదించింది. భారతదేశం నుంచి వచ్చిన అత్యంత నైపుణ్యంగల వలసదారులకు ఇవ్వాల్సిన గ్రీన్ కార్డు బకాయిల సంఖ్యను ఆ చర్య చట్టమయితే బాగా తగ్గిస్తుంది. కానీ అమెరికాలో చాలా కాలం నుంచి వేచిఉన్న భారతీయ వృత్తి నిపుణులకు ఈ చర్యవల్ల లాభం చేకూరుతుందని భావిస్తున్నారు.'డైవర్సిటి ఇమిగ్రెంట్ వీసా ప్రోగ్రాం' ఈ కార్యక్రమం పేరు. దీనికి స్వస్తి పలకాలని ట్రంప్ యోచిస్తున్నారు. దీనితో ఏడాదికి 50,000 మంది గ్రీన్ కార్డు వీసాదార్లు తగ్గిపోతారు.

వివాదాస్పద విడియోల రీ ట్వీట్‌కు ట్రంప్ క్షమాపణ

ఇస్లామిస్టుల హింసాకాండను చూపుతున్న బ్రిటిష్ మితవాద గ్రూపుల విడియోలను రీ ట్వీట్ చేసినందుకు అమెరికా అధ్యక్షుడు తొలిసారి క్షమాపణ చెప్పారు. మూడు ముస్లిం వ్యతిరేక విడియోలను వెంట వెంటనే రీ ట్వీట్ చేసి బ్రిటన్‌లో నిరసనలను ట్రంప్ ప్రజ్వరిల్లేలా చేశారు.ఒక ముస్లిం మహిళను మతపరమైన దృష్టితో వేధించినందుకు 2016లో శిక్షకు గురైన బ్రిటన్‌కు చెందిన బ్రిటన్ ఫస్ట్ గ్రూపు నాయకుడు ఫ్రాన్సన్ ఆవిడియోలనుపోస్టు చేశారు. బ్రిటన్ ఫస్ట్ జాతి వ్యతిరేక భావాలతో కూడిన ఛాందన సంస్థ కావడంతో దాని విడియోలు రీట్వీట్ చేసి ట్రంప్ విద్వేషాలను బ్రిటన్‌లోరెచ్చగొట్టినట్లువిమర్శలు వచ్చాయి.

ఆస్పత్రిలో అగ్ని కీలలు

దక్షిణ కొరియాలో 41మంది దుర్మరణం

సియోల్: దక్షిణకొరియాలో ఘోర ప్రమాదం జరిగింది. మిర్యాంగ్ నగరంలోని సెజాంగ్ ఆస్పత్రిలో మంటలు చెలరేగిన ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 70 మందికి పైగా గాయపడ్డారు. ఆరంతస్తులు గల ఆస్పత్రి భవనంలోని మొదటి అంతస్తులో శుక్రవారంనాడు ఉదయం మంటలు చెలరేగి భవనం మొత్తం వ్యాపించాయి. ఎమర్జెన్సీ గది నుంచి అకస్మాత్తుగా మంటలు ఎగిసిపడడం చూశామని ఇద్దరు నర్సులు తెలిపారని, ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని ఫైర్ చీఫ్ చోయ్ మన్ వూ తెలిపారు. మరణించిన వారిలో ఎక్కువ మంది మొదటి, రెండో అంతస్తుల్లోని రోగులు అని, కొందరు మరో ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించారని అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆస్పత్రిలో 200 మంది ఉన్నారు. ఆస్పత్రిని పూర్తిగా ఖాళీ చేశామని, రోగులందరినీ బయటకు తీసుకొచ్చామని అధికారులు చెప్పారు. మూడో అంతస్తులోని ఎమర్జెన్సీ వార్డులో ఉన్న పదిహేను మంది రోగులను వైద్యుల పర్యవేక్షణతో బయటకు తీసుకురావడానికి ఎక్కువ సమయం పట్టినట్లు తెలిపారు. భవనంలో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఆ ప్రాంతమంతా నల్లటి పొగ కమ్మేసింది.ఈ వీడియోలను కొందరు సోషల్‌మీడియా పోస్ట్ చేశారు. సహాయక సిబ్బంది ఎంతో కష్టపడి భవనాన్ని ఖాళీ చేయించారు.సహాయక చర్యలకు హెలికాప్టర్లను కూడా ఉపయోగించారు.





సింగరేణి విస్తరణకు భారీ ప్రణాళిక

● 5 ఏళ్ళ లక్ష్యం 850 లక్షల టన్నులు ● 2,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సమాయత్తం ● సింగరేణి సిఎండి శ్రీధర్ వెల్లడి

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర, దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రానున్న ఐదేళ్లల్లో భారీ విస్తరణకు సింగరేణి సంస్థ సన్నద్ధమవుతోంది. 2022 నాటికి 850 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అనుగుణంగా లక్ష్యం రూపొందించుకుంది. 69వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం సంస్థ సీఎండీ శ్రీధర్ జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం ప్రసంగిస్తూ, తెలంగాణ ఏర్పడే నాటికి (2010–14) 52 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సింగరేణి ఈ మూడేళ్ల కాలంలో 25 శాతం వృద్ధి సాధించిందని, 65 మిలియన్ టన్నుల ఉత్పత్తి స్థాయికి చేరుకుందని, 14 వేల కోట్ల రూపాయలుగా ఉన్న అమ్మకాలు రూ. 23,500 కోట్లకు పెరిగాయని వివరించారు. ఈ సంవత్సరం కంపెనీ లాభాలు 1000 కోట్ల రూపాయలు దాటే అవకాశముందని తెలిపారు. విస్తరణలో భాగంగా సింగరేణి 8,250 కోట్ల రూపాయలతో మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పిందని, దీని ద్వారా ఏటా 3,500 కోట్ల రూపాయల మేర బొగ్గు అమ్మకాలు జరుగుతున్నాయని చెప్పారు. దీని ద్వారా ఈ ఏడాది 350 కోట్ల రూపాయల లాభం వస్తోందన్నారు. దేశంలో 500కు పైగా థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉన్నప్పటికీ కేవలం ఏడాది వయసు కలిగిన సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం 91 శాతం రికార్డు స్థాయి పిఎల్ఎఫ్‌తో జాతీయ స్థాయి అత్యుత్తమ పవర్ ప్లాంటు జాబితాలో 4వ స్థానాన్ని సంపాదించిందని గుర్తు చేశారు. మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్‌ను సుమారు 2,500 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని, మరోవైపు ఖాళీ ప్రదేశాలలో 500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌లను కూడా నిర్మించనున్నట్లు తెలిపారు. రానున్న 5 ఏళ్లల్లో 5,500 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. రానున్న 5 ఏళ్లల్లో 13 కొత్త గనులను తెరచి 83 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించనున్నట్లు వివరించారు. పని సామర్థ్యంతో పాటు లాభాలు కూడా పెరుగుతాయని, దీంతో కంపెనీ విస్తరణ, సంక్షేమ కార్యక్రమాలకు వీలు కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ సూచనల మేరకు గత మూడేళ్లల్లో సింగరేణిలో సంక్షేమ కార్యక్రమాలతో పాటు లాభాల్లో వాటా ఇవ్వడం, కార్మికుల తల్లిదండ్రులకు వైద్య సౌకర్యం అందించడం లాంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు.

కర్నూలు జిల్లాలో దారుణం

కర్నూలు : కొద్దికాలంగా ఫ్యాక్షన్ హత్యలకు దూరంగా ఉన్న కర్నూలు జిల్లాలో మరో సారి దుండగులు రెచ్చిపోయారు. కత్తులతో కలకలం రేపారు. శుక్రవారం సాయంత్రం జిల్లాలోని కల్లూరులో నడిరోడ్డుపై రియల్టర్ శ్రీనివాసులుపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. రియల్టర్ కోసం కాపుగాచిన దుండగులు ఆయన రాగానే పక్కా పథకం ప్రకారం కత్తులతో నరికారు. ఈ దాడిలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. అత్యవసర చికిత్సకై ఆయన్ను స్థానికంగా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. రియల్టర్ కుటుంబీకులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. స్థానిక సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్‌కు ఎవరైనా శత్రువులున్నారా? ఈ ఘటనకు పాల్పడిందెవరు? ఎవరితో అయినా భూ తగాధాలున్నాయా? రియలస్టేట్ విషయంలో ఎవరైనా ఇలా చేశారా? ఇతర రాష్ట్రాలకు సంబంధించిన గ్యాంగ్ డబ్బుల కోసమే ఈ దారుణానికి పాల్పడిందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ ఘటనకు పాల్పడిన దుండగులు జిల్లాలోనో మకాం వేసుంటారనే అనుమానంతో పోలీసులు కర్నూలులోని అన్ని పీఎస్‌లకు సమాచారం అందించి అలర్ట్ చేశారు. ఈ కేసును చేధిస్తామని పోలీసు ఉన్నతాధికారి చెప్పారు.

దోస్త్‌పై అవగాహనకు సరికొత్త ప్రణాళికలు

- ఆన్‌లైన్ ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం
- జూనియర్ కళాశాలల్లో కరపత్రాల పంపిణీ
- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలకు సిద్ధమవుతున్న ఉన్నత విద్యామండలి



మన తెలంగాణ/హైదరాబాద్ : ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు తగిన అవగాహన కల్పించేందుకు ఉన్నత విద్యామండలి ప్రణాళికలు రూపొందిస్తోంది. గత రెండేళ్లుగా డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ(దోస్త్) ద్వారా డిగ్రీ కళాశాలలు ప్రవేశాలు చేపడుతున్నాయి. ఆన్‌లైన్ ప్రవేశాలపై సరైన అవగాహన లేక దోస్త్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఆప్షన్ల ఎంపికలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించాయి.ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే విద్యాసంవత్సరం పటిష్టంగా డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నాయి.

జూనియర్ కళాశాలల్లో కరపత్రాల పంపిణీ : దోస్త్ రిజిస్ట్రేషన్ విధానం, ఆప్షన్ల ఎంపిక ప్రక్రియను సంబంధించిన పూర్తి సమాచారంతో తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో కరపత్రాలు రూపొందించి వచ్చే నెలలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. పత్రికలు, టివిల్లో విస్తృత ప్రచారం కల్పించాలని నిర్వాహకులు భావిస్తున్నారు. ఇంటర్ బోర్డ్ వెబ్‌సైట్‌లో దోస్త్ ప్రక్రియకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాల్లో విద్యార్థులకు తలెత్తే సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే సమన్వయకర్తలను నియమించడానికి ఉన్నత విద్యామండలి ఏర్పాట్లు చేస్తోంది. హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, బయోమెట్రిక్ సౌకర్యం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోనుంది. ఈ హెల్ప్‌లైన్ కేంద్రాలు 24 గంటలూ అందుబాటులో ఉండే విధంగా చొరవ తీసుకుంటోంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సాంకేతిక సమస్యల పరిష్కార బాధ్యతలనుసెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సిజిజి)కు బదులుగా ఈసారి నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్(ఎన్ఐసి) అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

చివరి విడత వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం : దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి చివరి విడత ప్రవేశాలు ముగిసే వరకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. ఆన్‌లైన్ ప్రవేశాల సరైన అవగాహన లేక చాలామంది విద్యార్థులు సకాలంలో రిజిస్ట్రేషన్లు చేసుకోవడం లేదు. ఫలితంగా సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి.
గత రెండేళ్లుగా రిజిస్ట్రేషన్ చేసుకోకుండా చివరి నిమిషంలో తమకు సీటు కావాలని విద్యార్థులు దోస్త్ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు చివరి విడత డిగ్రీ ప్రవేశాలు ముగిసే వరకు దోస్త్‌లో రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కోర్సుల్లో 4,10,267 సీట్లు అందుబాటులో, 1,95,499 సీట్లు భర్తీ అయ్యాయి. నాలుగు విడతల కౌన్సెలింగ్‌తో పాటు ఒకసారి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించినా సగం సీట్లు కూడా భర్తీ కాలేదు. చివరి కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత 2,14,041 సీట్లు ఖాళీగా మిగిలాయి.

ఆరుగురు హఖానీ, తాలిబన్‌లపై అమెరికా ఆంక్షలు

వాషింగ్టన్: హకానీ, తాలిబన్ నెట్‌వర్క్‌కు చెందిన ఆరుగురుపై ట్రంప్ యంత్రాంగం శుక్రవారం నాడు ఆంక్షలు విధించింది. మిలిటెంట్లకు భద్రమైన ఆశ్రయం కల్పించకుండా ఉండాలని, వారిని వేటాడ్డంలో అమెరికాతో కలిసి పని చేయాలని పాకిస్థాన్‌ను ఆహ్వానించింది కూడా.ఉగ్ర సంస్థ నిధుల మూలాలను గురిపెట్టి దాడులు జరపాలని కూడా పాకిస్థాన్‌కు సూచించింది. అఫ్గానిస్థాన్‌లో చాలా మంది అమెరికన్ పౌరులను హకానీ నెట్‌వర్క్ కిడ్నాప్ చేయడం,దాడులు జరపడం సాగించింది. అఫ్గాన్‌లోని అనేక భారతీయ యంత్రాంగాలపై దాడులకు కూడా ఆనెట్‌వర్క్ కారణం.2008 లో కాబూల్‌లోని భారత దౌత్య కార్యాలయంపై బాంబు దాడి జరిపి58 మంది మరణానికి ఆ నెట్‌వర్క్ కారణమయింది. అమెరికా తాజాగా ఆంక్షలు ప్రకటించిన వారిలో నలుగురు తాలిబన్ ఉగ్రవాదులు ఉన్నారు. వారు – అబ్దుల్ సమాద్ సానీ, అబ్దుల్ ఖాదీర్ బాషీర్ అబ్దుల్ బషీర్, హఫీజ్ మొహమ్మద్ పోపల్ జాయ్, మౌలావి ఇనాయతుల్లా.ఆంక్షలకు ఫకీర్ మొహమ్మద్, గులాఖాన్ హమీది అనే ఇద్దరు హఖానీ ఉగ్రవాదులు ఉన్నారు.

బస్సు ప్రమాదంలో 8మంది మృతి

వాషింగ్టన్ : సెంట్రల్ అమెరికా సరిహద్దుల్లోని గౌటమాలాలో ఘోర బస్సు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందగా, మరో 15మంది తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. బస్సు రహదారి మలుపు వద్ద అదుపుతప్పి లోయలోకి పడిపోయింది. దీంతో ప్రమాదం సంభవించింది. పశ్చిమ గాటేమలా పర్వత ప్రాంతంలోని ఈ ప్రమాదం జరిగి

అప్పటి జడ్జీల్లో న్యాయస్ఫూర్తి



మన తెలంగాణ/హైదరాబాద్ : దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎవరుండాలో ప్రధాని నెహ్రూ ప్రతిపాదన చేశారని, అయితే అప్పటి న్యాయమూర్తుల న్యాయ స్ఫూర్తి తో సున్నితంగా ఆ వ్యవహారానికి తెర పడిందని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) రమేష్ రంగనాథన్ చెప్పారు. 1954లో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పతంజలి శాస్త్రి పదవీ విరమణ చేశారని, ఆ పదవిని చేపట్టాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న బీకే ముఖర్జీని ప్రధాని నెహ్రూ కోరారని, తన కంటే సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నందున సీజేగా బాధ్యతలు చేపట్టబోనని ముఖర్జీ చెప్పడమే కాకుండా ఒక దశలో న్యాయమూర్తి పదవికి రాజీనామా చేస్తానని చెప్పారని ఏసీజే గుర్తు చేశారు. శుక్రవారం హైకోర్టు ఆవరణలో 69వ గణతంత్ర వేడుకల సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ప్రసంగించారు. సీనియార్టీ ప్రకారం ముఖర్జీ నాలుగో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారని ఏసీజే తెలిపారు.అనంతరం తెలుగు రాష్ట్రాల అడ్వకేట్ జనరల్స్ శ్రీనివాస్/ప్రకాష్‌రెడ్డిలు మాట్లాడారు. ఎపిలో అన్ని శాశ్వత ఏర్పాట్లు చేశాకే హైకోర్టును తరలించాలని హైకోర్టు న్యాయవాదుల ఏపీ సంఘం అధ్యక్షుడు చల్లా ధనుంజయ్ కోరారు. సరైన వేదికపై సముచిత అంశాన్ని ప్రస్తావించాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ముగింపు ప్రసంగంలో చల్లాకు హితవు చెప్పారు.

'పిల్'గా మద్రాస్ న్యాయమూర్తి లేఖ

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎపిలోని నెల్లూరు, గుంటూరు,కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో పంట పొలాల్ని రొయ్యలు, చేపలసాగు కోసం చెరువుగా చేసి భూముల్ని నాశనం చేస్తున్నారంటూ మద్రాస్ హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి ఇ.ధర్మారావు రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. చెరువులుగా చేయడంతో భూములు ఉప్పు కయ్యలుగా మారుతున్నాయని లేఖలో ధర్మారావు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల సాయంతోనే ఈ దారుణం జరుగుతోందన్నారు. పంటల కంటే ఎక్కువ డబ్బులిస్తామని దళారులు ఆశలకు రైతులు మోసపోయి పంట భూముల్ని చెరువులుగా తవ్వేస్తున్నారన్నారు. రోజూ అనేక ఎకరాల పంట భూములు చెరువులుగా మారిపోతున్నాయని, కొన్నాళ్లకు పంట భూములే లేకుండా పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. ఈ దారుణాన్ని అడ్డుకోవాలని, పర్యావరణాన్ని కాపాడాలని ధర్మారావు రాసిన లేఖను పిల్‌గా తీసుకున్న హైకోర్టు విచారణ జరపనుంది.

పాల కల్తీపై ప్రజాహిత వ్యాజ్యం

మన తెలంగాణ/హైదరాబాద్ : హైదరాబాద్ మహానగర ంలో సరఫరా అవుతున్న పాలల్లో చాలా వరకు కల్తీవేనని ఒక పత్రికలో వచ్చిన కథనాన్ని హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా తీసుకుంది. నల్లగొండ నుంచి నర్సింహారావు రాసిన లేఖను హైకోర్టు పిల్ కమిటీ పరిశీలించి విచారణకు యోగ్యంగానే కథనం ఉందని నిర్ణయించింది. దాంతో తెలంగాణ రాష్ట్ర పశు సంవర్థక, పాల ఉత్పత్తుల శాఖ ముఖ్య కార్యదర్శి, డెయిరీ డెవలప్‌మెంట్ కోపరేషన్ లిమిటెడ్ ఎండీ, నాచారంలోని రాష్ట్ర ఆహార భద్రతా శాఖ చీఫ్ పబ్లిక్ అనలిస్ట్‌లను ప్రతివాదులు చేశారు.
ందని అధికారులు పేర్కొన్నారు.

ప్రజాస్వామిక శక్తుల ఐక్యత : నారాయణ



మన తెలంగాణ/ న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని సిపిఐ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన 69వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ జెండావందనం చేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి కమ్యూనిస్ట్ పార్టీలతో ఇతర లౌకిక ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశంలో రాజ్యాంగ విలువలకు బయటి శక్తుల నుండే కాకుండా,అధికారపార్టీకిసిద్ధాంత పరంగా మార్గదర్శకత్వం చేసే శక్తుల నుండి ముప్పు ఎదురవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశా రు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పల్లబ్ సేన్‌గుప్తా, బినయ్ విశ్వం, పార్టీ కేంద్ర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూయార్క్ వర్శిటీ ప్రతినిధితో ఎపి మంత్రి లోకేష్ భేటీ

దావోస్: న్యూయార్క్ వర్సిటీ ప్రతినిధి సైమెన్‌తో ఎపి మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. పాలనలో కొత్త ఆవిష్కరణలు, డ్యాష్ బోర్డ్, పెరఫార్మెన్స్ మేనేజ్‌మెంట్‌లో సహకరించాలని మంత్రి లోకేష్ కోరారు. ఎపిలో న్యూయార్క్ యూనివర్సిటీ ఇన్నోవేషన్ గవర్నమెంట్ ల్యాబ్ ఏర్పాటు చెయ్యాలని మంత్రి కోరారు. ఏపీలో ఇన్నోవేషన్ ల్యాబ్ ఏర్పాటుకు న్యూ యార్క్ వర్సిటీ ప్రతినిధి మంత్రికి హామీ ఇచ్చారు. ఇన్నోవేషన్ ల్యాబ్ ఏర్పా టుతో గ్రామీణ ప్రాంత ప్రజలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసే అవకాశముందని నారా లోకేష్ చెప్పారు

అన్నాడిఎంకె నుంచి 50మందికి ఉద్వాసన

చెన్నై: అన్నా డిఎంకె పార్టీ నుంచి 50మంది కిపైగా నాయకులను పార్టీ అధినాయకులు ఓ.పన్నీర్‌సెల్వం, కె.పళనిస్వామిలు బహిష్కరించారు. క్రమశిక్షణ వేటు పడిన 53మంది పార్టీ కాంచీపురం సెంట్రల్ యూనిట్‌కు చెందినవారు. అలాగే పార్టీ ట్రేడ్ యూనియన్ విభాగానికి చెందిన ఐదుగురు(అన్నా తోజీర్సంగ పెరవై)ని కూడా బహిష్కరించారు. వారిని అన్ని పోస్టుల నుంచి, ప్రాథమిక సభ్యత్వాల నుంచి తొలగించినట్లు కోఆర్డినేటర్లు పన్నీరుసెల్వం, పళనిస్వామిలు తెలిపారు. పార్టీ నుంచి విడిపోయిన దినకరన్‌కు ప్రధాన శక్తులుగా ఉన్న పలువురిని ఇంతకు ముందు కూడా బహిష్కరించారు.

నాకు పద్మ శ్రీ వద్దు సిద్దేశ్వర స్వామి



బెంగళూరు : జ్ఞాన యోగాశ్రమం ఆధ్యాత్మిక గురువు సిద్దేశ్వర స్వామీజీ భారత ప్రభుత్వం ప్రకటించిన 'పద్మశ్రీ' పురస్కారాన్ని సున్నితంగా తిరస్కరించారు. తన జీవితంలో ఇప్పటి వరకు ఎటువంటి సన్మానాలు, సత్కారాలకు తాను అంగీకరించలేదని వివరించారు. స్వామీజీ విజయపురకు చెందినవారు. ఆయన ఈ నెల 17 నుంచి ఓ నెల పాటు బస చేయడానికి కలబురగి వచ్చారు. 'బుద్ధిజీ'గా ఆయన సుపరిచితులు. బుద్ధిజీ కలబురగిలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. తాను తన జీవితంలో ఎన్నడూ సన్మానాలను అంగీకరించలేదని చెప్పారు. కొన్నేళ్ళ క్రితం కర్ణాటక విశ్వవిద్యాలయం తనకు గౌరవ డాక్టరేట్ ప్రకటించిందని, దానిని కూడా తాను సున్నితంగా తిరస్కరించానని చెప్పారు. తన తిరస్కరణ వెనుక రాజకీయ కారణాలు లేవన్నారు.

తెలంగాణ భవన్‌లో గణతంత్ర వేడుకలు



మన తెలంగాణ/ న్యూఢిల్లీ : తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెం ట్ కమిషనర్ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 69వ గణతంత్ర వేడుకలనురాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ గణతంత్ర దినోత్సవంలో భాగంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అశోక్ కుమార్ అనంతరం మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టినఅనేక కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. నూతన సంస్కరణలు, సరికొత్త ఆలోచనలతో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందు వరుసలో ఉందని గుర్తు చేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులు ఇప్పటికే కేంద్ర మంత్రిత్వ శాఖలు, సంస్థల మన్నలను పొందిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న మరిన్ని సంస్కరణలతో ప్రపంచ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక గుర్తింపును సాధించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.గణతంత్ర దినోత్సవంలో భాగంగా పిల్లలకు, సిబ్బందికి, పోలీసులకు స్వీట్లు పంచారు. ఢిల్లీ తెలంగాణ భవనలో జరిగన 69వ గణతంత్ర వేడుకల్లో తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్‌తో పాటు, తెలంగాణ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి, సహాయ కమిషనర్ రామ్మోహన్,డివిజనల్ ఇంజనీర్ పూర్ణ చందర్ రావు, తెలంగాణ భవన్ సిబ్బంది, స్కూల్ విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

కెసిఆర్ పాలనలో ఎవరూ సంతోషంగా లేరు

మన తెలంగాణ/హైదరాబాద్:కొరియా, జపాన్, దావోస్‌లలో పర్యటిస్తున్న మంత్రి కెటిఆర్ తన పర్యటనలతో రాష్ట్రానికి ఏమైనా కొత్త పరిశ్రమలను తీసుకొస్తారా అని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి కనుకుల జనార్దన్ రెడ్డి ప్రశ్నించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పరిశ్రమలను ఇక్కడికి తీసుకొచ్చేందుకు మంత్రి కెటిఆర్ పర్యటించడం లేదని, దోచుకున్న సొమ్మును అక్కడే దాచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.పరిశ్రమలువస్తున్నాయని గొప్పలు చెబుతున్నారని, ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రానికి ఎన్ని పరిశ్రమలు వచ్చాయి? ఎంత మందికి ఉపాధి కల్పించారనే విషయమై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను సిఎం కెసిఆర్ మోసం చేస్తున్నారని, ఖాళీ పోస్టులను భర్తీ చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు.

ఢిల్లీకి ముస్తాక్ అలీ టి–20 ట్రోఫీ...




కోల్‌కతా: ప్రతిష్ఠాత్మకమైన ముస్తాక్ అలీ ట్వంటీ–20 ట్రోఫీని ఢిల్లీ కైవసం చేసుకుంది. శుక్రవారం ఇక్కడి ఈడెన్ గార్డెన్‌లో జరిగిన ఫైనల్లో ఢిల్లీ 41 పరుగుల తేడాతో రాజస్థాన్‌ను ఓడించి ట్రోఫీని దక్కించుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. ఉన్ముక్త్ చంద్ అద్భుత బ్యాటింగ్‌తో ఢిల్లీని ఆదుకున్నాడు. రాజస్థాన్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న చంద్ 49 బంతుల్లో 4ఫోర్లు, రెండు సిక్సర్లతో 53 పరుగులు చేశాడు. ఓపెనర్ గౌతం గంభీర్ దూకుడుగా ఆడి తనవంతు పాత్ర పోషించాడు. గంభీర్ 4 బౌండరీలు, ఒక సిక్స్‌తో 27 పరుగులు సాధించాడు. ధ్రువ్ షోరె రెండు సిక్సర్లతో 21 పరుగులు చేశాడు. దీంతో ఢిల్లీ గౌరవప్రద స్కోరును నమోదు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ కేవలం 112 పరుగులకే కుప్పకూలింది. ఢిల్లీ బౌలర్లు అసాధారణ బౌలింగ్‌తో ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. కెప్టెన్ ప్రదీప్ సంగ్వాన్ 14 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. కుల్వంత్, పవన్ నేగిలకు కూడా రెండేసి వికెట్లు లభించాయి. రాజస్థాన్ జట్టులో ఆదిత్య (52) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు.

టైటిల్ వేటకు ఫెదరర్



- గాయంతో చుంగ్ ఔట్
- మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో బోపన్న జోడీ, నేడు వోజ్నియాకి, హలెప్ తుది సమరం, ఆస్ట్రేలియా ఓపెన్



మెల్‌బోర్న్: స్విట్జర్లాండ్ దిగ్గజం, డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్ ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరుకున్నాడు. శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో ఫెదరర్ ప్రత్యర్థి, దక్షిణ కొరియా ఆశాకిరణం హైన్ చుంగ్ అర్ధాంతరంగా తప్పుకోవడంతో ఫెదరర్ ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాడు. ఏకపక్షంగా సాగిన పోరులో రెండో సీడ్ ఫెదరర్ 6–1, 5–2 ఆధిక్యంలో ఉన్నప్పుడు చుంగ్ ఆట మధ్యలోనే రిటైర్ అయ్యాడు. దీంతో ఫెదరర్ పూర్తి మ్యాచ్ ఆడకుండానే టైటిల్ వేటకు దూసుకెళ్లాడు. ఆదివారం జరిగే ఫైనల్లో ఫెదరర్ క్రొయేసియా స్టార్ మారిన్ సిలిక్‌తో తలపడుతాడు. కాగా, చుంగ్‌తో జరిగిన పోరులో ఫెదరర్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. తన మార్క్ షాట్లతో అలరించిన ఫెదరర్ ఏ దశలోనూ ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. చూడచక్కని షాట్లతో తొలి సెట్‌ను దక్కించుకున్నాడు. రెండో సెట్‌లో కూడా ఫెదరర్ స్పష్టమైన ఆధిక్యంలో ఉన్నాడు. అయితే గాయం వల్ల చుంగ్ మ్యాచ్ మధ్యలోనే పోటీ నుంచి తప్పుకున్నాడు. దీంతో రిఫరీ ఫెదరర్‌ను విజేతగా ప్రకటించాడు.

ఫైనల్లో బోపన్న జోడీ..


మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్), తైమియా బాబోస్ (హంగేరి) జంట ఫైనల్‌కు చేరుకుంది. శుక్రవారం ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్లో ఐదో సీడ్ బోపన్న జోడీ 7–5, 5–7, 10–6 తేడాతో మార్సెలో డిమోలైనర్ (బ్రెజిల్), మార్టినెజ్ సాంచెజ్ (స్పెయిన్) జంటను ఓడించి టైటిల్ వేటకు అర్హత సాధించింది. ప్రారంభం నుంచే పోరు ఉత్కంఠభరితంగా సాగింది. రెండు జోడీలు కూడా ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా పోరాడాయి. దీంతో మూడు సెట్లు కూడా టైబ్రేకర్ వరకు వెళ్లక తప్పలేదు. తొలి సెట్‌లో బోపన్న జోడీ విజయం సాధించింది. కీలక దశలో ప్రత్యర్థి జంట ఒత్తిడికి గురై వరుస తప్పిదాలకు పాల్పడింది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమైన ఇండో–హంగేరి జంట సెట్‌ను సొంతం చేసుకుంది. అయితే రెండో సెట్‌లో మాత్రం ఫలితం తారుమారు అయ్యింది. ఈసారి విజయం ప్రత్యర్థి జంటను వరించింది. ఇక, ఫలితాన్ని తేర్చే కీలకమైన మూడో సెట్‌లో పోరు యుద్ధాన్ని తలపించింది. రెండు జోడీలు కూడా విజయం కోసం సర్వం ఒడ్డాయి. చివరికి విజయం బోపన్న జోడీని వరించింది. కాగా, మరో సెమీఫైనల్లో 8వ సీడ్ గాబ్రియెల డాబ్రోస్కి(కెనడా), మెట్ పావిచ్ (క్రొయేసియా) జంట విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన సెమీ ఫైనల్లో పావిచ్ జోడీ 6–1, 6–4తో మూడో సీడ్ మకరొవా(రష్యా)–సోరెస్ (బ్రెజిల్) జంటను ఓడించింది. ఫైనల్లో శనివారం జరుగుతుంది.

నేడు మహిళల ఫైనల్..

మహిళల సింగిల్స్ టైటిల్ పోరుకు టాప్ సీడ్ సిమోనా హలెప్ (రుమేనియా), రెండో సీడ్ కరొలిన్ వోజ్నియాకి (డెన్మార్క్) సిద్ధమయ్యారు. ఇద్దరు అగ్రశ్రేణి క్రీడాకారిణిల మధ్య శనివారం టైటిల్ పోరు జరుగనుంది. టాప్ సీడ్ హలెప్ చెమటోడ్చి ఫైనల్‌కు చేరగా, మాజీ నంబర్‌వన్ వోజ్నియాకి పెద్దగా ప్రతిఘటన లేకుండానే తుది పోరుకు దూసుకొచ్చింది. ఇద్దరి మధ్య జరిగే ఫైనల్ నువ్వానేనా అన్నట్టు సాగడం ఖాయంగా కనిపిస్తోంది. ఇద్దరు కూడా ప్రతిభావంతులే కావడంతో పోరుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇద్దరు కూడా ఇప్పటి వరకు ఒక్కసారి కూడా గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ గెలవలేదు. దీంతో ఎవరు గెలిచిన వారి కెరీర్‌లో ఇదే తొలి టైటిల్ అవుతోంది. దీంతో ఇద్దరు కూడా తొలి టైటిల్ కోసం సర్వం ఒడ్డేందుకు సిద్ధంగా ఉన్నారు.







ఇక బౌలర్ల చేతిలోనే..

రసపట్టులో చివరి టెస్టు

జొహనెస్‌బర్గ్: భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న చివరి టెస్టు అనూహ్య మలుపులు తిరుగుతోంది. బౌలర్లు ఆధిపత్యం చెలాయిస్తున్న ఈ మ్యాచ్‌లో కోహ్లి సేన ప్రత్యర్థి ముందు 241 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన సౌతాఫ్రికా శుక్రవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 17 పరుగులు చేసింది. ఇంక రెండు రోజుల ఆట మిగిలివుండడంతో మ్యాచ్‌లో ఫలితం తేలడం ఖాయం. అయితే ఈ మ్యాచ్ శనివారం నాలుగో రోజే ముగిసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చివరి రోజు దక్షిణాఫ్రికా విజయం కోసం మరో 224 పరుగులు చేయాలి. భారత్‌కు తొమ్మిది వికెట్లు కావాలి. ప్రస్తుతం ఇరు జట్లకు సమాన అవకాశాలున్నాయని చెప్పవచ్చు. పిచ్ పరిస్థితిని పరిగణలోకి తీసుకుంటే కాస్త భారత్‌కు అనుకూలంగా ఉందని చెప్పాలి. అయితే లక్ష్యం మరి పెద్దది కాకపోవడంతో గెలుపు కోసం భారత బౌలర్లు సర్వం ఒడ్డి పోరాడక తప్పదు. తొలి ఇన్నింగ్స్‌లో రాణించిన బౌలర్లు ఈసారి కూడా చెలరేగితే సిరీస్‌లో భారత్‌కు తొలి విజయం కష్టమేమి కాదు.

ఆదుకున్న కోహ్లి, రహానె...

అంతకుముందు 49/1 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ చేపట్టిన భారత్‌కు ప్రారంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. రాహుల్ కిందటి స్కోరు వద్దే పెవిలియన్ చేరాడు. తర్వాత వచ్చిన మిస్టర్ డిపెండబుల్ పుజారా (1) కూడా నిరాశ పరిచాడు. దీంతో భారత్ 57 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యత కెప్టెన్ కోహ్లి తనపై వేసుకున్నాడు. అతనికి మురళీ విజయ్ అండగా నిలిచాడు. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన విజయ్ 25 పరుగులు చేశాడు. మరోవైపు ధాటిగా ఆడిన కోహ్లి ఐదు ఫోర్లతో 41 పరుగులు చేశాడు. మరోవైపు అజింక్య రహానె, భువనేశ్వర్, మహ్మద్ షమిలు కూడా అద్భుత పోరాట పటిమతో భారత్ స్కోరును 247కు చేర్చారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన రహానె ఆరు ఫోర్లతో 48 పరుగులు చేశాడు. భువనేశ్వర్ 33 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. ధాటిగా ఆడిన షమి రెండు సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 27 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో మోర్కెల్, ఫిలాండర్, రబడా మూడేసి వికెట్లు పడగొట్టారు.

స్కోరు బోర్డు

భారత్ మొదటి ఇన్నింగ్స్: 187
దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్: 194
భారత్ రెండో ఇన్నింగ్స్: మురళీ విజయ్ (బి) రబడా 25, పార్థివ్ పటేల్ (సి) మార్‌క్రామ్ (బి) ఫిలాండర్ 16, లోకేష్ రాహుల్ (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 16, చటేశ్వర్ పుజారా (సి) డుప్లెసిస్ (బి) మోర్కెల్ 1, విరాట్ కోహ్లి (బి) రబడా 41, అజింక్య రహానె (సి) డికాక్ (బి) మోర్కెల్ 48, హార్దిక్ పాండ్య (సి) అండ్ (బి) రబడా 4, భువనేశ్వర్ కుమార్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 33, షమి (సి) డివిలియర్స్ (బి) ఎన్‌గిడి 27, ఇషాంత్ శర్మ నాటౌట్ 7, బుమ్రా (సి) రబడా (బి) ఫిలాండర్ 0, ఎక్స్‌ట్రాలు 29, మొత్తం 80.1 ఓవర్లలో 247 ఆలౌట్.
బౌలింగ్: ఫిలాండర్ 21.1–5–61–3, రబడా 23–6–69–3, మోర్కెల్ 21–6–47–3, ఎన్‌గిడి 12–2–38–1, ఫెహ్లుక్‌వాయో 3–0–15–0.



దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రామ్ (సి) పార్థివ్ (బి) షమి 4, ఎల్గర్ (బ్యాటింగ్) 11, ఆమ్లా (బ్యాటింగ్) 2, ఎక్స్‌ట్రాల 0, మొత్తం 8.3 ఓవర్లలో 17/1.
బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 4–0–8–0, షమి 4–1–7–1, బుమ్రా 0.3–0–2–0.

సెమీస్‌లో యువ భారత్

అండర్–19 ప్రపంచకప్, 30న పాక్‌తో పోరు



క్వీన్స్‌టౌన్: భారత యువ క్రికెట్ జట్టు అండర్–19 ప్రపంచకప్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 131 పరుగుల భారీ తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. కాగా, మంగళవారం జరిగే రెండో సెమీస్‌లో భారత్ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడుతుంది. బంగ్లాతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 265 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బరిలోకి దిగిన బంగ్లాదేశ్ భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేక 42.1 ఓవర్లలో 134 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లు సమష్టి ప్రదర్శనతో ప్రత్యర్థి ఇన్నింగ్స్‌ను తక్కువ స్కోరుకే కుప్పకూల్చారు. ఓపెనర్ మహ్మద్ నయీమ్ (12), కెప్టెన్ సైఫ్ (హసన్), తౌహిద్ (9), అమినుల్ ఇస్లామ్ (3), ఖాజీ (0) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. పినక్ ఘోష్ (40) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అఫిఫ్ హుస్సేన్ (19), రబియుల్ హక్ (14) తప్ప మిగతావారు ఘోరంగా విఫలమయ్యారు. దీంతో బంగ్లాకు ఘోర పరాజయం తప్పలేదు. భారత బౌలర్లలో శివమ్ మావి, అభిషేక్ శర్మ రెండేసి వికెట్లు పడగొట్టారు. కమ్లేశ్ నాగకోటి మూడు వికెట్లు తీసి జట్టును సెమీస్‌కు చేర్చడంలో ముఖ్య భూమిక పోషించాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌ను స్టార్ ఆటగాడు శుభం గిల్ ఆదుకున్నాడు. బంగ్లా బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న శుభం 9 ఫోర్లతో 86 పరుగులు చేశాడు. కెప్టెన్ పృథ్వీ షా (40), అభిషేక్ శర్మ (50), వికెట్ కీపర్ హార్విక్ దేశాయి (34) కూడా తమ వంతు పాత్ర పోషించారు. చివర్లో బంగ్లా బౌలర్లు వరుసగా వికెట్లు తీయడంతో భారత్ పూర్తి ఓవర్లు ఆడకుండానే ఆలౌటైంది. బంగ్లా బౌలర్లలో నయీమ్, సైఫ్ రెండేసి వికెట్లు పడగొట్టగా, ఖాజీకి మూడు వికెట్లు లభించాయి. కాగా, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ జట్లు అంతకుముందే సెమీస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. సోమవారం జరిగే తొలి సెమీస్‌లో ఆస్ట్రేలియా పసికూన అఫ్గాన్‌తో తలపడుతుంది. రెండో సెమీస్‌లో భారత్ దాయాది జట్టు పాక్‌ను ఢీకొంటుంది.

సింధుకు సైనా షాక్

జకర్తా: భారత స్టార్ సైనా నెహ్వాల్ ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సైనా తన సహచరణ క్రీడాకారిణి పివి.సింధును ఓడించింది. ఏకపక్షంగా సాగిన పోరులో సైనా 21–13, 21–14 తేడాతో టాప్ సీడ్ సింధును చిత్తు చేసింది. ప్రారంభం నుంచే నాలుగో సీడ్ సైనా దూకుడుగా ఆడింది. చక్కని షాట్లతో సింధును ఉక్కిరిబిక్కిరి చేసింది. సైనా ధాటికి సింధు కనీస పోటీ ఇవ్వడంలో కూడా విఫలమైంది. కళ్లు చెదిరే షాట్లతో సింధును కోర్టు నలుములలా పరిగెత్తించిన సైనా తన పూర్వపు ఆటను తలపించింది. చివరి వరకు అదే జోరును కనబరుస్తూ తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో కూడా సైనా ఆధిపత్యం చెలాయించింది. అద్భుత షాట్లతో డిఫెండింగ్ చాంపియన్ సింధుకు కోలుకునే ఛాన్స్ ఇవ్వలేదు. చివరి వరకు అదే ఊపుతో ఆడింది. ఈ క్రమంలో సునాయాసంగా సెట్‌ను గెలిచి సెమీఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. శనివారం జరిగే సెమీస్‌లో థాయిలాండ్ క్రీడాకారిణి రత్చనోక్ ఇంటనన్‌తో సైనా తలపడుతుంది. కాగా, రత్చనోక్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ చాంపియన్ నజోమి ఒకుహరా(జపాన్)ను ఓడించింది.



ఆస్ట్రేలియా ఉత్కంఠ విజయం

ఆడిలైడ్: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఆస్ట్రేలియా తొలి విజయం నమోదు చేసింది. శుక్రవారం జరిగిన నాలుగో వన్డేలో ఆస్ట్రేలియా మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయిన ఆస్ట్రేలియాకు ఈ విజయం కాస్త ఒదార్పు ఇచ్చిందని చెప్పాలి. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 198 పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్లు అద్భుత బౌలింగ్‌తో ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చారు. ఒక దశలో ఇంగ్లాండ్ కేవలం 8 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో చిక్కుకుంది. ఈ దవలో కెప్టెన్ ఇయాన్ మోర్గాన్, మోయిన్ అలీ ఆదుకున్నారు. ఆస్ట్రేలియా బౌలర్లు హాజిల్‌వుడ్, కమిన్స్ పోటీ పడి వికెట్లు తీయడంతో ఇంగ్లాండ్ రెండంకెలా స్కోరును కూడా అందుకోకుండానే సగం వికెట్లను కోల్పోవడం విశేషం. అయితే మోర్గాన్ (33), మోయిన్ అలీ (33) అసాధారణ బ్యాటింగ్‌తో జట్టు పరువును కాపాడారు. మరోవైపు క్రిస్ వోక్స్ వీరోచిత బ్యాటింగ్‌తో జట్టుకు గౌరవప్రద స్కోరును అందించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన వోక్స్ 84 బంతుల్లో ఐదు సిక్సర్లు, మరో నాలుగు ఫోర్లతో 78 పరుగులు చేశాడు. కాగా, ఆస్ట్రేలియా బౌలర్లలో కమిన్స్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. హాజిల్‌వుడ్, ఆండ్రూ టైలకు మూడేసి వికెట్లు లభించాయి. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. బౌలింగ్‌కు సహకరించిన పిచ్‌పై స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు కూడా ఆస్ట్రేలియా తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ 107 బంతుల్లో 15 ఫోర్లతో 98 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మిగతావారిలో మిఛెల్ మార్ష్ (32), వికెట్ కీపర్ పైన్ (25) మాత్రమే రాణించారు.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.